
ఆంధ్రసచిత్రవారపత్రిక




రవి కళా మందిర్
మాయదారి
మల్లిగాడు
ఈస్ట్ మన్ కలర్
దర్శకత్వం: ఆదుర్తి సుబ్బారావు
సంగీతం: కె.వి. మహాదేవన్. పాటలు: ఆత్రేయ



వినూత్న
ప్యారెగాన్
ఎల్ప్పర్
సూటింగ్
ఓహోహ్హో!
సరసమైన ధరలకే!
మనోరంజకమైన
రంగులు...
మనసు దోచే డిజైన్లు!
అన్ని సమయాలలోను
హాయిని గొల్పే సూటింగ్!
ఆధునిక ఫ్యాషన్లకు...
అపూర్వ సూటింగ్!
ప్యారెగాన్
ELPAR
ప్యారెగాన్ ఎల్ప్పార్—నమ్మకమునకు మారు పేరు
● సూటింగ్ ● చీరలు ● ప్యారెగాన్ యొక్క డబ్బును తిరిగి ఇచ్చివేసే ప్రత్యేక గ్యారంటీతో సహా...
ఈ ఆధునిక ఫ్యాషన్ల బట్టలను పేరెన్నికగన్న ఏ స్టోర్‌లోనైనా సరే కొనండి.

వ్యాసాలు

బాబాజీ అనే ఆయనమీద శ్రీ పిలకా గణపతి శాస్త్రి గారి వ్యాసం చదివిన తర్వాత ఈ ఉత్తరం రాయాలనిపించింది. ఇటువంటి వారికి కొందరికి కొందరు అనుకొని శక్తులు ఉన్నాయని ప్రపంచంలో అన్ని దేశాలలోనూ అంగీకరిస్తున్నారు. ఇదంతా

ఉత్తరాలు

వంచన అని వాదించే రోజులు పోయాయి! (పోతే దనుకునే లేక అనేవారు పిడివాదం వదులుకోవరని అనుకోవాలి!) కొత్త విషయాలు తెలిసిన తర్వాత పాత సిద్ధాంతాలని మార్చుకోగల గలగటమే శాస్త్రీయ దృక్పథాన్ని తెలుపుతుంది. అర్థంకానివి 'మాయ' గానే ఉండిపోతాయి కాని అర్థం అయిన తర్వాత 'శాస్త్రం'లో ఒకభాగం అవుతాయి! మరణించిన వారి విగ్రహాలు పెట్టించేవారు, వారి శవాలని దర్శనం చేసుకునేవారు, అనుభవం ద్వారా నిజం తెలుసుకొనటానికి ఇష్టపడక తమ మతాల ప్రవక్తల సిద్ధాంతాలని వదులుకోని వారు—బోడిగుళ్ళు కొట్టించుకుని, పిలకలు పెట్టుకునే వారికి ఏమాత్రం తీసిపోరు! ఇటువంటివారినే ఎవరో 'మానసిక పిలక పండితులు' అన్నారుట!

—జి. రామలింగం. (మద్రాసు)

* * *

స్వర్గీయ కుమార మంగళంగారి గురించి శ్రీరామా రావు (చిరునోముల) గారి అభిప్రాయం వింతగా తోస్తోంది.

ఆమధ్య ఎక్కడో చదివిన గుర్తు. విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీకని నిర్మించబడిన శంకుస్థాపన బాపతు స్తంభం ఒకటి అప్పుడే తుప్పు పడుతుందని. మరి సేలం స్టీల్ లిమిటెడ్‌వారి (ఉద్యోగపు) అడ్వర్ టయిజ్‌మెంట్స్ కూడా అప్పుడే వచ్చాయి. రెండూ ఒకేవిధంగా నడుస్తున్నట్లు భావించుకోమంటారా? చెన్నారెడ్డి, సంజీవరెడ్డి ప్రభృతులు ఏమీ చేయని మాట వచ్చి నిజం. ప్రాంతీయతత్వాలకు అతీతులుగా వీరిని పేర్కొంటే బాగుండి ఉండేదను కొంటాము.

మన అదృష్టవశాత్తు మన నాయకులు మనకు ఇనుప సీలలుగాను. పొరుగు రాష్ట్రాలకు బంగారు సీలలుగాను పనికొస్తున్నారు. తమ రాష్ట్రాన్ని బాగు చేసికోకుండా విశాల భావాల్ని ప్రదర్శించిన మనత మన నాయకులకే చెల్లింది.

శ్రీ కుమార మంగళం మార్క్సిస్టు మేధావి అయినప్పుడు ఆ పార్టీని వదలి ఇందిరాగాంధిగారి సోషలిజం వ్యాప్తి చేయడానికి ఎందుకు పార్టీ మారినట్లో దురూహ్యంగా ఉంది.

అందువలన, అయ్యా! ఈ రాజకీయ నాయకులని ఇంద్రుడు, చంద్రుడు, దధీచి అంటూ ఆకాశానికి ఎత్తివేయ నవసరంలేదనుకొంటాను. ఎటొచ్చీ పొరుగు రాష్ట్రాల మంత్రులు తమ స్వంతానికి కొంత తమ రాష్ట్రానికి కొంత ఉపయోగపడుతూంటే, మన మంత్రులు పూర్తిగా స్వంతానికే ఉపయోగ పడుతున్నారు. అంతే తేడా.

కల్యూరి సత్యరామ ప్రసాద్ (బరోడా)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938–1972)

శుక్రవారం : 7–9–73
శ్రీ ప్రమాదినామ సం॥ భాద్రపద మా. శు. రోజు
సంపుటము : 67 సంచిక : 2
స్థాపితం 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1
విడి ప్రతి వెల 50 పైసలు


విషయానుక్రమణిక

ముఖచిత్రం :
'దేవుడు చేసిన మనుషులు'లో
జయలలిత, కాంచన.

కథలు :

సీరియల్ నవల :

వ్యాసాలు, శీర్షికలు, సినిమా :



అడవిని తగలబెడితే పాములు కూడా నశిస్తాయి
ఉత్పత్తిపై దెబ్బతీసే ఉపయోగంలేని విధానాలు
అక్రమ నిలవ దారుడు
అక్రమ లాభాలు ఆర్జించేవాడు
పెరుగుతున్న ధరలు
తరుగుపోయిన ఉత్పత్తి
అదనపు భారం
ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రేట్ల పెరుగుదల
ఎరువుల కొరత
వ్యవసాయ ఖర్చుల పెరుగుదల
ఆం.ప్ర.వ్యవసాయ దారుడు
చర్య - ప్రతిచర్య
అక్రమ నిలవదారులపై దాడి
ఎరువుల కరువు
ప్రజలు
సి.పి.ఐ.వారు అక్రమ నిలవదారులపై చేసిన దాడి మరింత కరువుకే దారితీసింది

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

రాష్ట్రపతి పాలన

ఏమైతేనేం? రాష్ట్రపతిపాలన మరి ఆరు నెలలు శ్రీరామరక్షగా ఉంటుంది. ఉభయ ప్రాంతాలకూ అంగీకార్యమయిన పరిష్కారం కుదరగలదని శ్రీ కె. పి. పంత్ రాజ్యసభలో ఆశ ప్రకటించినా, ఆంధ్రావనిలో మాత్రం అలాంటి ఆశ మొలకెత్తడం లేదనే తోస్తుంది. పైవారు చెబితేనేగాని వినిపించుకోని తెలుగువారికి తప్పైక్యభావం లేగా — దాదాపు రజోతి ముందాన — కలిగే వరకు ఏ పతిపాలన ఉంటే నేమి అంట?—అన్నారు ఒక వృద్ధ గాంధేయులు. ప్రజాస్వామ్యాన్ని ఎంత ప్రేమించే వారికైనా, ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయానాతారాలు వేసిట కలిగిస్తున్నాయంటే, కాలక్రమంలో వాతో. ఏకీభవిస్తారనే అనుకుంటాను.

రాజ దివాకరులు

'నేను వరంగల్లులో పరీక్షలలో ఒక్క విద్యార్థి కాపీ కొట్టకుండా చూచాను. ఎవరైనా దౌర్జన్యం చేస్తే ఎదిరించడానికి జేబులో రివాల్వరు పెట్టుకునే వాణ్ని' అన్నారు డాక్టర్ రామరాజు. తనకు, డాక్టర్ దివాకర్ల వెంకటావధానికి ఆగస్టు 5వ శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం ఏమ్. ఏ. ఇ. ఎస్. హైమ్యాలు చేసిన సన్మానం సందర్భంలో. అధ్యక్షత వహించిన శ్రీ దేవులపల్లి రామానుజరావు తమ ప్రసంగంలో ఆచార్య లక్ష్మీరంజనం భాషోద్యమ మార్గదర్శులని, ఆచార్య దివాకర్ల వేంకటావధాని తెలుగు సాహిత్యాన్ని ప్రజల వద్దకు తీసుకు వెళ్ళారని, ఆచార్య రామరాజు ఆంధ్రాభ్యుదయోత్సవాలు ప్రారంభించిన మహోత్సాహి అని, తొలి ఉప్పు తిని సాధించగలరని ఆశిస్తున్నానని అన్నారు. ఆచార్య లక్ష్మీరంజనం డాక్టర్ రామరాజు కాలంలో తెలుగు భారతానికి వ్యాఖ్య ఏర్పడాలని, విశ్వవిద్యాలయం ఒక తెలుగు జర్నల్‌ను వెలువరచాలని డాక్టర్ నాయని కృష్ణకుమారి, ప్రజలతో విశ్వవిద్యాలయాలు సంబంధం పెట్టుకోవాలని శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి, పరిశోధనకు ప్రాధాన్య మివ్వాలని శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి మొదలయినవారు సూచించారు. ఈ సన్మానం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్య పదవిని డాక్టర్ రామరాజు స్వీకరించిన, డాక్టర్ అవధాని పదవిని విరమించిన సందర్భంగా ఏర్పాటు చేయబడింది.

ప్రదర్శనాల దినం!

ఆగస్టు 9వ తేదీ ప్రదర్శనాలదినం అంటే సరిపోతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వర్ణకారులు, జీవితభీమాసంస్థ ఉద్యోగులు, రోడ్డురవాణాసంస్థ ఉద్యోగులు విడివిడిగా ప్రదర్శనాలు. ఊరేగింపులు, ధర్నాలు జరిపారు. యూనివర్సిటీకు సంబంధించిన ప్రదర్శనం విద్యార్థులు వివేకవర్ధినీ కళాశాలనుంచి సెక్రెటేరియట్‌కు జరిపిన ఊరేగింపు. రూపాయకు కిలో బియ్యం ఇవ్వాలని, చట్టబద్ధమైన రేషనింగు ఏర్పాటుచేయాలని, కిరసనాయిలు, బొగ్గులు, మందులు మొదలయిన నిత్యావసరాలు న్యాయమయిన ధరకు అమ్మాలని విద్యార్థులు నినాదాలు చేశారు. బిల్డింగు నిధి విద్యార్థులనుంచి వసూలు చేయడాన్ని వారు నిరసించారు. సంఘ శ్రేయస్సు విషయంలో విద్యార్థులు పాల్గొనడం చింతైనా ప్రశంసించదగింది.



డెట్రాయిట్ జనరల్ హాస్పిటల్‌లో ఉన్నత శిక్షణ పొందటానికి ఆగస్టు 15వ బయలుదేరి అమెరికా వెళ్ళిన డాక్టర్ పోకల హరిప్రసాదరావు, ఎం. బి., బి. ఎస్. ఈయన శ్రీ పోకల రామారావు (దక్షిణరైల్వే, మదరాసు) గారి కుమారుడు.

గీతా దీపం!

శ్రీ వేలూరి సహజానంద రేడియోలో ప్రసారంచేసిన గీతా ప్రవచనాలను 'గీతా దీపము' అన్న పేరుతో ముద్రించిన పుస్తకం ఆవిష్కరణోత్సవం ఆగస్టు 13వ కళాభవన్‌లో జరిగింది. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షోపన్యాసంలో భగవద్గీత దైనందిన జీవితానికి అవసరమని, గ్రంథం ఆవిష్కరించిన డాక్టర్ అవధాని భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన అమూల్య బహూకృతి భగవద్గీత అని అన్నారు. డాక్టర్ బి. ఆర్. శాస్త్రి సహజానంద పుస్తకం అతి సహజంగా వుందని ప్రశంసించారు. ప్రారంభంలో శ్రీ దేవులపల్లి రామానుజరావు వేలూరి వంశం సాహిత్యానికి, సంఘానికి చేసిన అపూర్వ సేవను ప్రశంసించారు. శ్రీ సహజానంద తమ పుస్తకాన్ని గురించి చెబుతూ, భగవద్గీత అప్పటి ప్రాచీన భారతానికే కాక, నేటి నవభారతానికి కూడ అవసరమనే దృష్టితో తెలిగించావన్నారు.


శ్రీ శ్రీహరి భోలేకర్

భోలేకర్ అనగానే ఎవరో మహారాష్ట్రుడని అనుకోకండి; పనహారు అణాల పచ్చి తెలుగువాడు. మహారాష్ట్ర పరిసాద్దులో

ఉండడంవల్ల సేవక వుండేవాడిపేర ఇంటి పేరు ముందుకు వచ్చింది. శ్రీహరి వరి శ్రమ, పెట్టుపోతలు పరమావధి అయిన రైతు కుటుంబంలో నిజామాబాద్ జిల్లా బన్సువాడా బొల్లకపల్లి గ్రామంలో పుట్టారు. బొంబాయి జె. జె. లలితకళా పాఠశాలలో ఐదేళ్లు వివిధ లలితకళలు అభ్యసించి డిప్లొమా పొందారు. ప్రస్తుతం బేగంపేటలో ఎయిర్‌ఫోర్స్‌లో ఛీఫ్ ఆర్టిస్టుగా వున్నారు. 1963లో సాలార్‌జంగ్ మ్యూజియంలో మొదటి ప్రదర్శనం జరిపారు, కరుణరస ప్రధానంగా. 1964 నుంచి పురుష—ప్రకృతి, భారతీయ పురాణ, తత్వశాస్త్ర ప్రధానంగా ఆత్మ విరహ, ఆత్మాగ్రహ, వంటి శీర్షికలతోను, అమూర్త చిత్రాలు గీచారు. 1964లో మద్రాసులో కరువును గురించిన చిత్రాలు ప్రదర్శించారు. శ్రీహరి భావుకుడు. కల్పనాత్మక చిత్రణం చాల ఇష్టం. జూలై చివర కళా భవన్‌లో కరువును గురించిన గ్రాఫిక్ చిత్రాలు ప్రదర్శించారు. గ్రాఫిక్స్ తీయడానికి స్టోనును గాక పర్స్‌పెక్స్ షీట్‌ను బ్లోటార్చ్‌తో వేడిచేసి వాడడం ప్రారంభించినవారు ఆంధ్రప్రదేశ్‌లో ఈయనే మొదటివారు. శ్రీహరి భోలేకర్ ఏ రీతి చిత్రాలు గీచినా, కరుణ, తత్వచింతన. అమూర్తత, స్వాప్నికత, గ్రామ జీవనం—ఏ ఇతివృత్తంతో గీచినా, ప్రతిదానికి ప్రాణం గీత; గీతా రహస్యం ఒంటబట్టినవాడు శ్రీహరి. 10 సంవత్సరాలుగా దాదాపు 200 చిత్రాలు గీచారు. ఇంకా 33 వాటన వారు కనుక రెండువేలయినా రచించి కళాకారులకు తాత్విక కళారంగంలో ఆదర్శ ప్రాయులు కాగలరని నమ్మినాము.

ఉపశ్రుతి

రవీంద్రభారతిలో ప్రవేశించాను ఏదో ప్రదర్శనానికి. కొన్ని వరసల కుర్చీలను మడిచి తాళాలు వేశారు. 'ఇవేమిటి? ఏదైనా బోర్డు తగిలిస్తే పోదా?' అనడిగాను. 'భయ్' చేస్టిటీ బెల్టు కదూ. రోమన్ సామ్రాజ్య కాలంలో? దాని అవశేషం ఇది' అన్నాడు సహపత్రికా రచయిత.



"ఐ"

మల్లాది వెంకట కృష్ణమూర్తి



రైల్వే ప్లాట్‌ఫారం చాలా రద్దీగా వుంది. మద్రాస్ వెళ్ళే రైలు ఇంకో అయిదు నిముషాల్లో రావాలి. ప్లాట్‌ఫారం మీద అంతా సామాను పట్టుకుని సిద్ధంగా వున్నారు.

హిగిన్‌బాథమ్స్‌లో పుస్తకాలు అమ్మే అతను, కళ్యాణరావ్, చాలా సేపటి నుంచి ప్లాట్‌ఫారంలో ఓ పక్కగా నిలబడి వున్న ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడి వంక చూస్తున్నాడు.

ఆ కుర్రాడు మామూలుగా లేడు అందరిలాగా. ముఖం నిండా విచారం అలుముకుని వుంది. కొద్దిగా విసుగ్గా చిరాకు వున్నాడు. అతని దగ్గర సామాను కూడా ఏమీ లేదు. అతను కూడా మద్రాస్ వెళ్ళే రైలు కోసం ఎదురు చూస్తున్నట్లుగా వున్నాడు.

కళ్యాణరావుకి ఆ కుర్రాడు తెలుసు. ముఖపరిచయం వుంది, పేరు మొదలైనవి తెలియకపోయినా సరిగ్గా.

కళ్యాణరావ్ హిగిన్‌బాథమ్స్ బండిని ఆ కుర్రాడివైపు తీసుకు వెళ్ళాడు. అతని పక్కనే ఆగి పలకరింపుగా నవ్వాడు అతని వంక చూసి,

ఆ కుర్రాడు కళ్యాణరావుని చూసి చూడనట్లుగా తల తిప్పుకున్నాడు.

'వూరు వెళ్తున్నారా?'

తనే స్వయంగా పలకరించాడు కళ్యాణరావు.

'అవును.'

మాట్లాడకుండా వుండటం మర్యాద కాదు అని సమాధానం చెప్పాడు ఆ కుర్రాడు, మాట్లాడే ఇష్టం లేకపోయినా.

'మద్రాసా?'

'అవును.'

'మీరు ఆంజనేయస్వామిగుడి వీధిలో కదా వుండేది?'

'అవును.'

కొద్దిగా విసుగు ప్రదర్శించాడు అతను.

'బాదం చెట్టు ఇల్లు.'

'అవును.'

'నేను ఆ వీధిలోనే అద్దెకి వుంటాను.'

ఆ కుర్రాడు మాట్లాడలేదు.

'నన్ను చూసే వుంటారు మీరు. నేను మిమ్మల్ని చాలాసార్లు చూశాను, వంటితో రోజూ వుదయం కూరల మార్కెట్ కి

ఉన్నాడట!

ఆ కుర్రాడు హిగ్గిన్‌బాథమ్స్ బండీలో వున్న పుస్తకాల వంక చూస్తూండి పోయాడు మాట్లాడకుండా.

'మీ పేరు?'

'కిరీటి'

'నా పేరు కళ్యాణరావ్'

పరిచయం చేసుకున్నాడు కళ్యాణరావు. ఎవరో వచ్చారు పుస్తకం కొనుక్కోడానికి. ఆ కస్టమర్‌కి పుస్తకం అమ్మి అడిగాడు కళ్యాణరావ్.

'మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తారు మీరు?'

సమాధానం కోసం ఆలోచించాడు కిరీటి. అతనికి తెలియలేదు ఆ ప్రశ్నకి సమాధానం. మౌనంగా వుండిపోయాడు.

'ఎప్పుడు వస్తారు తిరిగి?'

మళ్ళీ అడిగాడు కళ్యాణరావు, మొదటి సారి అడిగితే వినబడనట్లుగా.

'ఏమో?'

'మీరు బి. ఎస్. సి. పాస్ అయ్యారను కుంటాను?'

'అవును.'

'మీ రిజల్ట్స్ వచ్చిన రోజే నేను మీ వీధిలోకి అద్దెకి వచ్చాను. అందువల్ల తెలిసింది.'

కిరీటి దూరంగా వున్న ఐస్‌క్రీం స్టాల్ వంక చూస్తూండి పోయాడు.

'ఇంటర్వ్యూకా?'

'కాదు'

కళ్యాణరావ్ వంక చూడనయినా చూడకుండా చెప్పాడు కిరీటి సమాధానం.

'బేంక్‌కి అప్లికేషన్ పెట్టారు కదా మీరు? ఇంటర్వ్యూకి ఎప్పుడు పిలుస్తారో తెలుసా? మా ఇంటివాళ్ళ అబ్బాయి చెప్పాడు, మీరిద్దరూ కలసి అప్లై చేసారని. రోజూ రాత్రి కబుర్లు చెప్పుకుంటాం మేమిద్దరం పడుకోబోయే ముందు.'

'అలాగా'

ఇంక మాట్లాడకుండా, ముభావంగా వుండటం తనకే చిన్నతనంగా అనిపించి అన్నాడు కిరీటి.

'అవును, అప్పుడప్పుడు మీ గురించి చెప్తూంటాడు.'

తన పేరు, వివరాలు తెలిసి కూడా కావాలని తనతో మాట కలపాలని తానే పేరు మొదలయినవి అడిగాడని గ్రహించాడు కిరీటి.

'మద్రాసులో ఎక్కడ వుంటారు?' అడిగాడు కళ్యాణరావ్.

'ఏమో?'

'అదేం?'

కిరీటి ఆలోచించాడు కొన్ని క్షణాలు. నాన్నమీద కోపం విపరీతంగా ముంచుకు వచ్చింది, తనని అన్ని మాటలు అన్నందుకు.

కళ్యాణరావ్‌తో తనిప్పుడు చెప్పేదంతా తను కనబడటం లేదని తెలిసాక నాన్న కంగారుపడితే, కళ్యాణరావు జరిగిందంతా చెప్తాడు నాన్నకి.

'మా నాన్న తప్పు అంతా' అన్నాడు.

'ఏమిటి?'

'గడ్డం వచ్చాక కొడుకుని కొడుకులా కాక, స్నేహితుడిలా చూసుకోవాలని తెలియదు మానాన్నకి.'

కళ్యాణరావ్ అన్నాడు కొన్ని క్షణాలు కిరీటి మొహంలోకి పరిశీలనగా చూసి.

'కోపంగా వున్నారు మీరు'

కిరీటి మాట్లాడ లేదు.

'ఇంట్లో మీ నాన్నతో పోట్లాడి వెళ్లి పోతున్నారా?'

'పోట్లాట ఏముంది? స్వతంత్రంగా బ్రతకటానికి వెళ్తున్నాను. ఆయన భోజనం పెట్టకపోతే బ్రతకలేననుకున్నారు కామోసు. రిక్షా లాగయినా బ్రతకగలను'

'ఇంట్లో మీ నాన్నగారికి చెప్పే వచ్చారా?' అడిగాడు కళ్యాణరావ్ కొద్దిగా అనుమానంతో.

'ఆయనే వెళ్లి పొమ్మన్నారు.'

'కొడుకుని ఏ తండ్రీ వెళ్లి పొమ్మనటం నాకు తెలిసినంతలో జరగలేదు ఇప్పటి దాకా.'

కిరీటి మౌనంగా వుండిపోయాడు.

'దేనికి పోట్లాట వచ్చింది?' అడిగాడు కళ్యాణరావ్ కిరీటిని.

'ముసలోళ్లకి చాదస్తం ఎక్కువ. చెబితే వినరు. అర్థం చేసుకోడానికి ప్రయత్నించరు ఏ మాత్రం. వాళ్ళు ఏం చెబితే అది వేదం. అక్షరాల పాటించాలి. లేకపోతే తిట్లు, శాపనార్థాలు. ప్రతి చిన్న విషయంలో అంతే.'

'అసలు దేనికి పోట్లాట వచ్చింది మీ మధ్య?' అడిగాడు కళ్యాణరావ్.

'చాలా చిన్న కారణమే.'

ఎవరో వచ్చి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కొనుక్కొని వెళ్లారు.

'చెప్పండి' అడిగాడు కళ్యాణరావ్.

'నా సైకిల్ ఓ స్నేహితుడికి అర్జెంట్‌గా అవసరం వచ్చిందని అడిగితే ఇచ్చాను. మా నాన్నకి సైకిల్ కావాల్సి వచ్చింది. వన్నడిగితే చెప్పాను ఓ స్నేహితుడు తీసుకున్నాడని. వూరుకోవచ్చుగా. ఒకటే సాధింపు. అలాగొడవద్దని చెప్పాను. విన లేదు. గట్టిగా అరిచాను నేను కూడా. 'వూరికే ఇంట్లో కూర్చుని తినే బదులు ఎక్కడయినా ట్యూషన్స్ చెప్పరాదా' అన్నారు.'

'తర్వాత?'

'అంత తిండి పెట్టడం కష్టంగా వుంటే పొమ్మనమని చెప్పరాదా అన్నాను. నీకు అలా వెళ్ళాలనుంటే వెళ్ళమన్నారు. వచ్చేసాను.'

'ఇంత చిన్న కారణానికే వచ్చేసారా?' అడిగాడు కళ్యాణరావు ఆశ్చర్యంగా.

'కేవలం ఇదే కారణం అయితే వచ్చే వాణ్ణే కాదు. అసలు విసిగిపోయాను నేను. బి. ఎస్. సి. పూర్తయిన దగ్గరనుంచి చూస్తున్నాను. నే నేదో వూరికే ఇంట్లో కూర్చోవాలని అనుకొంటున్నాను, వుద్యోగ ప్రయత్నాలు సరిగ్గా చెయ్యటంలేదని ఆయన నమ్మకం. సూటీ పోటీ మాటలు అంటూనే వుంటారు.'

ఓసారి కళ్యాణరావు వంక, మాట్లాడటం మొదలుపెట్టాక, మొదటిసారిగా చూసి అన్నాడు కిరీటి.

'నాకు ఇంక ఆ ఇంట్లో వుండటం కంటె నరకం మరోటి లేదు. ఆ స్థితికి తీసుకువచ్చారు ఆయన. ఎక్కడయినా చిన్న వుద్యోగం దొరికినా చాలని చూస్తున్నాను. వచ్చాక వెళ్ళిపోదామనుకున్నాను. కాని ఇంతలో ఆయనే నాకు దారి చూపారు బయటికి పొమ్మని.'

'మద్రాస్ వెళ్ళి ఏం చేస్తారు?'

'వుద్యోగంకోసం వెదుకుతాను'

'దొరక్కపోతే?'

'నా బ్రతుకు నేను బ్రతకలేకపోను అంత పెద్ద మహానగరంలో.'

చిరునవ్వు నవ్వాడు కళ్యాణరావు.

'కూడా సామాను తీసుకు వెళ్ళటం లేదా?' అడిగాడు.

'లేదు.'

"ఓ"

'కట్టు బట్టలతో వెళ్ళిపోతున్నారా ఇలాగే.'

'అవును.'

'చూడండి. మీరు మరోలా అనుకోపోతే నేను చెప్తాను నాకు తోచింది. నే చెప్పేది వింటారా?'

'చెప్పండి' అన్నాడు కిరీటి.

'ఇప్పుడు మద్రాస్ వెళ్ళగానే ఎక్కడ వుంటారు? వుండేందుకు చోటు లేదు. నిలవ నీడ వుండదు మీకు మద్రాస్‌లో. మన వూరిలా చిన్నది కాదు. మన వూరికి ఇరవై రెట్లు పైనే వుంటుంది.'

'తెలుసు.'

'అంతే కాదు. మద్రాస్‌లో మోసం ఎక్కువ. మీలాంటివాళ్ళు నెగ్గుకు రాలేరు. మీ చదువుకు తగ్గ వుద్యోగం దొరకదు చ వెంటనే. అసలు దొరుకుతుందనే నమ్మకం పెట్టుకుని వెళితే చివరికి బాగా ఇబ్బంది పడతారు. నేనూ చిన్నప్పుడు మీలాగా పోట్లాడి ఇంట్లోంచి లేచి వచ్చినవాడినే.'

కళ్యాణరావు చెప్పటం ఆపి ఓసారి కిరీటి మొహం వంక చూసి మళ్ళీ చెప్ప సాగాడు.

'అవును చాలా అవస్థలు పడ్డాను. చివరికి రాళ్ళు కూడా మోసాను. పట్టుదలతో ఇంటికి తిరిగి వెళ్ళ బుద్ధికాలేదు మళ్ళీ.'

'చిన్న వుద్యోగం దొరక్కపోదు.'

కిరీటి మాటల్లో నమ్మకం ఏ మాత్రం లేదని గ్రహించాడు కళ్యాణరావు.

'మీకు తెలియదు. ఇంట్లోనే మరికొన్ని రోజులుంటే బాగుంటుంది. ఎంత చిన్న వుద్యోగమయినా సరే, వుద్యోగం అంటూ ఒకటి వచ్చేదాకా ఆగండి నా మాట విని. తర్వాత హాయిగా వెళ్ళొచ్చు గాని. నా మాటలు లక్ష్యపెట్టక వెళ్ళిపోయారంటే, వుద్యోగం దొరకకపోగా, చాలా సంవత్సరాలు మీరు చేయకూడని చిన్న చిన్న పనులు చేస్తూ బతకాల్సొస్తుంది.'

కొద్దిగా ఆలోచనలో పడ్డట్టుగా కని పించాడు కిరీటి.

'టిక్కెట్టు కొన్నారా?' అడిగాడు కళ్యాణరావు కిరీటిని.

'కొన్నాను.'

కళ్యాణరావు కిరీటి ఎడంచేతి మణి కట్టు మీద వున్న తెల్లటి చార వంక చూసాడు.

చేతిగడియారం ధరించటంవల్ల ఏర్పడిన చార అది. రిస్ట్‌వాచ్ బెల్ట్ లేదు. రిస్ట్ వాచ్ లేదు ఇప్పుడు. బోసిగా వుంది ఆ చోటు.

'డబ్బెక్కడిది?'

మాట్లాడలేదు కిరీటి.

'రిస్ట్‌వాచ్ ద్వారా వచ్చింది కదూ?'

సిగ్గుపడి తలవంచుకున్నాడు కిరీటి. కళ్యాణరావు తనంటే పడే తాపత్రయం చూసి కళ్యాణరావుని తన స్నేహితుడిగా ఆప్తుడిగా గుర్తించాడు. అలాంటి భావం ఏర్పడిపోయింది మనసులో తనకు తెలియ కుండానే.

ఆప్తులముందే మనిషి ఎక్కువగా సిగ్గు పడతాడు, తన చిన్నతనపు చేష్టలకి. అదే బయటవాళ్ళడిగితే నిర్భయంగా చెప్పేసే వాడు.

'తాకట్టు పెట్టారా, అమ్మేసారా?' అడి గాడు కళ్యాణరావు.

'తాకట్టు పెట్టాను.'

'కొంతదాకా బతికించారు. టిక్కెట్ కేన్సిల్ చేసేద్దాం. తాకట్టు విడిపించండి. తక్కువపడ్డ డబ్బు వేసిస్తాను. తర్వాత ఇవ్వొచ్చు.'

'లేదు. నేను వెళ్ళాలి.'

బింకంగా అన్నాడు కిరీటి. కాని మనసులో పదినిముషాల క్రితంవున్న పట్టుదల, తప్ప కుండా వెళ్ళాలనే ఆలోచన ఇప్పుడు లేవు. కళ్యాణరావు మాటలు, హితబోధ మందులా పనిచేసాయి.

'వెళ్ళాలంటే అలాగే తప్పకుండా వెళ్ళండి కాని ఇవాళకాదు. రేపు రేపు ఇదే బండికి వెళుదురుగాని అంతదాకా మా ఇంట్లో వుండండి.'

'దేనికి రేపటిదాకా ఆగడం?' అడిగాడు కిరీటి విచిత్రంగా.

'ఎందుకంటే, రేపీపాటికి మీ నాన్నగారి మీదవున్న కోపం అంతా ఎగిరిపోతుంది కాబట్టి. కోపం తగ్గితే, ఆలోచించే శక్తి పెరుగుతుంది. అప్పుడు ఇలా ఇల్లు విడిచి వెళ్ళటం ఎంత అసహజమో, మూర్ఖత్వమో మీరే తెలుసుకోగలరు కాబట్టి.'

చిన్నగా నవ్వాడు కళ్యాణరావు కిరీటి

ముఖంలోకి చూస్తూ

'అవునా?' అడిగాడు.

'మా నాన్నకి వేసంటే బాగా లోకువగా వుంది.' వూరికే సంపాదించకుండా ఇంట్లో కూర్చుంటున్నానని అలుసుగా వుంది.'

'ఆయన తప్పులేదు అందులో. మీ అక్కయ్యకి పెళ్ళి చెయ్యాలా? చెల్లెళ్ళిద్దరినీ చదివించాలా? తమ్ముడిని అభివృద్ధిలోకి తీసుకురావాలా? కుటుంబాన్ని పోషించాలా? ఇదంతా ఆయన ఒక్కరివల్లే అవుతుందా? కాదు. మీ సహాయం కోరటంలో తప్పులేదు. కొడుకుమీద కాకపోతే మీరెవరిమీద ఆశలు పెట్టుకుంటారు చెప్పండి?'

కిరీటి మౌనంగా వుండిపోయాడు.

'అదృష్టం. రైలు ఇంకా రాలేదు. రైళ్ళు ఆలస్యంగా నడవటంవల్ల అప్పుడప్పుడు ఇలా మేలుకూడా జరుగుతూంటుంది. సరిగావస్తే ఈపాటికి నా మాటలు వినకుండా మద్రాస్‌వేపు వెళ్ళిపోయుండేవారు.

'అయితే టిక్కెట్ కాన్సిల్ చేసుకోక తప్పదా?'

తనకి ఏ మాత్రం ఇష్టంలేదనే భావం వెల్లడయ్యేటట్టుగా అడిగాడు కిరీటి కళ్యాణరావుని.

తప్పదు సార్. ఇంకో అరగంటలో నా డ్యూటీ అయిపోతుంది. మిగిలిన పుస్తకాలు అప్పచెప్పివస్తాను. ఈలోగా మీరు టిక్కెట్ కాన్సిల్ చేయించి, బయటవున్న హిగ్గిన్ బాథమ్స్‌దగ్గర విదురు చూస్తూండండి.'

'అలాగే.'

'త్వరగా వెళ్ళండి రైలు వచ్చే లోపుగానే.'

గబగబా ప్లాట్‌ఫారంలోంచి బయటకి వెళుతున్న కిరీటివేంక చూసి చిన్నగా నిట్టూర్చాడు కళ్యాణరావు.

వెంటనే బండిని తీసుకుంటూ ముందుకు కదిలాడు. మద్రాస్ మెయిల్ వచ్చేసింది.

కళ్యాణరావు పుస్తకాలు అమ్ముతున్నా కూడా ఓ కన్ను రైల్లో ఎక్కే ప్రయాణీకులమీద వేసి వుంచాడు, మళ్ళీ మనసు మార్చుకుని కిరీటి రైలు ఎక్కుతాడేమోననే భయంతో.

అరగంట తర్వాత బయటవున్న హిగ్గిన్ బాథమ్స్‌దగ్గరకి వెళ్ళాడు కళ్యాణరావు.

కిరీటి ఏదో పుస్తకం కొని చదువుతున్నాడు.

"పదండి" అన్నాడు కళ్యాణరావు కిరీటి భుజంతట్టి.

ఇద్దరూ రోడ్డువైపు నడిచారు.

కళ్యాణరావు రిస్ట్‌వాచ్‌ని విడిపించాడు తాకట్టులోంచి, తన డబ్బుకూడా కొంత కలిపి.

కిరీటి కోరికమీద, కిరీటి ఇంటికి వెళ్ళి, అతన్ని ఎలాంటి పరిస్థితులలోంచి తీసుకు వచ్చిందీ వివరించి, ఇంకెప్పుడూ కొడుకుని అనవసరంగా బాధపెట్టవద్దనీ, ఉద్యోగం వచ్చినప్పుడే వస్తుందనీ చెప్పాడు కిరీటి తండ్రికి.

మొదట బిగిరిపడ్డా, తర్వాత శాంతపడిపోయాడు ఆ ముసలాయన. తన తప్పు కొద్దిగా తెలుసుకున్నాడు.

ఇకనుంచి జాగ్రత్తగా వుంటానని మాటిచ్చాడు కళ్యాణరావుకి.

ఈ సంగతి బయట ఎక్కడా పొక్కనివ్వద్దనీ, అందరికీ తెలిసిపోతే అసహ్యంగా వుంటుందనీ కోరాడు కిరీటి తండ్రి. కళ్యాణరావు వాచీ విడిపించడానికి పెట్టుబడి పెట్టిన డబ్బు అంతా ఇచ్చేశాడు కళ్యాణరావుకి.

కళ్యాణరావుని మెచ్చుకున్నాడు బాగా తనకి, కిరీటికి చేసిన సహాయానికి. ఏదయినా తననుండి సహాయం కావాల్సి వస్తే తప్పకుండా అడగమని చెప్పాడు.

కళ్యాణరావు ఆయన ఇచ్చిన కాఫీ తాగి బయటపడ్డాడు తృప్తితోనిండిన మనసుతో.


నాలుగయిదు నెలల తర్వాత కళ్యాణరావుకి చెప్పాడు, వాళ్ళ ఇంటివాళ్ళబ్బాయి, కిరీటికి ఏదో ఉద్యోగం మద్రాస్‌లో వచ్చిందనీ, రెండు రోజుల క్రితం మద్రాస్ వెళ్ళాడనీ.

చాలా సంతోషపడ్డాడు కళ్యాణరావు.


* * *

దాదాపు సంవత్సరం దాటిన తర్వాత ఓ రోజు కళ్యాణరావు మామూలుగా తన హిగ్గిన్‌బాథమ్స్ తోపుడుబండిని తోసుకు వెళ్తున్నాడు ప్లాట్‌ఫారం మీద ఆగి వున్న మద్రాస్ మెయిల్ ముందు.

ఓ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ ముందు గుమిగూడి వున్నారు నలుగురయిదుగురు



దీపాన్ని గురించి* ధర్మపథం*



బులుసు వెంకటరమణయ్య

అజ్ఞానంవల్ల అయోమయంగా ఉన్న విషయాలు జ్ఞానం మూలంగా సుస్పష్టంగా తెలుస్తాయి. అంటే జ్ఞానం జ్యోతివలెనే వెలుగు నిస్తుంది. అందు వల్లనే అజ్ఞానాన్ని అంధకారంతోనూ; జ్ఞానాన్ని జ్యోతితోనూ పోలుస్తారు.

మన హృదయాల్లో చీకటి (అజ్ఞానం) నశించడానికి జ్ఞానం మాదిరిని మన యిండ్లలో చీకటి నశించడానికి—వెలుగు—జ్యోతి—దీపం అవసరం. గృహంలో నిత్యంగా వెలుగు ఉండాలనీ, చీకటి వుండరాదనీ మన పెద్దలు అంటారు. ఆరోగ్యందృష్ట్యా కూడా ఇది అవసరమే!

పగటిపూట సూర్యుడు ఉంటాడు కాబట్టి వెలుగునకు మరొక ఉపకరణం అక్కరలేకపోయేది. గృహ నిర్మాణం తదను కూలంగానే జరిగేది. సాయంకాలం అయిన వెంటనే చీకటి ఇంట్లో ప్రవేశించకుండా దీపాన్ని వెలిగించాలి. అది సూర్యోదయం అయేవరకూ ఉండాలి. అలా వుండే ఇంటిలో దారిద్ర్యం ఉండదనీ, దీపాల మూలంగా గృహం కలకల లాడుతూ ఉంటుందనీ పెద్దల నామడి.

'రవే రస్తం సమారభ్య
యావత్సూర్యోదయో భవేత్,
యస్య తిష్ఠేత్ గృహే దీపః,
తస్య నాస్తి దరిద్రతా.'

సూర్యుడు అస్తమించినది మొదలు కొని, మర్నాడు తిరిగి సూర్యుడు ఉదయించేవరకూ ఎవరి యింట్లో దీపం ఉంటుందో, వారికి దరిద్రత ఉండదు—అని దీని అభిప్రాయం.

దీపం పెట్టడంలో కూడా ఒక నియమం ఉంది.

'ఆయుర్దః ప్రాఙ్ముఖో దీపః
ధనదః స్యాదుదఙ్ముఖః,
ప్రత్యఙ్ముఖో దుఃఖదోఽసౌ
హానిదో దక్షిణా ముఖః.'

తూర్పు దిక్కున దీపం ఉండినట్లయితే ఆయువు వృద్ధి అవుతుంది. ఉత్తరంగా ఉంటే ధనం లభిస్తుంది. పడమటిదిక్కున ఉంటే దుఃఖం కలుగుతుంది. దక్షిణ దిక్కున అయితే హాని కలుగుతుంది. దీన్ని అనుసరించే ఏ కార్యానికయినా కూర్చుండే టప్పుడు తూర్పుముఖంగా గాని, ఉత్తర ముఖంగా గాని కూర్చోవాలనే నియమం ఏర్పడి ఉండవచ్చు.

చిన్న ఇళ్ళు ఉన్నవారూ, ఒక్క దీపం తోనే కాలం గడపవలసినవాళ్ళూ ఈ రీతిగా దీపం పెట్టడం ఉన్నది.

అన్ని దిక్కులా దీపాలు పెట్టేవాళ్ళకు ఈ నియమం అక్కరలేదు. అన్ని దిక్కులా దీపాలుండడం శుభప్రదమేనట!

రాత్రి సమయంలో ఇంటిలో చీకటి లేకుండా ఉండడమే ముఖ్యంగా కావలసినది.

దీపావళికి గృహంలో వరుసగాలా దీపాలను పెడుతూ ఉంటారు. అది శుభ కరమైనదే కదా! ●

చేతిలో పూలదండతో.

సినిమా ఏక్టర్ అయివుండవచ్చుని కుతూహలంగా చూసాడు కళ్యాణరావు.

హుందాగా, సూటులోవున్న అతను ఆ గుంపు మధ్య వున్నాడు. అంతా అతని మెడలో దండలు వేసారు, చప్పట్ల మధ్య.

గుర్తు పట్టాడు కళ్యాణరావు అత

"ఓ"

డెవరో. తనూ వుత్సాహంగా చప్పట్లు కొట్టాడు, వాళ్ళ ప్రక్కన నిలబడి.

అతను అందరితో కరచాలనం చేసి మాట్లాడుతున్నాడు వుత్సాహంగా. అతని ప్రక్కనే మెడలో—కొన్ని పూలదండలతో ముసలాయన పూలదండతో గుర్తించాడు కళ్యాణరావు.

'ఎవరు ఆయన ?'

తన కుతూహలం దాచుకోలేక అడిగే సాడు కళ్యాణరావు ఆ గుంపులో ఒకతన్ని.

'ఆయన పేరు...'

'తెలుసు. దేనికి పూలమాలలు వేస్తున్నారు తండ్రీ కొడుకుల ఇద్దరికీ ?' అడిగాడు.

'నీకూ నాకూ వేస్తారా? అయినా...!'

'సినిమా ఏక్టరా అతను?'

'కాదు. కలెక్టర్.'

'కలెక్టర్ ?'

'అవును. కలెక్టర్. ఆర్డర్సు వచ్చాయి అనుకొంటాను. మన జిల్లావాడు కాబట్టి అంతా గౌరవిస్తున్నారు. ఇప్పుడయినా తిరిగి రావచ్చు మన జిల్లాకే.'

కళ్యాణరావు కళ్ళు మిలమిల మెరి సాయి ఆనందంతో. వుత్సాహంతో తనే కలెక్టర్ అయినంతగా సంతోషపడ్డాడు.

పుస్తకాల బండిని కొద్దిగా దూరంగా జరిపి, ఆ గుంపులోంచి దూసుకుని లోప లికి వెళ్ళి అన్నాడు.

'కిరీటీ ! కలెక్టరయ్యావని విన్నాను ఇప్పుడే. చాలా సంతోషం.'

'నీవెవరు నువ్వు' అన్నట్లుగా చూసాయి కిరీటి కళ్ళు.

కలెక్టర్ని పేరుపెట్టి సంభోదించేంత ధైర్యంగల ఇతనెవరా అన్నట్లుగా చూసాయి మరికొన్ని కళ్ళు.

'నేను కళ్యాణరావుని.'

కొద్దిగా చిరాకుతో ముడిపడింది కిరీటి నొసలు.

'మీ వందులోనే అద్దెకు వుండేవాళ్ళము నేను. మర్చిపోయారా ?'

'నో !'

కిరీటి అందుకోలేదు కళ్యాణరావు చాపిన చెయ్యిని మరో పెద్దమనిషి చెయ్యిని అందుకుని, కరచాలనం చేసి నవ్వుతూ మాట్లాడుతున్నాడు అతనితో, కళ్యాణరావు తన ప్రక్కనే వున్నాడన్న సంగతి గ్రహించ నట్లుగా.

గుంపులోంచి బయటపడ్డాడు కళ్ళలో నీళ్ళు మళ్ళు తిరుగుతూంటే. పాపం మనిషిలో 'కృతఘ్నత' అనే చెడ్డని కూడా దేముడు సృష్టించాడన్న సంగతి తెలియదు అందుకే కళ్ళలో నీళ్ళు నిన్న కళ్యాణ రావుకి, ●

ఆంధ్రసచిత్రవారపత్రిక

1973 దీపావళి కథల పోటీ!

రు. 3,000 బహుమతులు

ఇంకా రు. 2,250 ప్రత్యేక బహుమతులు

గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీని నిర్వహిస్తున్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. పోటీకి వచ్చిన కథలలో ఆరింటిని ఉత్తమ కథలుగా ఎన్నుకుంటాము. ఈ కథలలో ఒక్కొక్కదానికి రు. 500 ల చొప్పున బహుమతి యిస్తాము. ఈ బహుమతుల పంపిణీ బాలట్ నిర్వహణకి ముందే జరుగుతుంది. ఉత్తమంగా ఎన్నికైన ఆరుకథలని దీపావళి ప్రత్యేకసంచికలో ప్రచురించడానికి ప్రయత్నిస్తాము.


పాఠకుల నిర్ణయం: బాలట్ పోటీ

దీపావళి ప్రత్యేక సంచికలో అచ్చు అయిన 6 కథలలో ఏవి ఉత్తమమైనవో పాఠకులు నిర్ణయించడానికి ఒక బాలట్‌ని ఏర్పాటు చేస్తాము. పాఠకులకి ఈ బాలట్ ఆసక్తికరంగా ఉండటానికి బాలట్—పోటీని కూడా ఒకదానిని నెలకొల్పుతాము. ఈ పోటీ వివరాలు బాలట్ ప్రకటనతోపాటు దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురిస్తాము! పాఠకులచే నిర్ణయింపబడిన వరుసలో మొదటిదిగా ఎన్నికైన కథకి రు. 500, రెండవదిగా ఎన్నికైన కథకి రు. 450, మూడవదిగా ఎన్నికైన కథకి రు 400, నాలుగవదిగా ఎన్నికైన కథకి రు. 350, అయిదవదిగా ఎన్నికైన కథకి రు. 300, చివరి కథకి రు. 250 ప్రత్యేక బహుమతులుగా యిస్తాము. రచయితలందరూ సహకరించి ఎప్పటిలాగే ఈ సంవత్సరం ఈ దీపావళి కథల పోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

నిబంధనలు

1. కథలు ఇంతకుముందు ప్రచురణకాని స్వంత రచనలై ఉండాలి. ప్రతికథతోనూ రచయిత అది తన స్వంత రచనేనని, దేనికీ అనువాదంకానీ, అనుకరణకానీ కాదని హామీ రాసిపంపాలి. ఈహామీలు వేరే కాగితంపై కాకుండా కథ వ్రాత ప్రతిమీదనే రాసి ఉండాలి
2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.
3. వ్రాతప్రతిమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయిత పేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతిమీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరటావు (ఎక్సర్‌సైజు నోట్‌బుక్‌కి రెండు రెట్లు) పేజీలకి మించరాదు.
4. కవరుమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబు చెట్టిస్ట్రీట్, మదరాసు—1'కి పంపాలి.
5 పోటీ గడువు తేదీ 22—9—1973. ఆ తర్వాత మా కార్యాలయం చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.
6. పోటీలో బహుమతి పొందిన 6 కథలని ఆంధ్ర సచిత్ర వార పత్రిక 'దీపావళి ప్రత్యేక సంచిక'లోనే ప్రచురించడానికి ప్రయత్నిస్తాము.
7. 6 ఉత్తమ కథల ఎన్నికకి సంబంధించిన తుది నిర్ణయం ఆంధ్ర సచిత్ర వార పత్రిక సంపాదకునిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటానికి వీలు ఉండదు.
8. బాలట్‌తోపాటు ఎటువంటి పోటీ నెలకొల్పబడినా ఆ పోటీకి సంబంధించిన తుది నిర్ణయాలన్నీ ఆంధ్ర సచిత్ర వార పత్రిక సంపాదకునివే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపటానికి వీలు ఉండదు.
9. కథల వ్రాత ప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పిపంపటానికి సాధ్యంకాదు. (అందుచేత కథల పోటీలో పాల్గొనేవారు తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామా కల కవర్లు పంప నవసరంలేదు.)
10. పోటీకి సంబంధించిన ఏ విషయం గురించి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు. పోటీలో బహుమతి పొందని మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించేముందు తెలుపుతాము.

సీరియల్



చరితార్థులు

ఎస్.ఎస్. ప్రసూన

జరిగిన కథ

రమణమూర్తి, శేఖర్ బాల్య స్నేహితులు. రమణమూర్తి ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. శేఖర్ స్టేట్స్‌కి వెళ్ళి భార్య సుమతితో సహా ఇండియాకు వచ్చి రమణమూర్తిని చూడ్డానికి వచ్చాడు. రమణమూర్తి భార్య ఇందిర, సుమతి ఇద్దరూ ప్రాణ స్నేహితులు. శేఖర్‌కి పేకాటపిచ్చి. రమణమూర్తికీ అలవాటు చేశాడు. శేఖర్ రిజైన్‌చేసి హైదరాబాదు మారడానికి ప్రయత్నాలు చేశాడు. మామగారు పోవడంతో ఊరు బయల్దేరింది ఇందిర పిల్లలతో. తండ్రి రమణ పేరుతో వీలునామా రాయడం చాలమందికి కష్టం కలిగించింది. మిగిలిన వ్యవహారాలని లాయర్‌గారికి అప్పగించి చెల్లెలు శిరీష్‌ని తీసుకుని తిరిగి వచ్చాడు రమణ. శేఖర్, సుమతి వెళ్ళిపోయాక ఇందిర [illegible] అయిపోయింది. రాజారావుని ప్రేమించింది శిరి. ఇందిర ఆమెకి వదిన. వదినతో రాజారావు విషయం చెప్పింది. విజయసారధి, శిరీష్‌రాణికి స్నేహితుడయ్యాడు. చాలకాలం తర్వాత శేఖర్, రమణ మళ్ళీ ఉల్లాసంగా కలుసుకున్నారు. శిరి ప్రవర్తన విజయసారధిని బాధించింది. శిరి విజయసారధుల వివాహం జరిగి అత్తవారింటికి వెళ్తుంది. తల్లి పేర క్లినిక్ తెరిచాడు విజయసారధి, మంచితనంతో ఎక్కువ మందిని ఆకర్షించ సాగారు.

17

పాట ముగిసి గజ్జెలరవళులు ఆగిపోయినా ఆ మైకంలోంచి తేరుకోలేదు వాళ్ళు. ఆమె దోసిలినిండా పూలుతెచ్చి సారధి తల మీద గుమ్మరించి-పద్మంలాగా దోసిలిపట్టి అతడి ముందు మోకరిల్లి,

'ఈ పాదదాసి—తమ అనుగ్రహాన్ని కోరుతున్నది బాబూజీ' అన్నదామె—అతడామె వంక విస్తుపోయి చూశాడు. మెల్లగా విడీ విడని పెదాలు విచ్చి మనోహరంగా నవ్వి-కనుసన్న చేసిందామె. అంతా అతడి వంక ఈర్ష్యగా చూస్తున్నారు. కళ్ళప్పగించి అతడలాగే చూడసాగాడు. ఆమె అతడి చేయి మృదువుగా పట్టుకున్నది. ఆచేతి స్పర్శ అతడికి కంపరం కలిగించింది. హృదయగతమైన సంస్కారం మేల్కొని — మైకంలో పడిన అతడి మనస్సుని హెచ్చరించింది. అప్పటికి తనేస్థితిలోవున్నాడో అతడికి తెలిసి వచ్చింది. తన చుట్టూ చూశాడు. ఆమె వంక చూశాడు. క్రోధంతో అతడి ముఖం జేవురించింది. తనచేయి చూసి పామును ముట్టుకున్నట్లు వొడలు జలదరించి—వొక్క వూపున విదిల్చుకుని లేచి నిలబడి జేబులో చేయిపెట్టి అందినన్ని నోట్లు తీసి ఆమెమీదకు విసిరి అసహ్యంగా ఒక్కచూపు చూసి పెద్ద పెద్ద అంగలతో వాకిట్లోకి నడిచాడు సారధి. జగన్ ఆమెకేదో మెల్లగా చెప్పి తానూ సారధి వెనుకనే వచ్చాడు. దారిలో ఇద్దరూ మాట్లాడలేదు. ఇంట్లో అడుగు పెడ్తూనే క్రోధంతో వూగిపోతూ జగన్ చొక్కాకాలరు పట్టుకుని,

'ఛీ! రాస్కెల్ నువ్వింత భ్రష్టుడవనుకోలేదు. నీ భ్రష్టత్వం నాకూ పురమాయించి చూశావు నిన్నేం చేసినా పాపంలేదు' అన్నాడు పళ్ళు కొరుకుతూ సారధి.

'నిజమే! నువ్వింత ప్రవరాఖ్యుడవని నేనూ అనుకోలేదు. అనుకుంటే ఇంత భంగపాటు జరిగేదికాదు' అతని పట్టు వదుల్చుకుంటూ జగన్ నిర్లక్ష్యంగా అన్నాడు.

'అక్కను అందరూ నీలాంటి నీచులనే అనుకున్నావు కాబోలు — అసలు నువ్వు రమ్మనగానే వెక్కడికని అడక్కుండా వెంటబడటం నాదే తప్పు-మిత్రుడివి కదా అని మనస్సున రగిలే బాధ చెప్పుకుంటే ఇదా నువ్వు చేసే వుపకారం. చాలును రా బాబూ—ఇంక త్వరగా ఇక్కడి నుంచి బైటపడితే చాలు' అన్నాడు బాధగా గుండె రాచుకుంటూ సారధి.

'అల్లాగే వెళ్ళు కాని ఇప్పుడు నీకోసం రైళ్ళు—బస్సులు ఏమీలేవు, రేపటి దాకా ఆగవల్సిందే' జగన్‌కు అతణ్ణి చూస్తే సరదాగా వున్నది. సారధికి వుక్రోషం ముంచెత్తింది. చేసేదేమి లేక చరచరా గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయేడు. మనోవేదన కన్నీరై దిళ్ళుని తడిపి వేసింది.

'వూ...హూ లేదు లేదు. నా శిరికి నేను చిన్నడూ అన్యాయం చేయను. తన ప్రేమ నాకు దక్కకపోయినా సరే పరస్త్రీని కన్నెత్తి చూడను. అసలు నేనిలాటి చోటికి వెళ్ళటమే ఘోరమైన అపరాధం. ఈ పాపం శిరిముందు వొప్పుకుని క్షమార్పణ కోరితేనేగాని నాకు శాంతిలేదు. అబ్బా! రేపటిదాకా ఆగాలి. చిన్నియుగంకు ఈ రాత్రి తెల్లవారదుతుందా! ఈ రాతి వేనిలా బాధతో చిత్రవధ అయిపోవాల్సిందే, గత్యంతరంలేదు.' అశాంతిగా గదిలో తాను పిచ్చిగా అనుకుంటూ మంచంమీద పొరల సాగాడు సారధి.

కాస్సేపటికి జగన్‌వచ్చి బలవంతంగా లేపి టేబిల్‌దగ్గరకు నడిపించాడు. టేబుల్ మీద బంగరు రంగుకల ద్రవంవున్న రెండు సీసా సోడాసీసాలు కొన్ని గాజుగ్లాసులు ప్లేట్‌లో చిప్సు జీడిపప్పువున్నాయి. వాటి

శంక చూసి అదిరిపోయి విస్తుపోయాడు

'ఇంకా నమ్మ ముందబోకు నీకు భవిష్యం వుంటుంది ఇప్పటికి వదిలిపెట్టు' అన్నాడు సారధి.

'ఇదేమీ పెద్ద తప్పుకాదు లేవోయ్ చాలమందిచేస్తున్న పనే — అసలు డ్రింక్‌చేయటం ఈనాటి నాగరికతకూడాను. అసలు నువ్వున్న స్థితిలో ఇది చాలా అవసరం — ఎంతటి బాధ అయినా సరే ఇట్టే మరిపించి ఎంతో శాంతి చేకూర్చుతుంది. ఒక్క చుక్క రుచి చూస్తే నీకే తెలుస్తుంది' అని భుజం మీద చేయివేసి వొక్కి కూచోపెట్టి గ్లాసు నోటికి అందించాడు జగన్ —

'వద్దురా ప్లీజ్ — నాకు అలవాటు లేదు' సారధి మొహానికి చేతులు అడ్డు పెట్టుకున్నాడు. కానీ జగన్ బలవంతంతో — సారధి క్షణికమైన బలహీనతకు లొంగిపోయాడు. జగన్ చేతిలో గ్లాసందుకుని కళ్ళు మూసుకుని రెండు గుటకలేశాడు.

గొంతు భగ్గున మండి — వెగటు వాసనకు వాంతి రాబోయి గ్లాసు బల్లమీద వుంచేయబోయాడు.

జగన్ దగ్గరకొచ్చి గొంతురాస్తూ —

'భయపడకురా! మొదట అలాగే వుంటుంది. కొద్ది తాగితే వింత హాయిగా మజాగా వుంటుందో చూడు రేపటినుండీ నువ్వేకావాలని అడుగుతావు' అని ప్రోత్సాహపరుస్తూంటే,

ఆవేశంగా గ్లాసెత్తి గొంతులో పోసుకుని గటగటా తాగేశాడు. చాలా ఘాటైన సరుకది. అదీ మొదటిసారేమో కళ్ళు తిరుగుతున్నట్లు మైకం కమ్మినట్లు గాల్లో తేలిపోతున్నట్లు బాధలన్నీ మరిచి మనస్సు తేలికైనట్లు చిత్రమైన అనుభూతి కలిగి జగన్ వారిస్తున్నా వినకుండా తనే సీసా అంది వంపుకుని గ్లాసుమీద గ్లాసు ఖాళీచేసి ఇముడ్చుకోలేక, భళ్ళున వాంతిచేసుకుని నేల మీదపడిపోయాడు.

పనివాడి సాయంతో సారధిని మంచం మీద పడుకోబెట్టి తన గదిలోకి వెళ్ళిపోయాడు జగన్.

తెల్లవారి పదిగంటలకు గాని మేలుకుని రాలేదు సారధి. ఒళ్ళంతా నొప్పిగా తల దిమ్ముగా వున్నది. రాత్రి సంఘటనలన్నీ సినిమారీళ్ళుగా మస్తిష్కంలో గిరగిరా తిరిగి తను స్వప్నంలో వున్నాడేమోనన్న భ్రాంతి కలిగి కళ్ళు గట్టిగా మూసి మళ్ళీ తెరచి అది కలగాదని తను ప్రత్యక్షంగాపొందిన అనుభవమేనని తెల్సుకుని తన మీద తనకే కోపం అసహ్యం కలిగింది. నేనేమిటి ఇలా పతనమవటమేమిటి? కల్లోనయినా ఇలాటి అనుభవం నాకెప్పుడూ రాలేదు. ఆ రాస్కెల్ జగన్‌గాడేవన్నీ వుచ్చులో బిగించాడు. వాడిలాటివాడని తెలిస్తే ఇక్కడికసలు వచ్చేవాణ్నేకాదు. బుద్ధి గడ్డితిని తనకి బుద్ధిపుట్టింది. ఇంక ఒక్కక్షణం ఇక్కడ వుండకూడదు. మన



చరితార్థులు

...కారకా ఎక్కడికీ వచ్చి మరింత అశాంతి మూటకట్టుకున్నాడు. అని గభాల్న లేచి వాష్‌బేసిన్‌లో మొహం కడుక్కొని హేంగర్ మీదున్న తన దుస్తులు గబగబ బ్రీఫ్ సూట్‌కేసులో కుక్కి చేత్తో పట్టుకుని హాల్లోకి వచ్చాడు సారధి.

అప్పటికే లేచి స్నానం కాఫీ ముగించి హాల్లో సోఫాలో కూచుని పేపరు చూస్తున్న జగన్ సారధిని చూసి నవ్వుతూ విష్ చేసి,

'రాత్రి బాగా నిద్రపట్టిందా' అన్నాడు.

'ఆ! నీ దయవలన హాళ్లు తెలిసిన ఫూల్ నయాను. నీకూ నీ ఆతిథ్యానికి ఒక్క సలాం. ఇంక సెలవిప్పిస్తే ధన్యుణ్ణి' అన్నాడు సారధి కోపాన్ని దిగమింగుతూ.

జగన్ అతడిమాటలకు గట్టిగా నవ్వుతూ.

'ఎక్కడో చిన్న గ్రామంలో ఓ బుల్లి నర్సింగ్‌హోమ్ పెట్టుకుని కాలక్షేపం చేస్తున్నావంటే ఎంతో దయకలిగి పేదలకు సేవచేస్తున్న బుద్ధిమంతుడివి అనుకున్నాం గాని ఇంత రసికశిఖామణివని— ప్రవరాఖ్యుడి ముత్తాతవని అనుకోలేదు. సారీ, నావలన తప్పు జరిగితే క్షమించు. కానీ రేయ్ నీలాటి బ్రహ్మచారులు ఈ రోజుల్లో పనికిరారురా బాబూ. జీవితాన్ని ఖుషీగా ఎంజాయ్ చేయ గలిగే తెలివుండాలిరా, ఆ సంగతి నువ్వెంత త్వరగా తెల్సుకుంటే అంత సుఖపడ్తావు. పదపద నేను స్టేషన్‌కు వస్తాను' అంటూ తానూ సారధి వెంట నడిచాడు జగన్.

* * *

సారధి హైద్రాబాద్ వెళ్ళినప్పటినుండి శిరికి ఏమీ తోచేదికాదు. రోగులపరీక్ష తోనూ వారి ట్రీట్‌మెంటు చూచుకోటం తోను ఎంత సమయం గడిపినా ఇంతకాలం గడవనట్లే విసుగ్గా వుండేది. సారధి లేని లోటు బాగా ఫీలవసాగింది. నాలుగు రోజులు అతడు వూరువెళ్ళితే ఇంత బెంగగా దిగులు గుండటం ఆమెకే సిగ్గనేలుగా అన్పించింది. ఆ ఆలోచనలు విరమించుకోవాలని ప్రయత్నించినా విఫలమయ్యేది. ఆమెకు తెలీకుండానే ఆమె మనస్సును తస్కరించాడు సారధి. ఎంత తప్పించుకోజూచినా అనుక్షణం అతడి చుట్టూ ఆమె ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి! ఈ మార్పు ఎలా వచ్చిందో? అని ఆమెకే ఆశ్చర్యమవుతూంది. శృంగారకావ్యాల్లోని విప్రలంభ స్థితిలోవున్న తన స్థితికి తానే సిగ్గిలిపోతూ కోపగించుకుంటూంది. సారధి సమక్షంలో ఎప్పుడూ ఇలాటి భావసంచలనానికి లోను కాలేదు. అతడి పరోక్షంలో తన మనస్సు ఇలాటి విచిత్రగతుల్లో పరుగులు తీయటం వింతగావున్నది. ఈ ఆలోచనలనుండి పారిపోయేందుకు హాస్పిటల్‌లో వార్డులో ఎక్కువ సమయం గడిపేది. అయినా అక్కడా ఆమెకి శాంతి కలగలేదు. ఎప్పుడూ లేనిది రోగులమీదా నర్సులమీదా విసుక్కుంటూంటే వాళ్లు తెల్లబోయి చూస్తుంటే తన అసహనానికి తనకే చికాకు కలిగి అక్కడ నిలవలేక ఇంటికివచ్చి తన గదిలో దూరి తలుపులు బిగించుకునేది.

ఇలా అశాంతితో వేగిపోతూ సారధికొరకై ఎదురు చూడసాగిందామె. ఆమె సహనాన్ని పరీక్షించటానికన్నట్లు అతడు వస్తానన్న రోజుకి మరో నాలుగురోజులు ఆలస్యమే చేశాడు.

సారధి వచ్చేసరికి ప్రఫుల్ల వదనంతో ఎదురైన శిరిని చూసి సారధి అంతరంగంలో ఆనందలహరి పొంగి పొర్లింది. అంతలోనే అతడి మనసు ముడుచుకుపోయి ఆమెవంక చూస్తే ధైర్యంలేక తప్పించుకు లోపలకు నడిచాడు. తరువాతకూడా ఆమెతో మునపట్లా ఫ్రీగా వుండలేకపోయాడు. ఆమె వుత్సాహంగా అన్ని సంగతులు చెప్తున్నా విని విననట్లుండేవాడు.

అతడు హైద్రాబాద్‌లోపొందిన బాధాకరమైన అనుభవాలు ఆమెకుచెప్పి గుండె బరువు దింపుకోవాలని ఎన్నోసార్లు ప్రయత్నించి కలుషత్వం ఎరుగని నిర్మలమైన ఆమె మోము చూసేసరికి పెదాలు తడారిపోయి నోటమాటరాక పిరికితనం ఆవహించేది. ఆమెకూడా అతడి పట్ల తన వూహాలు కొత్తపంథాలో సాగుతువుండుకు సిగ్గుపడగా మునపటి చనువు చూపలేకపోయింది. అలా కొద్దిరోజులు దూరదూరంగా వుండి నెమ్మదిగా ఎవరి మనస్సున భావాలు వారే నొక్కిపట్టి మామూలుగా మసలసాగేరు.

శిరికి తలనొప్పిగా వుండి ఆరోజు హాస్పిటల్‌కు వెళ్లలేదు. సారధి ఒక్కడే వెళ్లి రోగుల్ని చూసి ఇవ్వాల్సిన మందులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు హాస్పిటల్ స్టాఫ్‌కు అప్పగించి ఇక ఇంటికి వెళ్దామనుకుంటూ వుండగా...

పన్నెండేళ్ల అమ్మాయిని చేతులమీద మోసుకువచ్చారు నలుగురు మనుష్యులు. కడుపునొప్పితో విలవిల కొట్టుకుంటూంది. వాంతులవుతున్నాయి. స్పృహలేనట్లు మగతగా వున్నది. వెనగ్గా పిల్ల తల్లి కాబోలు నెత్తీనోరూకొట్టుకుని రాగాలు తీస్తోంది. తండ్రి కాబోలు గంభీరంగా చూస్తూ ఆమెను గదమాయిస్తున్నాడు.

ఇద్దరు నర్సులు గబగబా వెళ్ళి స్ట్రెచరు మీద ఆ అమ్మాయిని తీసుకువచ్చి గదిలో బల్లమీద పడుకోబెట్టేరు. సారధి వచ్చి చూసి,

'ఇంత ఆలస్యంగా తీసుకువచ్చారేం — ప్రాణంమీదికొచ్చేదాకా ఆగకపోతే - మా ప్రాణంమీదికి తెస్తారు' అని విసుక్కుంటూ అన్నాడు.

'ఇప్పుడే అరగంట అయిందండీ. మామూలు కడుపులో నొప్పే అనుకున్నాం. ఇంత ముంచుకువస్తుందని అనుకోలేదు' అని దబాయించారు ఆ అమ్మాయితో వచ్చిన పెద్దలు.

'ఫరవాలేదుగా బాబూ? అమ్మాయిని మీ చేతిలో పెట్టాం. పిల్ల ప్రాణం నిలుపుతారో మీదేభారం' అంటూ రాగం పెంచింది ఆ పిల్లతల్లి.

సారధి తిరిగి గదిలోకి వచ్చి పరీక్ష చూశాడు. ఎక్కడో కొట్టుకుంటోంది. టేబుల్ మీద పడుకోపెట్టేసరికే షాక్ స్టేజిలో వున్నది. కనపడుతున్న చిహ్నాలనుబట్టి— ఎక్యూట్ - ఎపెన్‌డిసైటిస్ అని అనుమానించాడు. 'ఎపెండిసెక్టమీకి' థియేటర్ రెడీ చేయమని నర్సు —కాంపౌండర్లకి చెప్పాడు. మళ్ళీ ఎందుకో అతడికి అనుమానం కలిగింది. సమయానికి శిరి దగ్గర లేదు. తప్పనిసరై అతడే—ఫిజికల్ సైన్సు సింప్టమ్స్ ఎలాగున్నా ఒక్కసారి పి. వి. చేస్తే మంచిదనుకుని పి. వి చేశాడు. కోపంతో విజయసారధి ముఖం జేవురించింది. కాని సంబాళించుకున్నాడు. శిరీష్‌ను వెంటనే రమ్మని హాస్పిటల్ ఆయాను ఇంటికి పరిగెత్తించాడు.

శిరీష్ కబురు వింటూనే వచ్చింది. అతడు చెప్పినదాన్నిబట్టి— ఆ అమ్మాయిని

పరీక్షచేసి—ఆటడి డయాగ్నొసిస్‌తో ఏకీ భవించింది. అది ట్యూబల్ అబార్షన్ కేసు. ఆలస్యమయితే ప్రాణానికే ముప్పు. ఇద్దరూ కల్సి క్షణాలమీద ఆపరేషన్ చేశారు. ఆప రేషన్ సక్సెస్‌ఫుల్ అయింది. గంట తరు వాత అమ్మాయిని స్పెషల్ రూమ్‌లో సిద్ధపర్చిన బెడ్‌మీదకు చేర్చి, తీసుకోవల్సిన జాగ్రత్తలు, స్టాఫ్‌కు చెప్పి నుదుటపట్టిన చెమట తుడుచుకుంటూ ఇవతలకు వచ్చారు సారధి, శిరీష్‌లు.

బైట వేచివున్న అమ్మాయి తల్లీ, దండ్రులు, తదితరులు—

'ఆపరేషను చేశారా? అమ్మాయి కులా సేనా? మేము చూడవచ్చా' అని గబగబ ఆత్రంగా అడిగారు.

'ఒక గంట తరువాత అమ్మాయికి తెలివి వస్తుంది. ఆమెకు విశ్రాంతి చాలా అవసరం—గొడవ చేయకుండా జాగ్రత్తగా వుండవలసిందని' చెప్పి—నర్సుకు మరో సారి హెచ్చరించి ఇంటికి వచ్చారు.

మరునాడు శిరి వెళ్ళేసరికి ఆ అమ్మాయి బాగా కోలుకున్నది. కానీ ఎవరితోనూ మాట్లాడటంలేదు. తల్లి—దండ్రి ఎంత బ్రతిమాలినా కాఫీ అయినా తీసుకోకుండా అదేపనిగా ఏడుస్తోందని నర్సు చెప్పింది.

శిరి వెళ్ళి ఆప్యాయంగా ఆ పిల్ల తల మీద చేయివేసి—

'ఇలా ఏడ్చి గొడవచేస్తే ప్రమాద మమ్మా! బాగా విశ్రాంతి తీసుకుంటూ ధైర్యంగా వుండాలి. పాలుగాని, హార్లిక్సు గాని కొంచెం తీసుకో' అని ఆదరంగా చెప్పింది.

శిరిని చూసి ఆ పిల్ల మరింతగా ఏడుస్తూ—

'డాక్టర్ నన్నెందుకు బ్రతికించారు? నేను బ్రతకను—చచ్చిపోతాను' అంటూ చేతుల్లో ముఖం కప్పుకున్నది.

శిరికి ఏమీ అర్థంకాలేదు! 'ఏమిటంటి' ఆ పిల్ల తల్లి నడిగితే—ఆవిడ ఏదో శిరికి అర్థంకాని రీతిలో చెప్పింది. తండ్రి మొహం చాటు చేసుకుని బైటకు వెళ్ళేడు. ఇదేదో మిస్టరీకేసులాగా వున్నదని—తరు వాత తీరిగ్గా చూడాలనుకుని— పిల్లను పరీక్షచేసి శరీరస్థితి తృప్తికరంగా వున్న దని భయం లేదని మరోసారి చెప్పి మిగతా రోగుల్ని చూసేందుకు వెళ్ళింది శిరి.

ఇన్‌పేషంట్సుని చూసి—అవుట్ పేషం ట్సుని పరీక్షించి మందులిచ్చి వచ్చేసరికి మధ్యాహ్నం రెండుగంటలయింది. అప్పటికి సారధి పనికూడా పూర్తి అయింది.

ఇద్దరూ కల్సి ఆ పిల్లవున్న రూమ్‌కు వచ్చారు. ఆ పిల్ల తండ్రీ తల్లీ తప్పిత రులు-భోజనానికి ఇంటికి వెళ్ళారుట.

ఆ అమ్మాయి ఇంటికప్పుకేసి చూస్తూ నిశ్శబ్దంగా కన్నీరు కార్చుతోంది. సారధి, శిరిలకు ఆ అమ్మాయిని చూస్తే జాలి వేసింది.


'తనకొచ్చిన భయమేమీ లేదని—అసలు సంగతేమిటో చెప్తే తగు సహాయం చేస్తా' మని శిరి ఎంతో నమ్మకంగా చెప్పిన మీదట—ఆ అమ్మాయి పేరు నీరజ—తన కథ ఇలా చెప్పసాగింది.

నీరజ సిటీలో పిన్నతల్లిదగ్గిర వుండి బి. కాం. ఫైనల్ చదువుతున్నది. తన క్లాస్‌మేటు ఫణిమాలతో కల్సి వారింటికి తరుచు వెళ్తూండేది. అలా వెళ్ళినప్పుడు ఫణిమా అన్న సతీష్‌తో పరిచయం అయింది. అతడు రిసెర్చి స్టూడెంటు. క్రమంగా పరిచయం ప్రణయంగా మారింది.

నీరజ శ్రేయస్సుకోరిన ఫణిమా. ఈ సంగతి గమనించి—

తమ మతాలు ఒకటి కాదని—ఉత్త రోత్తరా ఏర్పడే చిక్కులు ఎదుర్కోవటం కష్టమని, ముందుగానే వివేకంతో జాగ్రత్త వహించటం ఉభయత్రా శ్రేయస్కరమని' నీరజకు ఎంతో చెప్పింది.

కానీ, నీరజ ఫణిమా మాటలు చెవి కెక్కించుకునే స్థితిలో లేదు. అతడూ ఆమె సంకేత స్థలాల్లో కల్సుకుంటూనే వున్నారు. ఫైనల్ పరీక్షలు దగ్గిరకు వస్తున్నా నీరజకు ఆ సంగతే పట్టలేదు. వేళా పాళా లేకుండా—అలంకరించుకుని— అభిసారికయ్యి అతన్ని కల్సుకుని సినిమాలు కని–షికార్లని ఇష్టమొచ్చినట్లు కాలం వృధా చేసేది. ఈ సంగతి ఎంతోకాలం దాగలేదు. ఇంట్లో ఎలాగో తెలిసింది. పినతల్లి నెత్తీ—నోరూ బాదుకుని, నీరజ తల్లికి ఉత్తరం రాసింది. వెంటనే నీరజ తండ్రి వచ్చి—చదువు మాన్పించి తనతో తీసుకు వెళ్ళిపోయాడు. నీరజ తల్లీ దండ్రి మూడురోజులు తలలు పట్టుకుని ఆలోచించి, నీరజ మేనబావతో నీరజ పెళ్ళి స్థిరపరిచారు. నీరజ ఎంత ఏడ్చినా ప్రయోజనం లేకపోయింది. సతీష్‌కు తప్ప తన మనస్సులో మరొకరికి స్థానంలేదు. అతడికీ తనంటే అంతటి అనురాగమే వున్నది. ఎలాగయినా తప్పించుకుని సతీష్ దగ్గిరకు వెళ్ళిపోవాలని అవకాశం కోసం చూడసాగింది.



చరితార్థులు

పదిహేనురోజుల్లో పెళ్ళికి ముహూర్తం నిశ్చయమయింది.

ఇటు నీరజ ప్రేమ ఫలితం, ఆమె కడుపులో దినదిన ప్రవర్ధమానమవుతోంది. నీరజ గుండెల్లో సముద్రఘోష మొదలైంది.

ఎవరితో ఏమని చెప్పగలదు. మౌనంగా కన్నీరు కారుస్తూ గదిలోంచి ఇవతలకు వచ్చేదికాదు. ఇంట్లో ఎవరో ఒకరు ఆమెకు కాపలాగా వుండి—ఎక్కడికీ కదిలే అవకాశమూ ఇచ్చేవారుకాదు. ఆమె చెప్పక పోయినా తల్లికి విలగో తెల్సింది.

'పోనీ వాడెవడో వెతికితెచ్చి వాడికే కట్టబెడ్తే పోలా?' అన్న నీరజ తల్లి మాటకు

తారామండలం విత్తుకు ఎగిరి—'కులమూ—మతమూలేని వాడికిచ్చి చేసి తాతలనాటనుండి వస్తున్న పరువు-ప్రతిష్ఠల్ని గంగలో కలపటంకన్నా, అందరం వురిపెట్టుకుని చావటం నయం—పిచ్చి పిచ్చి ఆలోచన్లు చేయకుండా నోరు మూసుకో—అనుకున్న ముహూర్తానికి ఈ పెళ్లి జరగవల్సిందే, మళ్లీ ఎవరన్నా నోరెత్తితే పాడిచిపారేస్తాను' అని హూంకరించి అందరినోళ్ళు మూపెడు నీరజ తండ్రి.

ఏల్లాగో గుట్టుగా ఈ పెళ్ళి కాస్తా జరిపించేస్తే—తరువాత తెల్సినా— పెళ్ళయ్యేకే నెల తప్పిందనీ-నెలలు తక్కువగా పుట్టడు పోమకున్నారా రెందరో వున్నారనీ—దబాయించి-లోకం నోరు మూయించవచ్చును. అలా చేస్తే తమ పరువు పోదు. ఆ అమ్మాయి శీలం పోదు. ఇది నేటి సంకుచిత స్వార్థపరుల ఆలోచనాసరళి—సమాజరీతి—

కానీ నీరజ తల్లికి భయంగానే వున్నది. ఇనెక్కడ బైటపడి పరువు కూల్చివేస్తుందోనని—మళ్లీ అవకాశం చూసి మొగుడితో మొరపెట్టుకున్నది. ఇద్దరు మళ్లీ ఆలోచనలో పడి చివరికో నిర్ణయానికి వచ్చి, నాటు మంత్రసానిని చాటుగా రప్పించి—ఇన్ని నోట్లు దాని చేతిలో పెట్టి నోరు నొక్కి ఏవో మందులు దానిచేత తెప్పించి, నీరజకు తెలీకుండా ఆహారంలో కలిపి తినిపించారు. ఫలితంగా నీరజకు ప్రాణం మీదికి వస్తే—ఆ మంత్రసాని 'నాకు చాత కాదని' చేతిమొహం వేస్తే—తప్పనిసరైఆస్పత్రికి తెచ్చారు.

'ఇప్పుడు చెప్పండి డాక్టర్ నేనెందుకు బతకాలి?' అని రోదిస్తున్న నీరజనిచూస్తే జాలి కలిగి.

'నీకు నేను సహాయంచేస్తాను. ముందు నీ ఆరోగ్యం చక్కబడాలి. మా మందులతో పాటు నీ సహకారంకూడా వుండాలి!' అని వోదార్చింది శిరి.

సారధికి ఇదంతా అగమ్యం గోచరంగా వున్నది. పరువుకోసం కన్న బిడ్డల ప్రాణాల మీదికి తెచ్చే తల్లిదండ్రులువుంటారా? అని ఆశ్చర్యపోయాడు.

మరో వారంరోజులకు నీరజకు కాస్త లేచి తిరగగల్గే వోపికవచ్చింది. నీరజను ప్రోత్సహించి, సతీష్‌కు వుత్తరం రాయించింది శిరీష్. నాలుగురోజుల తరువాత సతీష్‌నుండి లేఖవచ్చింది.

'అతను అలాటి ఆశలేమీ ఆమెకు కల్పించలేదనీ ఆమె తానై అతణ్ణి ప్రోత్సహించిందనీ ఫలితానికి తను బాధ్యుణ్ణి కాదని అతడికి పెళ్ళి సెటిల్ అయిపోయిందని మతాంతర వివాహానికి అతడి తల్లిదండ్రులు ఒప్పుకోరని వారిని ఎదిరించే శక్తి అవసరము తనకులేదని విలాటి ఆశలు పెట్టుకుని తొందరపడి రావద్దని తనవలన పొరపాటు జరిగితే క్షమించి ఇంతటితో మరిచిపొమ్మని, ఆ వుత్తరం సారాంశం. ఆ వుత్తరం పిడుగుపాటై స్పృహకోల్పోయింది నీరజ.

పదిహేనురోజులకు కాస్త కోలుకున్న నీరజకు జీవితంమీద అనురక్తి కలిగించి ఇందిర తనకు చెప్పిన పాఠం నీరజకు అప్పగించింది శిరీష్.

మరునాడు నీరజను డిశ్చార్జి చేశారు.

తనకు జీవితంమీద ఆశ రగిలించి పోయే ప్రాణాన్ని నిలిపి లోకంలోని మోసాల్ని కాలుష్యాన్ని ఎదుర్కొనే ఆత్మధైర్యాన్ని కలిగించిన డాక్టర్లకు నిండు మనస్సులో కృతజ్ఞతగా నమస్కరించి సెలవు తీసుకున్నది నీరజ.

(ఇంకా వుంది)

డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

టి. సత్యనారాయణ. ఆవడి, మద్రాను.

నా భార్యకు క్షయ ప్రారంభ దశలో వున్నదని నిర్ణయించారు. 6 మాసములు మందు వాడాను. వ్యాధి నయమయిందని ఎలా నిర్ణయించాలి. అనారోగ్య జంతువుల మాంసమువల్ల క్షయమొదలగు రోగాలు రావచ్చని మీరు 'డాక్టరు—కబుర్లలో' వ్రాశారు కదా?—అందువల్ల మాంసం తినటం మానేయాలా?

* క్షయ ప్రారంభ దశలో వున్నా సరే కనీసం సంవత్సరం వైద్యం అవసరం. వ్యాధి నయమయినదా లేదా అని పరీక్షచేసి నిపుణులు తేల్చగలరు. మీ అంతట మీరే వైద్యం నిలపకూడదు.

జంతువుల మాంసము తినటంవల్ల క్షయమొ. నవి రావచ్చన్నది యదారమే! అయితే ఆ జంతువులో ఈ రోగలక్షణాలు వున్నప్పుడు తిన్న మాంసములో ఆక్రిములు వున్నప్పుడు రోగం రావచ్చును.

మాంసము అమ్మే ముందు—వెటర్నరీ వైద్యులు సర్టిఫై చేస్తారు (స్లాటర్ హవున్‌లో) అప్పటికీ కొన్ని సమయాలలో వారికళ్లు గప్పి కొందరు మాంసము అమ్మటంవల్ల ఇలా జరిగే అవకాశం వున్నది.

జి. ఆర్. కుమారి, నిడదవోలు.

నా వయస్సు 18 సం. లు. 4 నెలల క్రిందట ఎడమ రొమ్ములో గుండ్రంగా గడ్డలాగా వచ్చింది. నెప్పిలేదు. ఇప్పుడు కొద్దిగా పెద్దదయింది.

* దీనిని 'ఫైబ్రో అడినోమా' అంటారు ఇది చాలా ఫ్రీగా కదులుతూ వుంటుంది. దీనికి శస్త్రచికిత్స ద్వారా నిర్మూలించటమే వైద్యము.

ఎ. రాజగోపాలరావు, తిరువూరు.

నా వయస్సు–21 సం. లు. నాకెంతో ఫేవరిట్ గేమ్ అయిన టెన్నిస్ ఫస్ట్‌సెట్ పూర్తికాంగానే అలసి పోతున్నాను. ఎక్కువగా రొప్పు వస్తున్నది.

* మీలో 'ఎక్సర్‌సైజు టాలరెన్స్' తగ్గుతున్న దన్నమాట. శరీరంలోని, కండరముల, జీవకణముల ప్రాణవాయువు పీల్చే శక్తి తగ్గి ఇలా జరుగుతుంది. ఇదిగాకుండా బ్లడ్ షుగర్ ముఖ్యం. గ్లూకోస్—ఆక్సిజన్ ఈ రెండు కండరముల పనితనానికి ముఖ్యము. కొంచెం ఎక్సర్‌సైజు చెయ్యగానే అలసి పోవటం, నెత్తురులో గ్లూకోస్ తగ్గినదన్న దాన్ని సూచిస్తుంది. రొప్పు రావటం—శరీరంలో ఆక్సిజన్ కొరతవల్ల, బ్రీతింగ్ ఎక్సర్‌సైజు చెయ్యండి. ప్రతి రోజూ వ్యాయామం–కొద్ది కొద్దిగా దూరం పెంచుతూ పరిగెట్టడం. చూశారుగా ఈ మధ్య మన టెన్నిస్‌స్టార్ల సంగతి. ఏ ఆటకైనా ఫిజికల్ ఫిట్‌నెస్ ముఖ్యం.

కే. లక్ష్మణ్ రావు, విశాఖపట్నం.

ఈ భార్యకు 3 నెలల క్రితం 'సిజేరియన్' ఆపరేషన్ చేసి బాబుని తీశారు. డాక్టర్లు మరి 5 సం. ల వరకూ తల్లి కాకూడదు అన్నారు. అందుకై నేను తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

* మీ ప్రశ్న వింతగా వుంది. ఏ చోటయితే పిల్లలు పుట్టకుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారో, ఆచోటే వాటికి మార్గాలు కూడా చెప్పి వుంటారు (అడిగితే).

అయినా విశాఖపట్నమంత పెద్ద వూళ్లో కుటుంబ నియంత్రణకు సలహా చెప్పేవారేలేరా? (మీరడిగినట్లు ఆపరేషన్‌లేకుండా).

జి. రామాంజనేయులరెడ్డి, కొత్తపల్లి

నాకు ప్రస్తుతం 18 సం.ల వయస్సు 8సం.ల వయస్సులో క్రింద పడి ముక్కులోని ఎముక అణిగిపోయింది. అది వికారముగా కనిపిస్తున్నది. ఇప్పుడేదైనా వైద్యం చేసి నయం చేయగలరా ?

* 'ఆర్థోప్లాస్టీ' ద్వారా మీకు తప్పక నయం చేయగలరు. పెద్ద ఆస్పత్రులలో ఆర్థోపీడిక్ డిపార్ట్‌మెంటుతో సంప్రతించండి. ప్లాస్టిక్ సర్జరీ ద్వారా వారు మీ వికారాన్ని పోగొట్టగలరు. ఎముకల కూడికకు వయస్సుతో ఎక్కువ ప్రమేయం లేదు.

కె. నిర్మల, చంద్రగిరి

కళ్ళు మంటలుగా వుంటాయి. తరచూ తలనెప్పి వస్తుంది. కళ్ళ ముందు తీగెల లాగా కనిపిస్తున్నవి.

* మీ కంటియొక్క చూపు—నేత్ర వైద్యుల వద్ద టెస్టు చేయించండి. అద్దాలు వాడవలసివుంటే, తప్పక వాడాలి. కళ్ళ ముందు తీగెలుగా కనబడటం, 'మయోపియా' అంటే హ్రస్వదృష్టి వున్నవారికి సహజము.

ఎ. ఇందూశేఖర్, బొబ్బిలి

మా తమ్ముడికి 4 సం.లో ప్రారంభమై ఇప్పుడు 12 సం.లు అయినా ఫిట్లు తగ్గలేదు. రాయవేలూరులో ఆపరేషన్ చేయమని అడిగాము—చేయలేదు.


* వారు చెప్పినది సరి అయినదే. ఎపిలెప్సీ వున్నప్పుడు, నిరంతరం మాత్రలు వాడవలసి వుంటుంది. ఆపరేషన్ చేయించటం అనేది, ఎందువలన వస్తున్నాయో వాటిని బట్టి వుంటుంది.

వయస్సు పెరిగినకొద్దీ, ఫిట్లు రావటం కొద్ది కొద్దిగా తగ్గవచ్చును. •

వి. రత్నం, హైద్రాబాద్

నాకు పాదాలు మంటలుగావున్నాయి. ఇలా తరచూ వస్తోంది. ఇవి పోవటానికి ఏం చేయాలి ?

* మూత్ర పరీక్ష చేయించుకోవాలి. మూత్రంలో చక్కెర (డయాబెటిస్) వున్నప్పుడు, విటమిన్ 'బి', లోపం. ఇలా రావటానికి కారణాలు. ఈ పరీక్ష తర్వాత 'బ్లడ్ షుగర్'—ఫాస్టింగ్, పోస్ట్ ప్రాండియల్ చేయించుకుని రోగనిర్ధారణ అయిన తర్వాత సరి అయిన మందు వాడవచ్చును. ఈలోగా 'బెరిన్' ఇంజక్షన్లు—బికాంప్లెక్స్ మాత్రలు వాడండి. ●



జీడిపిక్కల కథ

కె.వి.యస్. శర్మ

జీడిపిక్కలు మంటలో వేసినకోతి, నిప్పులోంచి వాటిని తీస్తే వాటా పెడతా నంటుంది పిల్లితో. పిల్లి కాళ్ళు కాలితే కోతికి నష్టంలేదు. వస్తే జీడి పిక్కలు బయటికి వస్తాయి. కాల్తేపిల్లి కాళ్ళు కాల్తాయి. అక్కడే మనకి కోతి తెలివి తేటలు కనిపిస్తాయి. మనం కోతై నప్పుడు బెంగలేదు. కాని పిల్లి అయినప్పుడు, చేతులు కాలకుండా జీడిపిక్కలు తీయడం వస్తేనే నిప్పుతో చెలగాటం ఆడాలని లేకపోతే గంగప్ప పరువుపోయినట్టే మనదీ పోవునని నీతి. ఎవరా గంగప్ప? ఏమాకథ?

గంగప్ప వో రిసెర్చిలాబ్‌లో పన్చేస్తున్నాడు. వో డాక్రేటు, డైరెక్టరు పదవి అతని కున్న స్థిరాస్థి. అతని కింద, ఇంగ్లండు, అమెరికా వెళ్లొచ్చిన చిన్న వాళ్లున్నారు. వాళ్ళశక్తి సామర్థ్యాలు అతనికున్న చరాస్తి. అతనికి అంతర్జాతీయ రంగంలో బోల్డుపేరు, ఉధృతంగా ప్రతిష్ఠ ఉన్నాయి. ఆవన్నీ ఒకఎత్తు అతని కున్న ప్రాంతీయాభిమానం వో ఎత్తు. కాని అదెప్పుడు అవసరం లేక బయట పడలేదు.

ఆ ప్రాంతం నుంచే ఎన్నికై కేంద్రంలో మంత్రిగా ఉంటున్న శివన్న తన నియోజక వర్గంలో వోటర్లకి చాలా వాగ్దానాలు చేసాడు. అందులో ఆ ప్రాంతానికో రేవు పెట్టిస్తానని, దాన్ని ఉపయోగించ టానికి వీలుగా రైళ్లు వేయిస్తానని చేసిన వాగ్దానం చాలా ముఖ్యమైంది. వాటి వల్ల ఆ ప్రాంతంలో చాలా ఉద్యోగాలు పుడతాయని,

అవన్నీ అక్కడున్న వారికి దొరుకుతాయని ఆశపెట్టాడు. అందుకని వోటర్లు అతను మంత్రయ్యాక నిర్దీసారు. అతనిక్కావల సిందదే. ఆ ఊరు పెరిగితే, అతని కున్న ఆస్తి విలువ పెరుగుతుంది. అందుకని 'మా రాష్ట్రానికోరేవూ లేదు' అంటూ కేంద్రంలో వో రికార్డు అరిగేదాకా వేసాడు. కేంద్రం మౌనంగా ఊరుకుంది. మౌనం అర్ధాంగీకారం అన్న అర్ధం చెప్పి రాష్ట్రాన్ని వో బృహత్పథకం తయారు చెయ్యమన్నాడు.

రాష్ట్రం ముందుగా ఆ ఊరు అన్ని విధాల అందమైన ఊరు, అద్భుతమైన ఊరు అని, అక్కడ పోర్టుంటే, ఎగుమతి దిగుమతుల ఖర్చులు తగ్గుతాయని, కాలం కలిసి వస్తుందని వో విజ్ఞప్తి కేంద్రానికి పంపింది. ఆపైన ఆ పోర్టుకి కావలసిన హంగులమీద నివేదికలు తయారు చేయించింది. ఆ పోర్టునుంచి ఢిల్లీ దాకా రైళ్లు ఆ ఊళ్లో మనుషులు తాగటానికి గంగా కావేరి లింకు నుంచి నీళ్లు, వో అయిదు నక్షత్రాల హోటలు, వో చిన్న ఎయిరో డ్రోమ్, పోర్టంటూ ఎల్లాగో ఉంది కనుక చిన్న సైజు నోడలు తయారుచేసే కర్మాగారం దానికి కావలసిన ఉక్కు తయారు చేసేందుకు గాను, ఆ ఊరికి నూరుమైళ్ల దూరంలో ఉక్కు కర్మాగారం...ఇల్లా ప్లాను విస్తరించు కుంటూ పోయింది. ఈ ప్లాను విషయం కదుపుతూ శివన్న 'వాట్ ఆర్ యు వెయిటింగ్ ఫర్?' అని తొందర పెట్టాడు కేంద్రాన్ని. కేంద్రం నవ్వింది.

'ఆలూలేదు, చూలూలేదు. ఆ ఊళ్లో రేవు పెట్టాలంటే ఎల్లా? ముందుగా మీ ఊరు రేవుగా పనికొస్తుందని తేలాలికదా? అందుకని నిపుణుల అభిప్రాయం అడుగుదాం వాళ్లు సరే అంటే...పాకలావ్' అన్నది కేంద్రం.

అక్కడ నేలగట్టి దనం పరీక్షించాలని, కెరటాల ఉధృతాలు కొలిచి ఇసుక మేట వెయ్యకుండా చెయ్యటానికి ఖర్చు పెట్టాల్సిన మొత్తం, మేటవేస్తే డ్రెడ్జి చెయ్యటానికి అయ్యేఖర్చు అవీ లెక్కగట్టి నివేదిక తయారు చెయ్యమని ప్రభుత్వం గంగప్పని కోరింది. ఆలాబ్‌కి ప్రభుత్వం గ్రాంటు లిస్తోంది. ఆలాబ్ సైటుకి దగ్గరలో ఉంది. ఆలాబ్‌నిండా నిపుణులున్నారు. ఇది సాధారణంగా వాళ్లు చేసే రిసెర్చికి సంబంధించిన పనికాదు కనుక ప్రభుత్వం 'సంప్రదింపుల ఖర్చు' భరించాలని గంగప్పకోరాడు. కన్సల్టేషన్ పేరుతో ఎక్స్‌పర్టైజు అమ్ముకోడానికి కొన్నిచోట్ల వీళ్లున్నాయి. గంగప్ప ఆదేవాడుకో దల్చుకున్నాడు.

గంగప్పతో కేంద్రం సంప్రదిస్తోందని తెలుసుకుని శివన్న ఆలాబ్ ఉన్న ఊరు వైపుకి టూర్ వేసుకున్నాడు. చుట్టపు చూపుగా ఆలాబ్‌కి విజిట్ చేసేసాడు. అక్కడున్న వాళ్లు అతనికి వాళ్లు చేస్తున్న ప్రయోగాలు చూపించారు. శివన్న అవసరం ఉన్నచోట, లేనిచోట కూడా అర్ధమైనట్టు తలాడించాడు 'ఇన్నాళ్ల బట్టీ రిసెర్చి చేస్తున్న మనకే మనం ఏం చేస్తున్నామో అర్ధమై చావటంలేదే! ఇతగాడికి అర్ధమైందంటున్నాడేమిటె' అని అమెరికా అవీ వెళ్లొచ్చిన సైంటిస్టులు నవ్వుకున్నారు. ఒకచోట ఒకరకం పునాదులను చూపిస్తూ 'ఇవి పైల్సు...' అనివాళ్లు చెప్పబోతుంటే 'నాకు బొత్తిగా పైల్సంటే తెలియదను కున్నారా! బలే వాళ్లే! అవొస్తే ఎంతలా నొప్పెడ్తాయో అనుభవిస్తున్న నాకు తెలియదా' అన్నాడు శివన్న అక్కడున్న జనాభా బిక్క చచ్చిపోయారు. వాళ్లకి తెల్సిన అమెరికాలో అందరికి అన్నీ తెలియక్కరలేదు. అందుకని తెలియని విషయాలు తెలియవని ఒప్పేసు కుంటారు. ఇండియాలో మంత్రులకి, పాఠకుల ప్రశ్నలకి జవాబు లిచ్చే వాళ్లకి అన్ని విషయాలు తెలియాలి. ఆ విషయం వాళ్లకి తెలియక బిక్క చచ్చిపోయారు. గంగప్ప అందరికంటే ముందు తెలివి తెచ్చుకుని 'ఒకసారి మా మావయ్యకి పైల్సొచ్చి నప్పుడు'— అంటూ సంభాషణని అటువైపు మళ్లించాడు.

శివన్న వెళ్తూ వెళ్తూ 'మీరంతా దేశం బాగుకోసం కష్టపడి పని చెయ్యా'లన్న సందేశం ఇచ్చాడు. ఆ సాయింత్రం వో వ్యాపారి శివన్న గౌరవార్ధం విందు ఏర్పాటు చేసాడు. ఆ విందుకి శివన్న చెప్పి ఆ వ్యాపారి చేత గంగప్పని పిలిపించాడు. ఆ విందుకి శివన్న ఆంతరంగికులు మాత్రమే పిలవబడ్డారు.

గంగప్ప ఆ పార్టీకి వెళ్లి, అక్కడ జేరిన పెద్దమనుషు లందరు మందు పట్టిస్తుంటే కంగారు పడ్డాడు. గంగప్పకి అలవాటు లేకకాదు. అతనికి ఇంగ్లండులో మొదట అదే అబ్బింది. కాని దేశంలో అప్పటికింకా ప్రొహిబిషనుంది. ఒక రవుండు వేసుకున్నాక కాస్త జంకు తగ్గింది. రెండో డోసుకి అందరితో ఫ్రీగా నవ్వ సాగాడు. మూడో డోసు కూడా పడ్డాక శివన్న బుజం మధ్యలో చనువుగా ఒకసారి తట్టి మరీ చెప్పాడు. శివన్న గమనిస్తున్నాడు.

భోజనా లయ్యేసరికి పరిచయం మరింత పెరిగింది. ఆ తరువాత కార్యక్రమంలో ఒక వర్ధమాన నాట్యతార నాట్యం ఉంది. ఆ అమ్మాయి జావళికి అభినయం చెయ్యటం మొదలు పెట్టింది. కృష్ణుడు వేషం కట్టిన అమ్మాయి, మొదటి అమ్మాయి వంటిమీదున్న బట్టలు లాగి పారెయ్యటం మొదలు పెట్టింది. శివన్న హోటళ్లకి వెళ్లి స్ట్రిప్‌టీజ్‌లు చూడడు. అతను పబ్లిక్కుగా నీతిబాహ్యమని అందరు అనుకునే పనులు చెయ్యడు. ఆంతరంగికులు మధ్య వున్నప్పుడు శివన్న చాలా సరసుడు. ఆనాట్యం తదేకంగా చూస్తున్న గంగప్ప నీసారి శివన్న చాలా చనువుగా వో చరుపు చరిచాడు. గంగప్ప ప్రపంచంలోకి వచ్చాడు.

'చూడండి గంగప్పగారు! మనప్రాంతం చాల వెనుకబడి వుంది' అంటూ నాంది పలికాడు.

'ఇన్నాళ్లకైనా కేంద్రం దృష్టిలో మన ప్రాంతం పడింది. అంతేచాలు. ఎప్పటికో అప్పటికి అభివృద్ధి పొందుతుంది' అన్నాడు గంగప్ప సంతృప్తిగా. ఆ సంతృప్తి విందు వల్ల జనించిందేమో అన్న అనుమానంకొద్దీ శివన్న.

'ఇల్లు అలకగానే పండుగ కాదుకదా! ఆ రేవు శాంక్షనవాలి. అంటే మీరు అది మంచిరేవని నిర్ధారణ చేస్తూ రిపోర్టు పంపాలి. అల్లా మీరు పంపడానికి మీకు మనప్రాంతంమీద యదార్ధమైన అభిమానం ఉండాలి.'

'అభిమానం కేం తక్కువలేదు శివన్న గారు...'

'అయితే ఆ బాధ్యత మీమీద పెడుతున్నాను. మీకు తప్పదు. మీరు కాదన కూడదు' అన్నాడు బలవంతపెడుతూ శివన్న.

'లాబ్ అంటే నేనొక్కడినేకాదు కదా! ఎంతోమందున్నారు. వాళ్లందరిని ఒప్పించా లంటే చాలా ఖర్చువుతుంది. ఆ ఖర్చు నల్లటి

డబ్బుగా కాకుండా తెల్లగా సంప్రదింపులకి ఫీజుగా ఇస్తే బావుంటుంది. అది మీరు చేతిలోంచి పెట్టుకో అక్కరలేదు. ప్రభుత్వం పెట్టుకుంటుంది' అన్నాడు గంగప్ప తెలివిగా.

'దాన్దేముంది మీ ఫీజు ఎంతో కాయితం పంపండి. నేను ఓ కె. చేయిస్తాను.' అని భరోసా యిచ్చాడు శివన్న. గంగప్ప సెలవు తీసుకున్నాడు.

లాబ్‌లో మర్నాడు గంగప్ప మీటింగ్ పెట్టాడు. రేవు పెట్టడం విషయంలో కేంద్ర ప్రభుత్వం తమ అభిప్రాయం అడుగుతోందని చెప్పాడు. అతనికింద ఉద్యోగులు గంభీర ముద్ర పట్టారు. అప్పుడు గంగప్ప అందులో డబ్బులు కిడతాయని కేంద్రం బాగానే కన్‌సల్‌టేషన్ ముట్టచెప్తుందని చెప్పాడు. అప్పుడా ఉద్యోగులు కొంచెం బింకం సడలించి చిరునవ్వు ప్రదర్శించారు. అప్పుడు గంగప్ప ఈ విధంగా ఉపన్యసించాడు.

'ఈ లాబ్‌లో మీరు తొమ్మిదిమంది నేను ఒకణ్ణి ఉన్నాం. మొత్తం పది మందిమి. మనం ఈపని ఎన్నిరోజులు చేస్తే అంతమంచిది. మరీ ఆలస్యం చేస్తే మొదటికే మోసం రావచ్చు. కనుక వో

నిపుణులకథలు

యేడాదిపాటు అది చేద్దాం. అంటే మనం యేడాది పట్టేలా పనిని పెంచాలి. పార్కిన్ సన్ చెప్పిందాంట్లో యేమాత్రం నిజం ఉన్నా పని అదే పెరుగుతుంది. మనం టైమ్ లిమిట్ పెట్టేచాలు. అందుకని ముందర అవని చేస్తాం. తరువాత మనం గుర్తుంచుకోవాల్సిన విషయం ఇన్‌కమ్ టాక్స్. అదిపోను మన కేమాత్రమైనా మిగలాలంటే మీరు నెలకి రెండువందల చొప్పన నేను నాలుగు వందల చొప్పన ఛార్జి చెయ్యాలి అంటే మనిషికి రెండు వేలా అయిదు వందల చొప్పన తొమ్మిది మందికి ఉజ్జాయింపున ముప్పైవేలు. పోతే మనం పదిమందిమి, ఆఊరు కనీసం నాలుగైదుసార్లు వెళ్లిరావాలంటే వో రెండు వేలు, అక్కడ మెజర్‌మెంట్స్‌కి సాంపుల్ కలెక్షన్‌కి అయిదువేలు...అంటే రమారమి యాభైవేలు.'

గంగప్ప అందరికేసి చూసాడు. సిరిరా మోకాలడ్డుపెట్టువారు ప్రపంచంలో ఉంటారేమోకాని ఆ లాబ్‌లో లేరు. అందరూ ఒప్పుకున్నారు. గంగప్ప ఎస్టిమేట్ పంపాడు

కేంద్రం సరేనన్నది. గంగప్ప తనకింద పన్జేసే స్టాఫ్‌ని రెండుగా విభజించాడు. ఆ ప్రాంతానికి చెంది, ప్రాంతీయ అభిమానం కలవారు మొదటి గుంపు. ఆ ప్రాంతానికి చెందినా, ప్రాంతీయ అభిమానాలకి అతీతులు, ఆ ప్రాంతానికి చెందని వారు కలిసి రెండోగుంపు. అయితే గంగప్ప తెలివైనవాడు కనుక ఆ గుంపులకి డాటా కలెక్షన్ గుంపు, డాటా ప్రాసెసింగ్ గుంపు అంటూ పేర్లు పెట్టాడు. తను రెండు గుంపులకి పేరుకి పెద్దగా ఉంటానని చెప్పాడు. అందరు ఆ ఆలోచన బాగుందన్నారు.

ముందర సమాచార సేకరణ బృందంతో సమాలోచనలు చేసాడు. అందరి అభిప్రాయాలు కొంత తెలిసాక, తమ ప్రాంతానికి ఆ రేవు ఎంతముఖ్యమో అది లేకపోతే అభివృద్ధి ఎల్లా ఆగిపోతుందో నచ్చచెప్పాడు. అందరు 'మరే' అన్నారు. 'అయితే ఆ ఊర్లో రేవు పెట్టేలా చూడాల్సిన బాధ్యత మనదా ? కాదా ?' అని అడిగాడు గంగప్ప. 'మనదే' నన్నారు. ఆపైన 'దాందేముంది ఎలాంటి సమాచారం నుంచైనా మనకి కావల్సిన రిపోర్టులు వ్రాసుకోవచ్చు కదా ! ఒకే డాటాతో రెండు పరస్పరం విరుద్ధములైన సిద్ధాంతాల్ని సమర్థించచ్చు అన్న విషయం మన అందరికీ తెలిసిందేకదా, ఎందుకు మీరంతగా బెంగ పడుతున్నారు బాస్ !' అని అడిగారు అభిమానులు.

'మీలాంటి అమాయకులు ప్రపంచంలో ఎల్లా నెగ్గుకొస్తారా అని బెంగపెట్టుకుంటున్నాను. ప్రపంచంలో అందరు మీలాగా సరిగ్గా ఆలోచించ గలిగినవారే ఉంటే ఏ బెంగా ఉండదు. ఆ రెండో గుంపులో ఉన్నవారిలో కొందరికి మన ప్రాంతం అభివృద్ధి చెందటం ఇష్టంలేదు. వారు రాసే రిపోర్టు మనకి అనుకూలంగా ఉండచ్చు, ఉండక పోవచ్చు' అన్నాడు గంగప్ప భారంగా.

'ఆ గుంపుకి మీరే తలకాయకదా ?' అంటూ అభిమానులు అనుమానం వెలిబుచ్చారు.

'అయితే వారు తయారు చేసిన రిపోర్టు నేను మారిస్తే, అది ప్రాంతీయ దురభిమానంతో చేసానంటారు' అన్నాడు గంగప్ప.

అందరు నిశ్శబ్దం వహించారు. అందరికి గంగప్ప సూచించకుండా సూచించినది

తెలుస్తూనే ఉంది కాని బయటకంటే 'ఛ నేన్నదిదికాదు' అన్నో అంటాడని భయపడ్డారు వుయ్‌విల్ డూ అవర్ బెస్ట్' అన్నారు 'అనుకూలమైన రిపోర్టు రాయటానికి పనికొచ్చే అనుకూల సమాచార సేకరణ తయారుచేస్తే పోలా' అని మనస్సులో అనుకున్నారు

'మీరు ఆ ఊళ్లో రేవు ఎందుకు పెట్టాలో చెప్పడానికి అనుకూలమైన సమాచారం కోసం వెయ్యికళ్లు పెట్టి వెతకండి లొసుగులకోసం వెతక్కండి అవి వెతకడం మొదలుపెడ్తే దానికి అంతుండదు మట్టి సాంపుల్స్‌లోకల్లా గట్టివితెండి కెరటాల ఉధృతం, ప్రవాహవేగం అనుకూలంగా ఉన్నప్పుడే కొలవండి మిగతా అప్పుడు కాఫీ హోటళ్లకిపోయి కాఫీ తాగండి వీలు కానిచోట కొలతలు సాధ్యం కాలేదని నిర్మొహమాటంగా రాయండి' అంటూ గంగప్ప 'లంబూ ! జంబూ ! విజృంభించండి' అన్న మాయాబజారులో ఘటోత్కచుడి ధోరణిలో వాళ్లని ఆ ఊరుమీదకి కొలతలకోసం తోలేసాడు

అభిమానులు చూసి రమ్మంటే కాల్చి వచ్చారు మట్టి సాంపుల్స్‌లో అన్ని గట్టివే తెచ్చి, స్ప్రింగ్స్ కొలిచి, కొలిచినదానికి మరికొంచెం కలిపి వేసారు కెరటాల ఉధృతం తక్కువ ఉన్నప్పుడు కొలిచి ఆ కొలిచిందానికి కొంచెం తక్కువ రికార్డు చేసారు ఆరు నెలలయ్యేసరికి ఈ సమాచారం రెండోగుంపు కిచ్చారు ఆ సమాచారాన్ని పరిశీలించి, అది అసంపూర్తిగా వుందని గుర్తించినా, తమకు లభ్యమైన లిమిటెడ్ డాటా బట్టి చూస్తే రేవును ఆ ఊళ్లో పెట్టకూడదు అని చెప్పడానికి ఏ ఆస్కారము కనిపించడం లేదని, పెట్టాలి అని చెప్పడానికి చాలా ఆస్కారం ఉందని, ఉదాహరణకి ఆ ప్రాంతం చాల వెనకపడ్డ ప్రాంతమని, రెండో గుంపు పదకొండు నెలలయ్యేసరికి రిపోర్టు వ్రాసి గంగప్ప కిచ్చారు గంగప్ప దాన్ని తీసుకుని ఇంగ్లీషులో మార్పులు చేస్తున్నానని చెప్పి 'మేము అక్కడ రేవు పెట్టవచ్చునని దృఢంగా నమ్ముతున్నాము' అంటూ మార్పుచేసి ఏడాది అయ్యేసరికి కేంద్రానికి పంపించాడు అది పంపుతూ కంట్రాక్టర్లు మాట వరుసకి ఇసకలో సిమెంటు కలిపి కట్టిన కట్టడాలే నిలుస్తున్నాయే దీనికి లోకా ఉండదు, అనుకున్నాడు గంగప్ప

రిపోర్టు అందిన యేడాదికి దాన్ని కేంద్రం ఆమోదించింది ఆపైన మరో యేటికి ఆ పోర్టులో పని మొదలైంది వేసిన పునాదులు దిగిపోయాయి సముద్రంలో బ్రేక్‌వాటర్స్ కట్టడానికి కాను వేసిన పెద్దరాళ్లు కొట్టుకు పోయాయి ఇసక విపరీతంగా మేట వేసింది పార్లమెంటులో ఈ విషయంమీద గొడవైంది మేము నిపుణుల సలహా ననుసరించే అక్కడ రేవు కట్టడానికి పూనుకున్నామని అంది కేంద్రం న్యాయవిచారణ జరగాలని పై ప్రాంతాలవారు పట్టుపట్టారు గంగప్పని విచారించారు 'మా లాబ్‌లో అన్ని ప్రాంతాల మనుషులు ఉన్నారు ఆ రిపోర్టు పక్షపాత బుద్ధితో తయారు చేసింది కాద'న్నాడు

ఎటూ తేలక రామనాథన్, రంగనాథన్ అనే నిపుణులను గంగప్ప తయారు చేసిన నివేదికను, సేకరించిన సమాచారాన్ని పరిశీలించవలసిందిగా కోరారు వారు ఆ విషయాన్ని ఓ మూడునెలలు క్షుణ్ణంగా పరిశీలించి ఆ సమాచార సేకరణ, అసంపూర్తిగా ఉందని, అది కావాలనే అలా చేసారని నమ్మటానికి అవకాశం ఉందని, ఆఖరికి ఉన్న సమాచారం కూడా అంత దృఢంగా అక్కడ రేవు పెట్టవచ్చునని నమ్మేలా లేదని అన్నారు వాళ్లని అలాంటి రిపోర్టు వ్రాయమని మరో ప్రాంతం వాళ్లు వత్తిడి పెట్టారని గంగప్ప అన్నాడు

సాంకేతిక ప్రపంచంలో గంగప్ప కున్న మంచిపేరు మట్టి కొట్టుకు పోయింది ఆ ప్రాంతానికి రేవు లేకుండా పోయింది శివన్నకి మాత్రం మంత్రి పదవి పోలేదు నీతేమిటి? నిపుణుల కన్నా రాజకీయ నాయకులు తెలివైనవారు నడిపించెడి వాళ్లు వాళ్లు, నడిచెడువారు వీళ్లు

(పైవారం శంఖంలో పోసిన నీరు కథ)



శ్రీ వెంపటి చినసత్యం బృందంతో విదేశాలలో కూచిపూడి నృత్యప్రదర్శనలిచ్చిన కుమారి శోభా నాయుడు

తైవాన్‌లో పుట్టి తెలుగు యింటిని మెట్టిన లిలీ జీన్ తో ఇంటర్వ్యూ!

ప్ర: మీ జీవిత వివరాలని సంక్షిప్తంగా చెప్పగలరా?

జ: పుట్టినది 1951 సంవత్సరం (చైనా లెక్కల ప్రకారం 40 సంవత్సరం) కౌషుంగ్ అన్న పట్టణంలో. 1972 లో డిగ్రీ పొందాను. పై చదువులకు జపాన్‌నుండి స్కాలర్‌షిప్ వస్తే వివాహం కారణంగా తిరస్కరించాను. నాన్నగారికి తైవాన్ ఎలక్ట్రిసిటి కంపెనీలో పని. ఇద్దరు పెళ్లిఅయిన అక్కలు, ఒక తమ్ముడు వున్నారు. ప్రస్తుతం తైపేయి అన్న పట్టణంలో (తైవాన్‌కు రాజధాని) మా వారితో నివసిస్తూ వంట వండటం, తెలుగు, ఇంగ్లీషు భాషలు నేర్చుకుంటున్నాను.

ప్ర: మీరు తైవాన్‌లో ఆది నుండి స్థిర పడినారా? లేక చాంగ్‌కైషేక్‌తో కూడి వచ్చినవారా? లేక వారి సంతతి వారా?

జ: మేము తరతరాలుగా తైవాన్‌లో స్థిరపడిన వారము.

ప్ర: కమ్యూనిస్టు చైనాకు మీరు వెళ్లారా ?

జ: లేదు.

ప్ర: మా ఆంధ్రదేశం వచ్చారు కదా! అదేమీ అత్తగారి వూరుకు వచ్చారు కదా! యీ ప్రదేశం గురించి మీకు కలిగిన భావాలేమిటి?

జ: నాకు జరిగిన ఆదరణ, కనిపించిన ఆప్యాయత మరువరానివి. తిరుపతి దేముడి గుళ్లో ఎంతో బంగారం, పాడి పశువులు, నదులు—ఆనకట్టలు చూస్తే ఆంధ్రదేశం చాలా ధనవంతమైనది అనిపించింది. అమ్మాయిల వరకట్నం కథలు, టి. వి. లేకపోవడం కొంచెం వింతగా వున్నాయి.

ప్ర : మాకట్టూ, బొట్టూ, చీర—అదే, భారతీయ దుస్తులు అలంకరణలుమీకు ఎలా వుంటున్నాయి?

జ : చాలా అందంగా వున్నాయి. తైవాన్‌లో త్వరలోనే ఇక్కడి గాజులు, బొట్టూ, చీరెలూ కొత్త ఫాషన్ అవవచ్చు.నేను తైవాన్‌లో వీటిని ధరిస్తే ఎంతోమంది కుతూహలం వ్యక్తపరిచారు.

ప్ర : మీరు వంట వండుతారా ? తెలుగు వంటలంటే యిష్టమేనా ? గోంగూర, ఆవకాయ వీటిసంగతి ఏమైనా చెప్తారా ? మీ శ్రీ వారికి మీ వంటలలో వేటిని అలవాటు చేశారు ?

జ : వంట వండటం ఈ మధ్యనే మొదలు పెట్టాను. ఎక్కువగా చైనీస్ కూరలు వండుతాను. తెలుగు వంటకాలు నేర్చుకోవడానికి మళ్లీ వచ్చే ఏడాది మొదట్లో బెజవాడ వస్తాను. ఆవకాయ కన్నా గోంగూర బాగా నచ్చింది. వూఫ్ ! బాగా కారంగా వున్నాయి. మావారు అన్ని రకాల వంటలూ తినగలరు. పాపం, నావంట ఎలావున్నా తినేస్తారు.

ప్ర : అక్కడి సినిమాలు సంగతి చెప్పండి. ఆంధ్రదేశంలో మీరేదైనా సినిమా చూశారా ?

జ : మా చైనీస్ సినిమాలు హాంకాంగ్‌లో, తైవాన్‌లో తయారవుతాయి. స్టంట్ ఎక్కువగా వుంటుంది. ఈ మధ్యనే తైవాన్ ప్రభుత్వం సినిమాల్లో చూపే 'సెక్సు' దృశ్యాలకు నిబంధనలు పెట్టింది.

విజయవాడలో బంగారుబాబు పూర్తిగా, శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం కొద్దిసేపు చూశాను. 'చంగారు చీరకట్టి' అన్నపాట నచ్చింది.

ప్ర: మీ 'హాబీలు' ఏమిటి ? తెలుగు భాష అంటే మీకు యిష్టమేనా ?

జ: హాబీలు, బేవింగ్, పాటలు పాడటం. తెలుగుభాష నేర్చుకుంటుంటే చాలా కష్టంగా వుంది. ఈసారి విజయవాడ వచ్చేసరికి బాగా మాట్లాడ్డానికి ప్రయత్నిస్తున్నాను.

ప్ర: మీరు బౌద్ధ మతస్తులా? బుద్ధుని గురించి మీ అభిప్రాయం ఏమిటి ?

జ: మేము బౌద్ధ మతస్తులమే. బుద్ధుడు మాకు దేముడు. మా బుద్ధుని విగ్రహాల్లోనూ, థాయ్‌లాండ్, భారతదేశంలో వున్న బుద్ధుని విగ్రహాల్లోనూ తేడాలు వున్నాయి. మీ బుద్ధుడు అందంగా వుంటాడు.


ప్ర: మీ భర్త గురించి ఒక్క వాక్యం చెప్పండి.

జ: చైనా భాషను తక్కువ కాలంలో మాట్లాడటం నేర్చుకున్నారు. చాలా మంచివారు.


ప్ర: వివాహానికి ముందు, తరువాత గల తేడా రెండు మూడు వాక్యాలలో చెప్ప గలరా ?

జ: వివాహానికి ముందు యితర దేశాలు వెళ్ళి చూడటం కలలుగా వుండేది. ఆ తర్వాత కలలే నిజమయినాయి. వివాహానికి ముందు నా అలవాట్లు చైనీస్ పద్ధతుల్లో వుండేవి. ఇపుడు నెమ్మది నెమ్మదిగా ఆంధ్రా వాళ్ళ అలవాట్లు అబ్బుతున్నాయి.

(ఒ. వి.) ●



విజయవాడ వాస్తవ్యులు, ఎన్. వి. కె. ఆర్. సంస్థ అధినేత శ్రీ నిమ్మగడ్డ వెంకట కృష్ణారావుగారి నాలుగవ కుమారుడు చి. దుర్గాభవానీ ప్రసాద్‌కి, తైవాన్ యువతి చి. లిలీజీన్‌కేజూన్ 8న వివాహం జరిగిన సందర్భంగా తీసిన చిత్రం.



Interpub/GSC/5/72R Tel



'మనువు—మనసు'లో రేలంగి, చంద్రకళ.



'ఖైదీబాబాయ్'లో శోభన్‌బాబు.

సినిమా

మేరీ కిస్తీ

ప్రముఖ రచయిత మహావీర్ అధికారి విరచితమైన 'తలాష్' అన్న నవలను కీర్తిమాన్ ఫిలిమ్స్ వారు 'మేరీ కిస్తీ' పేరిట చిత్రంగా రూపొందిస్తున్నారు. పాపులర్ పత్రికావిలేఖరి, మరియు రచయిత అయిన ఉమేష్ మాథూర్ పై చిత్రాన్ని దర్శకత్వంవహించే బాధ్యతను స్వీకరించారు. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీతాన్ని, ఆర్ డి మాథూర్ ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్య పాత్రలను సాజిద్, యోగితా బాలి పోషిస్తున్నారు.

బొంబాయి నగరంలోని మెరైన్ డ్రైవ్ (క్వీన్స్ నెక్‌లెస్) ప్రాంతంలో, అలల భీకర ధ్వని, జోరుగావీచే గాలుల నడుమ 'మేరీ కిస్తీ' చిత్రానికి సంబంధించిన కొన్ని ముఖ్య సన్నివేశాలను ఇటీవల చిత్రీకరించడం జరిగింది.

నాటి మానవుడు, నేటి మానవుడు జీవితాల మధ్యగల వివిధ రకాల జీవితపు ఎత్తు, పల్లాలను ఎరుకపరిచే ప్రయోజనాత్మక చిత్రమే కీర్తిమాన్ ఫిలిమ్స్ వారు నిర్మిస్తున్న 'మేరీ కిస్తీ'.

మైనరు బాబు

తండ్రి అభిప్రాయానికి భిన్నంగా, భూపాలయ్య కుమారుడు కుమార్ తన ఫ్యాక్టరీలోని టైపిస్టు గీతను పెళ్ళి చేసుకుంటానని, రాముకి తెలియజేశాడు. రాము ప్రియురాలు సీత పెండ్లి ఏర్పాట్లు చేసింది. ఇంతలో రాము ఒంటరిగా వచ్చాడు. సీత విస్తుపోయింది.

'రా, మైత్రా చూశావా అన్నీ సిద్ధం చేశాను. అలవేణి కుండలు, అరిటిపండ్లు, టెంకాయలు, పసుపు, ఆకులు, వక్కలు, తాళిబొట్టు' అని చెప్పుకుంటూ పోయింది సీత. 'హత్తెరి, అదేంటి మైత్రా అట్టుండావు ఏమైంది, కుమార్ ఒప్పుకోలేదా?' అంది. 'లేదు, సీతా అమ్మే ఒప్పుకోలేదు' అన్నాడు రాము. 'ఏం, ఎందుకని?' అని కంగారుపడింది సీత. 'ఆ భూపాలయ్య'

యిష్టం లేకుండా ఆ పెండ్లి జరగదట ఆయనే స్వయంగా వచ్చి మర్యాదగా పద్ధతి ప్రకారం ఆశీర్వదించాలట' అన్నాడు రాము 'హత్తెరి, అదా సంగతి ఏంది, మైన్రూ, దీనికింత కూలబడిపోతావేంది నే చేసుకొస్తా మందు' అంది సవాలు చేస్తున్నట్లు 'అయితే యింకేం? ఇదిగో చూడు సీతా, అక్కడ నీకేమయినా సహాయం కావాలంటే, ఆ భూపాలయ్య యింట్లో ధనం అని వున్నాడు వాడు మనవాడే వాడికీ సంగతి తెలిస్తే ' అని ఏదో చెప్పబోయాడు రాము 'హత్తెరి, వదిలెయ్యి, నే చూసు కుంటాగా' అంటూ బయల్దేరింది సీత 'కట్' అన్నారు దర్శకుడు తాతినేని ప్రకాశ రావు ఈ సన్నివేశం సారధి అండ్ టి ప్రి ఆర్ కంబైన్స్ వారి 'మైనరు బాబు'లో కనిపిస్తుంది రాముగా శోభన్, గడుసు పిల్ల సీతగా వాణిశ్రీ నటించారు

పైలా పచ్చీసు

తండ్రి ఆర్జించిన ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెడుతూ, బరువు, బాధ్యతలను పట్టించుకోక జీవితాన్ని గడుపుతూ వచ్చిన పైలా పచ్చీసుకు ఆవేశం, అభిమానం అడ్డొచ్చి తన కాళ్ళపై తను నిలబడి బ్రతక గలనని నిరూపించిన యువకుడి కథయే 'మైనరు బాబు' కథను దర్శకుడు ప్రకాశ రావు వ్రాయ, మాటలను ఆత్రేయ, భమిడి పాటి సమకూర్చారు సంగీతాన్ని చలపతి రావు నిర్వహించారు నవయుగ విడుదల

ప్రకాశరావు కొత్త కథ

మైనరుబాబు' కథను రచించిన ప్రముఖదర్శకుడు తాతినేని ప్రకాశరావు రాసిన మరొక కథ అనిత ఆర్ట్సుకి యివ్వడం జరిగింది ఈ సంస్థకు ప్రకాశరావుగారి మనుమడిపేరు పెట్టడం జరిగింది భమిడి పాటి మాటలను వ్రాశారు చలపతిరావు సంగీతాన్ని, బాలకృష్ణ ఛాయను నిర్వహిస్తు న్నారు సినిమా అనుకరణ దర్శకత్వంను 'ఇల్లరికం, చరణదాస' చిత్రాల విజేత అయిన ప్రకాశరావు చేపట్టారు ఈ చిత్రంలో కృష్ణ, ఎస్వీరంగారావు, విజయనిర్మల ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు తారకరామ విడుదల



'అందాలరాముడు'లో నాగేశ్వరరావు, లత



'మైనరుబాబు'లో అంజలీదేవి, లీలారాణి

సినిమా

మమత కంబైన్స్!

పత్రికా రచయిత వాశిరాజు ప్రకాశం స్థాపించిన కొత్త సంస్థ యిది దీనికి ఆయన సతీమణి యజమానురాలు ఈ చిత్రానికి 'శారద, నేరము—శిక్ష' హిట్ చిత్రాల సృష్టికర్త అయిన కాశీనాధుని విశ్వనాథ్ దర్శకత్వం నిర్వహిస్తారు

శోభన్ శారద

నూటికి, తొంభై శాతం వీరిద్దరూ నటించిన చిత్రాలు విజయవంతం అయినాయి ఈ జంటను ప్రేక్షకులు విపరీతంగా ఆదరించి, అభిమానిస్తున్నారు మమత కంబైన్స్ మొదటి చిత్రంలో శారద, శోభన్ నాయికా, నాయకులుగా నటిస్తారు, బొల్లిముంత రచయిత లక్ష్మి విడుదల

బొల్లిముంత చిత్రాలు!

మన తెలుగు పరిశ్రమ గర్వించదగిన రచయితలలో బొల్లిముంత ఒకరు వీరి రచనలో ఒక ప్రత్యేక శైలి కనిపిస్తుంది సరళమైన మాటల పొందికలో బరువయిన భావాలను అందించే శక్తి వీరి కలానికి వుంది వీరురాసిన 'కళ్యాణ మంటపం, కాలం మారింది, శారద' చిత్రాలను పరిశీలించి చూస్తే, ఎంతటి రచనా వైభవం బొల్లిముంతకు వున్నదో ద్యోతక మవుతుంది వీరు యిప్పుడు రెండు చిత్రాలకు రచయితగా పనిచేస్తున్నారు.

ఆ చిత్రాలేమిటి?

ప్రముఖ నవలా రచయిత్రి మాదిరెడ్డి సులోచన విరచితమైన 'సంసారనౌక' నవలను లోకేశ్వరి ఆర్ట్ ఎక్బర్స్ చలన చిత్రంగా నిర్మిస్తున్నారు ఆ చిత్రానికి బొల్లిముంత చేత మాటలను రాయిస్తున్నారు శారద, కృష్ణ నాయిక, నాయకులుగా నటించే యీ చిత్రానికి ఎ ఎస్ రావ్ దర్శకుడు విశ్వశాంతి విశ్వేశ్వర రావుగారి అల్లుడు ఏ కె వి ప్రసాద్ తలపెట్టిన చిత్రం యిది

ప్రసన్న లక్ష్మి ఎక్బర్స్ నిర్మిస్తున్న 'కొత్తకాపురం' చిత్రానికి బొల్లిముంత మాటలను పొందు పరుస్తున్నారు పి వెంకటరత్నం నిర్మించే యీ చిత్రానికి ఎ చంద్రశేఖరరెడ్డి దర్శకుడు కృష్ణ, ఎస్వీరంగారావు, చంద్రకళ ప్రధాన పాత్ర ధారులు

ఆర్ ఎస్. కంబైన్స్!

'మల్లమ్మకథ' పౌరాణిక చిత్రాన్ని సమర్పించిన ఎల్ వి భుజంగరావు అధ్వర్యంలో నెలకొల్పబడిన కొత్త సంస్థకు యీపేరు పెట్టబడింది ఈ సంస్థకు కె వి రెడ్డి అధినేత

వీటూరి దర్శకత్వం!

ఈ సంస్థకు వీటూరికథను వినిపించారు కథను మెచ్చిన నిర్మాత, వీటూరి చేత మాటలను వ్రాయించడమేగాక, ఆయన రాసిన కథకు ఆయన దర్శకత్వం వహిస్తేనే బాగుంటుంది అని ఎంచి, వీటూరికి ఆ బాధ్యతను కూడా అప్పచెప్పారు చాలా మంచిపని చేశారు

వీటూరి వర్త్ ఎంత?

వీటూరి మంచి కథకుడు, ఎంత బాగా రచన చెయ్యగలడో భక్తతుకారామ్ చిత్రం నిరూపించింది ఈ పరిశ్రమలో ఎంతో అనుభవం కూడా వుంది నిర్మాతగా కష్టసుఖాలను చవిచూడడం జరిగింది అనుభవజ్ఞుడు అయిన ఒక ప్రతిభాశాలిని దర్శకుడిగా చేసిన నిర్మాతను అభినందించాలి

జమున రంగారావు

వీటూరి దర్శకత్వం చెయ్యనున్న చిత్రంలో జమున, ఎస్వీరంగారావు ప్రధాన పాత్ర ధారులు ఈ చిత్రానికి కోదండపాణి సంగీత సారధి, లక్ష్మీవిడుదల

జన్మజన్మల బంధం

పేరుగొన్న కథను యువదర్శకుడు ఎ చంద్రశేఖర రెడ్డిగారి సహధర్మచారిణి వ్రాసింది ఆమె రాసినకథను విన్న ఒక ప్రముఖ నిర్మాత దానిని ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించడానికి నిశ్చయించారు పి చంద్రశేఖరరెడ్డి డైరెక్టుచేసే యీ చిత్రంలో కృష్ణ కథానాయకుడు

శోభన్‌తో కలర్ చిత్రం.

'విచిత్ర దాంపత్యం, మానవుడు—దానవుడు' చిత్రాలను ఎ చంద్రశేఖరరెడ్డి డైరెక్ట్ చేశారు రెండింటిలోనూ శోభన్ కథానాయకుడిగా నటించారు ఉష్శశ్రీ అధినేత ఎ చిన్నపరెడ్డి నిర్మించిన 'మానవుడు—దానవుడు చిత్రం శోభన్‌కి, చంద్రశేఖర రెడ్డికి ఎంతపేరును, ప్రఖ్యాతిని తెచ్చి



'సంసారం—సాగరం'లో ఎస్వీ రంగారావు

పెట్టిందో ప్రేక్షకులకు తెలుసు. ఇటీవల శోభన్ చిత్రాన్ని డైరెక్టుచేసే అవకాశం చంద్రశేఖరరెడ్డికి లభించలేదు. గతవారం రెడ్డిని కలిసినప్పుడు ఆయనే చెప్పారు శోభన్‌తో ఒక కలర్ చిత్రాన్ని డైరెక్టుచేసే అవకాశం లభించిందని, షూటింగు వచ్చే జనవరిలో ప్రారంభ మవుతుందని.

రష్యా అంగీకారం!

విజయవాడలో స్టుడియో నిర్మించడానికి రష్యా ప్రభుత్వం ఎక్విప్‌మెంటు యివ్వడానికి అంగీకారం తెలిపినట్టు ఉషశ్రీ చిన్నపరెడ్డి చెప్పారు. ఆయన ఏదైనా చెయ్యదలిస్తే, దాని అంతు చూడక మానడు. కుర్రవాడయినా, బుర్ర పెద్దదిగా వున్నవాడు చిన్నపరెడ్డి.

మన సినిమా వ్యాపారానికి కీలక స్థానం విజయవాడ అనడం వుచితం. సినిమా నిర్మాణానికి డబ్బును వడ్డీకి యిచ్చే పంపిణీదారులు వున్నచోటు బెజవాడే గదా. విజయవాడ, గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమండ్రి వాస్తవ్యులే గదా చిత్రాలను నిర్మిస్తున్నది. ఈ వూరి వారందరికీ దగ్గరగా వున్నది విజయవాడ గాబట్టి అక్కడ స్టుడియో వుండవలసిన అవసరం ఎంతేని వుంది. అట్టి అవసరాన్ని గుర్తించి, స్టుడియో కట్టడానికి పూనుకొన్న చిన్నపరెడ్డి అభినందనీయుడు.

దీపావళికి పత్రిక

ఉషశ్రీ చిన్నపరెడ్డి తెలుగులో 'చలన చిత్ర' పేరిట ఒక సినిమా పక్ష పత్రికను తలపెట్టారు. ఈ పత్రికలో నిర్మాతల జీవిత విశేషాలు, వాళ్ళు పడే కష్ట సుఖాలు గూర్చి వుంటాయి. అవుట్‌డోర్ చిత్రీకరణ, పరిశ్రమలోని మంచి చెడ్డలను గూర్చి తెలపడం జరుగుతుంది. మొదటి సంచిక దీపావళికి వస్తుంది. తెలుగులో ఫిలింఫేర్ సైజులో సినిమా పత్రిక రావడం యిదే ప్రథమం.

మా ఇద్దరి కథ

ఈ కథను 'కథానాయకుడు' చిత్ర నిర్మాత కె. గోపాలకృష్ణ వ్రాశారు. ఆయన రాసిన కథను నాగేశ్వరరావు అయితే నే బాగుంటారు అని తలచడం, అదే భావాన్ని అక్కినేనికి వ్యక్తపరచడం, కథను విన్న 'నటసామ్రాట్' ముగ్ధుడై అంగీకరించడం జరిగింది. వైవిధ్య మనస్తత్వాలుగొన్న అన్నదమ్ముల పాత్రలను నాగేశ్వరరావు పోషిస్తారు. రెండు పాత్రలకు అనుగుణంగా 'మా ఇద్దరి కథ'—అని పేరుపెట్టారు.

హేమాంబరధరరావు దర్శకత్వం

'మా ఇద్దరి కథ'కు యువరచయిత, ఘనరచయిత అయిన గోపీచేత మాటలను వ్రాయించారు, నిర్మాత. ఈ చిత్రానికి వి. ఎస్. ఆర్. స్వామిని డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా నియమించారు. 'శారద' చక్రవర్తికి సంగీతాన్నియిచ్చారు. 'కథానాయకుడు' దర్శకుడయిన హేమాంబరధరరావు యీ చిత్రాన్ని డైరెక్టు చేస్తారు. ఈ చిత్రం షూటింగు అక్టోబరులో సారథిలో ఆరంభ మవుతుంది. అన్నపూర్ణా విడుదల. ఈ చిత్రంలోని కథావస్తువు నేటి 'సమాజంలో జరుగుతున్న చర్యలకు ఎవరు బాధ్యులు?' అన్న దానిపై అల్లబడింది.

ఇంటి దొంగలు

సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ తీసిన యీ చిత్రం పూర్తయింది. కథ, మాటలను హాస్య వ్యంగ్య రచయితగా వినుతికెక్కిన భమిడిపాటి వ్రాశారు. ఈ కథలోని ప్రధాన

పాత్రలను జమున, కృష్ణంరాజు, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, రావికొండలరావు, విజయలక్ష్మి, నిర్మల పోషించారు. సినిమా అనుకరణ+దర్శకత్వంను హేమాంబరధరరావు నిర్వహించారు. సంగీతాన్ని కోదండపాణి, ఛాయను శేఖర్ — సింగ్, కళను బి. ఎన్. కృష్ణ, ప్రొడక్షన్ను మహేంద్ర పూర్తిచేశారు.

ఆశ్చర్యం, ఆశ్చర్యం !

'ఇంటి దొంగలు' చిత్రం చూచాను. హుషారుగా సాగింది కథ. జోరుగా నడిచింది దర్శకత్వం. ఈ చిత్రంలో జమునను చూచి ఆశ్చర్యపోయాను. ఎందుకంటే? ఆమె పరిశ్రమలో అడుగిడి 21 ఏండ్లు పూర్తయినాయి. అప్పట్నుండి యిప్పటికీ తన శరీరాన్ని అదుపులో వుంచుకొని, అందాన్ని యినుమడింపచేసుకోవడం, ఆమెకు ఎలా సాధ్యమైనదో అర్థం గాకుండావుంది. ఇందులో ఆమె యిరవై ఏండ్ల పడుచు పిల్లలాగా సాక్షాత్కరించింది. సంజీవిని మూలికలాంటి దేమయినా స్వీకరిస్తున్నదో ఏమో? గ్లామర్ తరగని హీరోయిన్‌గా జమున ఒక్కతే కనిపిస్తుంది.

కృష్ణ, జమున నటించే కొత్త చిత్రం

శ్రీ వాణీకంబైన్సు నిర్మించిన 'స్నేహబంధం' చిత్రం ఫర్వాలేదు అనిపించుకుంది. 'నిర్మాత బాగా ఖర్చుపెట్టి తీశాడు' అన్నారు సినిమాను చూచిన ప్రేక్షకులు మొదటి సగంలాగా రెండవసగం వుండియుంటే 'స్నేహబంధం' నూరురోజుల పండుగ జరుపుకొనియుండేది. 'స్నేహబంధం కథను నిర్మాత ఎన్. వి. సుబ్బరాజు వ్రాశారు.

ఆయన రాసిన రెండవకథకు మాటలను రాసే పని మహారథికి తగిలింది. ఆయన రథం కదిలితే వేరే చెప్పాలా? మాటలు చాలా బాగా వచ్చాయి అన్నారు నిర్మాత సుబ్బరాజు. ఈ చిత్రం షూటింగు సెప్టెంబరులో ఆరంభమవుతుంది. సినిమా అనుకరణ + దర్శకత్వంను పి. చంద్రశేఖరరెడ్డి చేపట్టారు. ఈ చిత్రానికి రావ్ చవుదరి ఛాయను, మహేశ్వరరావు కూర్పును, సత్యం సంగీతాన్ని, చలం కళను నిర్వహిస్తారు. ప్రధాన పాత్రలను కృష్ణ, జమున, రాజబాబు, అల్లు రామలింగయ్య సత్యనారాయణ ధరిస్తారు. జనవరికల్లా షూటింగు పూర్తవుతుంది. బి. అచ్యుత రామరాజు సమర్పించే యీ చిత్రం అన్నపూర్ణాద్వారా విడుదలవుతుంది.

సినిమా

దిశమారింది దశమారింది

జానపద చిత్రయుగం వున్నంతవరకు, రాజులాగా ఏలాడు కాంతారావు, ఆయన్ను తెలుగు ఎం. జి ఆర్. గా చెప్పుకునేవాళ్లు, తమిళ సోదరులు, జానపదాలకు గిరాకీ తగ్గింది. కాంతారావు సాంఘికాలను చేసి, వాటిలోకూడా మంచిపేరును సంపాయించారు. కాలచక్ర భ్రమణంలో కాంతారావుకి కొంత చీకటి తగిలింది.

వెలుగు వచ్చింది!

ఇటీవల నటుడు బాలయ్య నిర్మించిన 'నేరము—శిక్ష' చిత్రంలో కాంతారావు హీరో కృష్ణ తండ్రిగా నటించారు. 'హుందాతనం, గాంభీర్యం నిండిన ఆ పాత్రకు నిండుదనం తెచ్చారు. కాంతారావు' అని సినిమాచూచిన ప్రతివారు అన్నారు, దిశ మారిందిగాబట్టి ఆయన దశకూడా మారింది అనే చెప్పాలి.

అన్నపూర్ణాలో కాంతారావు !

ప్రసిద్ధ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించే చిత్రంలో కాంతారావుకు ఒక ముఖ్యపాత్ర నిచ్చారు. ఇది కూడా ఆయనకు వెరైటీ అవుతుంది. ఈ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. కాంతారావు యీ సంస్థలో ప్రవేశించడం యిదే ప్రథమం.

నాగేశ్వరరావుతో రోజులు మారాయి తార

అన్నపూర్ణా పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రానికి మోదుకూరి జాన్సన్ రచనను, మహదేవన్ సంగీతాన్ని, సెల్వరాజ్ ఛాయను, జి. వి. సుబ్బారావు కళను నిర్వహిస్తారు. 'పూలరంగడు' తర్వాత నిర్మించబడుతున్న చిత్రం యిది. దీనికి ప్రసిద్ధ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు, ప్రముఖ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు సినిమా ట్రీట్‌మెంటును వ్రాశారు. సెప్టెంబరులో ప్రారంభమయ్యే యీ చిత్రంలో నాగేశ్వరరావు కథానాయకుడు. ఆయనతో 'రోజులు మారాయి' తార, ఏరువాకఫేమ్ ఒక ముఖ్య పాత్రను పోషిస్తుంది. ఆవిడ హిందీలో గురుదత్తు, దేవానంద్, దిలీప్‌కుమార్, రాజకపూర్‌లాంటి పెద్ద హీరోలకు జంటగా నటించియుంది. ఆమెది విజయవాడ, ఆమెతోబాటు యీ చిత్రంలోని ముఖ్య పాత్రలను లక్ష్మి, సత్యనారాయణ, రాజబాబు, అల్లు రామలింగయ్య, మరియు కాంతారావు పోషిస్తారు. ఈ చిత్రం నవయుగ ద్వారా విడుదలవుతుంది. ఇంతకీ ఆ తార ఎవరో చెప్పాలిగా. వహీదారెహ్మాన్. చాలా ఏండ్ల తర్వాత వహీదా తెలుగు చిత్రంలో నటించడం ఒక ప్రత్యేకతే కదా.

శ్రీ హరిరావు చిత్రానికి నారాయణరావు

'నాటకాలరాయుడు, వింత సంసారం' చిత్రాలలో వాటాదారుడిగావుండిన దిడ్డి శ్రీ హరిరావు త్వరలో ఒక చిత్రాన్ని ప్రారంభించబోతున్నారు. ఆయనకు దాసరి నారాయణరావు అంగీకరించారు.

దాసరి సృష్టించిన కాబూలీవాలా

వడ్డీకి డబ్బులివ్వడం, చెప్పిన తేదీకి అరువు తీసుకొన్నవాడు యివ్వకపోతే, వాడి దగ్గర నిర్దాక్షిణ్యంగా వసూలు చెయ్యడం కాబూలీవాలాకు పుట్టుకతోవచ్చిన లక్షణాలు. కాబూలీవాలాకూడా ఒక మనిషి అని, అతడికికూడా మానవత్వం, దయాదాక్షిణ్యాలు వున్నాయి అని మన నారాయణరావు కొత్త తరహా కాబూలీవాలాను సృష్టించారు. ఆపదలోవున్నవాడిని ఆదుకోవడం, అనాథలపై జాలిచూపడం కాబూలీవాలాకూడా చెయ్యగలడు అని దాసరి ఆ పాత్రను రూపొందించారు. ఈ పాత్ర నిర్మాత కె. రాఘవ నిర్మిస్తున్న 'సంసారం—సాగరం' చిత్రంలో కనిపిస్తుంది. కాబూలీవాలా పాత్రకు కావలసిన

స్నేగ్రహం, రంగారావుకు తప్ప మరెవ్వరికి వున్నాయి మన పరిశ్రమలో ఇటీవల సెట్స్‌లో కాబూలీవాలా గెటప్‌లో ఆయన్ను చూశాను ఎంత నాచురల్‌గా వున్నాడనుకొన్నారు?

కథ, మాటలు

'సంసారం—సాగరం' కథను, మాటలను వ్రాయడమేగాక సినిమా అనుకరణచేసి, దర్శకత్వంకూడా నిర్వహిస్తున్నారు దాసరి నారాయణరావు రమేష్‌నాయుడు సంగీతాన్ని, కన్నప్ప ఛాయను చేపట్టారు ఈచిత్రంలో సత్యనారాయణ కథానాయకుడు గుమ్మడి ద్విపాత్రాభినయం ఒక ప్రత్యేకత జయంతి, రాజబాబు, రమాప్రభ, అల్లురామలింగయ్య, శుభ ముఖ్యనటులు

ఊర్వశి ఉన్నతంగా నటించిన 'విశాలి'

దేవీశంకర్ పిక్చర్స్ నిర్మించిన తమిరిశ జానకి విరచితమైన 'విశాలి' చిత్రం ఆంధ్ర ప్రేక్షకులకు అక్టోబరులో దర్శనమివ్వబోతూంది ఈచిత్రంలో ఊర్వశి శారద అపూర్వంగా నటించింది విశాలి పాత్ర తెరపై చూసినప్పుడు, కరడుకట్టిన కసాయి గుండెకూడా కన్నీరు కార్చకమానదు నష్టజాతకురాలిగా పరిగణింపబడి, నానా అవస్థలకు గురికాబడి, అన్నిటిని ఓర్పుతో నేర్పుతో చక్కదిద్దిన అభాగ్యురాలిగా శారద అద్భుతంగా నటించింది ఆడవాళ్లు ఒకటికి పదిసార్లు చూస్తారు శారద నటనకోసం ఈ చిత్రంలో ఆమె భర్తగా శ్రీధర్ నటించాడు ఇంతపెద్ద పాత్రను ఆయనకు యిచ్చినందుకు, నిర్మాత లవరువు నిలబెట్టాడు శ్రీధర్ ఇచ్చిన వేషానికి న్యాయం చేకూర్చాడు ఈ చిత్రం విడుదలానంతరం శ్రీధర్ పని భలేజోరుగా వుంటుంది ఈ చిత్రంలో కృష్ణంరాజు, రమాప్రభ, కె వి. చలం, ధూళిపాళ, విజయలలిత ముఖ్య పాత్రలను పోషించారు అన్నెం పున్నెం ఎరుగని చెల్లెల్ని హింసించే అన్నయ్యగా కృష్ణంరాజు అసాధారణంగా నటించాడు పశ్చాత్తాపం పడిన ఘట్టంలో కృష్ణంరాజు ఎంతో గొప్పగా చేశాడు ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ రచనను, పుహళేంది సంగీతాన్ని, ఎ ఆర్ కె మూర్తి ఛాయను నిర్వహించారు గుత్తికొండ గోపాలరావు, వి అప్పారావు నిర్మించారు తారకరామ విడుదల


అరవైతో యిరవైకి పెండ్లా!

అరవైఏండ్లు నిండిన రేలంగిని, యిరవైనిండని చంద్రకళ పెండ్లిచేసుకోవాలి అని నిశ్చయించింది యవ్వనం బుసలుకొడుతున్న చంద్రకళకు యిలాంటి వింతకోరిక ఎందుకు ఏర్పడింది? బలవత్తరమైన కారణం ఏదో వుండాలిగా! వుంది

ప్రకాష్ మోసగించాడు!

తనకు తోడుగా నీడగా అందగాడు, అనువైనవాడు అయిన ప్రకాష్‌ను చంద్రకళ ఎన్నుకుంది అతగాడు చంద్రకళను ఎంతగానో ఆదరించాడు, ఆరాధించాడు ఇద్దరూ దంపతులు కావాలి అని నిర్ణయం కూడా తీసుకొన్నారు వీళ్లపెండ్లికి పెద్దలు అంగీకారం యిచ్చారు మరి యిన్ని జరిగినప్పుడు, పెండ్లి కాకపోవడానికి కారణం ఏమిటి? ప్రకాష్ మోసగించాడా? అభావమే చంద్రకళ మనస్సులో మెదలింది అందుకే ప్రతీకార వాంఛతో అరవైఏండ్ల మనిషిని భర్తగా ఎన్నుకుంది విడివడని జంటగా వుండవలసిన ప్రకాష్ చంద్రకళలను విడగొట్టినదెవరు? అందరి రాతలను పుట్టినప్పుడే రాసిపెడతాడే, అతడే యీపని చేశాడు 'విధి ఆడించే వింతనాటకంలో మనం పాత్రధారులం' అని చంద్రకళ తెలుసుకోలేక పోయింది అందుకే ! జతగాని వయస్కుడిని వరించింది ఇదంతా సాంధ్యశ్రీ ప్రొడక్షన్స్‌వారి 'మనువు — మనసు' చిత్రంలో సంభవించింది పి త్రినాథరావు నిర్మించిన యీ చిత్రానికి పి చిన్నపరెడ్డి దర్శకుడు తారకరామ విడుదల

—శ్రీనివాస్ ●



'విశాలి'లో కృష్ణంరాజు, శ్రీధర్, శారద

ఒక వారం విపరీతం ఫాలాక్షుడు

చచ్చి బ్రతికిన మనిషి !


మణప్పారకు చెందిన వీరక్కోవిల్ అనే వూరిలో 23 ఏళ్ళ శంకరన్ అనే ఆయన జబ్బు చేసి,చని పోయాడట. ఈ విషయం ఆవూరు వైద్యుడు కూడా ధృవపరిచాక, శంకరన్‌కు పాడి కట్టి స్మశానానికి మోసుకుపోయి, చితిలో శవాన్ని పెట్టి, నిప్పంటించబోతుండగా శంకరన్ కదిలాడట. ఇది చూసి అక్కడి వారు మొదట భయపడినా, ఆనక చితి దగ్గరకు వెళ్ళి చూస్తే నిజంగానే, శంకరన్ లేవబోతున్నాడట. అతన్ని ఆ చితిలోంచి లేవదీసి, అంతా చేరి మళ్ళీ యింటికి మోసుకు వెళ్ళారట— ఫెంటాస్టిక్! బట్ ట్రూ.

బావిలోపడి ఇద్దరు అమ్మాయిల మరణం

సెయ్యారుకు చెందిన కొడనగరు అనే వూరిలో 20 ఏళ్ళ పద్మావతి 18 ఏళ్ళ గీత అనే యిద్దరు వో నేలబారు నూతి చపటా మీదబట్టలుతుక్కుంటూ వుండగా, 18 ఏళ్ళ గీత కాలు జారి సర్రున ఎగిరి నూతిలో పడిందట. పడుతూ పడుతూ పద్మావతి చెయ్యి గట్టిగా పట్టుకోడం వల్ల ఆమెతో పాటు పద్మావతి కూడా నూతిలో పడిందట. సహాయం లభించేలోగానే యిద్దరూ చనిపోయారట.

తండ్రి కాలేదని నిరాశతో 27 ఏళ్ల యువకుని ఆత్మహత్య

తనకు వివాహమై ఆరేళ్ళయినా, తండ్రయ్యే యోగం ఇంకా పట్టలేదని, యిహ అదెక్కడ పడుతుందని నిస్పృహతో, నిరాశతో, పుట్టిన జీవితం మీది రోతతో మెట్టూరులో 27 ఏళ్ళ విజయరంగం అనే యువకుడు తన కథో కాగితం మీద రాసి, ఆనక నల్లుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడట.



హరిజన స్త్రీలపై అత్యాచారం

బీహారు రాష్ట్రానికి చెందిన మధుపెన్ అనే గ్రామంలో ఆనందకేశ్వర్ బస్వాన్ అనే వో హరిజనుని యింట్లోకి వో ఆరుగురు జొరబడి, ఆయన భార్యను, కూతురును, ఇద్దరు కోడళ్ళను ఎత్తుకుపోయి, వాళ్ళ చీరలూ అవీ విప్పి, పూర్తిగా వివస్త్రలను చేసి అవమానించి, అంతతో ఆగక ఎర్రగా కాల్చిన యినుప కడ్డీలతో వారి అవయవాల మీద వాతలు పెట్టారట. ఈ విషయం బీహారు చట్టసభలో చర్చకు వచ్చి మంత్రి జగన్నాథ్ మిశ్రా "స్త్రీలను వివస్త్రలను చేసి అక్కడ అవమానించారన్న వార్త నిజమే" నన్నారట— దీసీజ్ టుడేస్, డెమొక్రసి.

అప్పులివ్వలేదని బాంక్ మేనేజరుపై దాడి

తాము పెట్టుకున్న దరఖాస్తులకు అప్పులు యివ్వలేదనే కోపంతో 24వ తేదీ సాయంత్రం ప్రొద్దుటూరులో ఆ వూరు సిండికేట్ బ్యాంకు మేనేజరు ఎన్. కె. ఆచారిగారు బజార్లో వుండగా కొందరాయన మీద పడి లాఠీలతో దబదబ బాదారుట. బజారులో వున్న వారిలో కొంతమంది చప్పున వారిని గదమాయించి, ఆయన్ను గండం నుంచి కాపాడారట.

మంత్రుల చురుకుదనం


ఉన్నతాధికారంలో వున్న పోలీసు వుద్యోగులకు ఇతరులకు, మంత్రులకు తార్పుడు పనులు చేసి, వో సామాన్య వుద్యోగి చట్టున చాలా కంపెనీలకు యజమాని అవడమే గాక, కాడిలాక్ కారులో తిరుగుతున్న వుదంతం ఢిల్లీ రాజ్యసభలో 26వ తేదీన జనసంఘం నాయకుడు పీతాంబరదాసు వో పత్రికలోది చదివి వినిపిస్తూ "వయస్సు మీరినా, చురుకుతనం తగ్గని మంత్రి" అని, చదువుతుండగా మితవాద కమ్యూనిస్టు నాయకుడు భూపేష్‌గుప్తా చివాల్న లేచి, "మన మంత్రులలో చాలామందికి చురుకుదనం వుంది" అన్నారుట సమయస్ఫూర్తితో! విషయం అర్థమైనట్టు సభంతా నవ్విందట. ఇంతకీ ఆ కాడిలాక్ కారు అదృష్టవంతు డెవడో, ఆ మంత్రి గారెవరో తెలియ లేదు. అసలసలు విషయాలొదిలి మాట్లాడు కోడమే నేర్పు కదా!

అపరచాణక్యుడు

పుత్తూరులోని వో సినిమా హాలులో వో చాణక్యుడు ప్రవేశించి సినిమా తెర (స్క్రీన్)ను ఎత్తుకు, పోయాడుట. రెండో ఆటయ్యాక హాలుకు తాళాల్ని వేసుకుని, ఎక్కడి వారక్కడికి పోయి, తెల్లారి వచ్చి చూస్తే ఆ స్క్రీను లేదట.

వెనుకబడినవర్గాలలో చేర్చమని పురోహితుల విజ్ఞప్తి

వెనుకబడిన వర్గాలలో తమను కూడా చేర్చాలని దక్షిణభారత పురోహితుల సంఘం కార్యదర్శి



నరసింహన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి, అదేమంటే, పురోహితులు ఆర్థికంగా చాలా వెనుకబడి వున్నారని, కనుక వారిని కూడా వెనుకబడిన వర్గాలుగా గుర్తించాలని అన్నారట!

ఆసుపత్రిలో పసిపాప అంతర్ధానం

సెరువళూరులో నటరాజ ఉడయారు అనే ఆయన భార్య చిన్నకుళంది యింట్లోనే పురుడై, ఆడపిల్లను కన్నదట. అది ఆవిడకు ఏడో కాన్పు అవడం వల్ల ఆపరేషను చేయిద్దామని ఆమెను ఆసుపత్రిలో జేర్పించాడటాయన. తిరువణ్ణామలై ఆసుపత్రిలో చిన్నకుళంది, ఆమె కూతుళ్ళు (పసికందు)ఆమె తల్లి వుండగా వొకామె వచ్చి వారితో ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ, ఆ పసిపిల్లను ఎత్తుకుని, ముద్దాడ నారంభించిందట. బాలింత దగ్గరుండడానికి వొకావిడ దొరికింది కదా అన్న వూహతో చిన్నకుళంది తల్లి ఉణ్ణామలై అమ్మాళ్ ఏదో పని మీద బయటకు వెళ్ళిందట. తిరిగి ఆమె వచ్చేసరికి ఆ పసికందు లేదు, ఆ కందును ఎత్తుకుని ఆడిస్తున్న ఆ పెద్దావిడా లేదట. ●

సిమీ బ్యూటీ బులెటిన్

లేక

అందానికి చిట్కాలు

అందాల తార సిమీ అందానికి, ఫాషన్‌కి తగిన చిట్కాలు తెలుపుతుంది. వ్యక్తిగతమయిన ప్రశ్నలకి సమాధానాలు ఇవ్వలేనని తెలుపటానికి ఆమె చింతిస్తోంది! సాధారణంగా అందరికీ ఉపయోగంగా ఉండే ప్రశ్నలనే 'SIMI'S BEAUTY BULLETIN, Post Bag No 7117, BOMBAY 400014 కి పంపవచ్చు.

ప్ర: నాది చిన్న ముఖం. చిన్నకళ్లు. కొంచెం పెద్దవిగా కనిపించేలా చెయ్యాలంటే ఏం చెయ్యాలి.

జ: మీ ముఖం, కళ్లు సైజు తగ్గించే ఏర్పాటు ఇంతవరకూ ఏమీ లేదు. మేకప్ ఒకటే శరణ్యం. బుగ్గలమీద మామూలుగా కోటూవేసుకోండి. ఇలా బుగ్గలు లావుగా కనిపించడానికి అవకాశం వుంది. మీ కళ్ళు కాటుకతో పెద్దవి చేసుకోవడం ఏమంత కష్టంకాదు. కంటిరేఖని పెంచి కంటిపైనా క్రిందా మీరు గీత గీసుకుంటే కళ్లు ఇంతింత పెద్దవిగా కనిపిస్తాయి. ఒకసారి ప్రయత్నించి చూడండి అలవాటయి పోతుంది.

ప్ర: నా ముఖం చాలా జిడ్డుగా ఉంటుంది. మొహంనిండా మొటిమలు. అవి పోయి మొహం మృదువుగా చక్కగా రావాలంటే ఏం చేయాలి?

జ: జిడ్డుగా ఉండే చర్మం పై మొటిమలు రావడం సహజం. కాబట్టి జిడ్డు ఎక్కువగా లేకుండా చూసుకోవాలి, రోజుకి రెండుసార్లు మెడికేటెడ్‌సోప్‌తో ముఖం కడుక్కోండి. కనీసం వారానికి ఒకసారైనా బ్యూటీమాస్క్ ముఖానికి వేసుకోండి. తీపి, కొవ్వు, గంజి ఎక్కువగా ఉండే పదార్థాలు తినడం మానెయ్యాలి. కాయగూరలు (పచ్చివి), పళ్లు ఎక్కువగా తినండి. వీలైనంతవరకూ మేకప్ ఎలాంటిదైనా సరే మానెయ్యండి. ఒకవేళ తప్పని సరైతే రాత్రి పడుకోబోయే ముందుగా కడిగేసుకోవాలి. ముఖం పరిశుభ్రంగా లేకపోవడం అన్నదే మొటిమలకి కారణం.

ప్ర: నా కింది పెదవి పైదానికంటే చాలా లావుగా ఉంటుంది. పెదవి చిన్నదవడానికేదైనా వ్యాయామం చెప్పగలరా?

జ: అలాంటి వ్యాయామం అన్నదేదీ నాకు తెల్సినంతవరకూలేదు. ఒక్క ప్లాస్టిక్ సర్జరీవల్లే అది సాధ్యం అవుతుంది. కానీ దానికి ఎంతోకాలం పట్టవచ్చు. బాధే కాకుండా ఖర్చుకూడా ఎక్కువగా ఉంటుంది. ఏది ఏమైనా పెదవి చిన్నదిగా కల్పించడానికి మీరు చేయదగినది ఒకటుంది. లిప్‌స్టిక్ మధ్యలో నొత్తుగా పెదవి అంచుకి పల్చగా పూస్తే చూడడానికి పెదవి చిన్నదిగా కన్పిస్తుంది.

ప్ర: నా వయస్సు ఇరవై ఏళ్లు. కానీ కంటి చుట్టూ నల్లని వలయాలు ఏర్పడుతున్నాయి.

జ: సాధారణంగా ఈ వలయాలు నిద్రలేమివల్ల ఏర్పడుతాయి. కనీసం రోజుకి 8—9 గంటలు నిద్రపోయే ప్రయత్నం చెయ్యండి. రోజూ మీరు తీసుకునే ఆహారంలో ఎక్కువగా పళ్లు, కాయగూరలు, పాలు తీసుకోండి. ప్రస్తుతం బజార్లో



దొరుకుతున్న కంటి వెలుపల రాసే క్రీముని తెచ్చి కంటిచుట్టూ ఏర్పడిన వలయాలపై ప్రతిరాత్రీ రాసుకోండి. ఆ నల్లని వలయాలు నెలరోజుల్లో మాయమవుతాయి.

ప్ర: నాకు చక్కని శరీరాకృతి ఉన్నందుకు గర్వపడుతున్నాను. దాన్ని నిరంతరం కాపాడుకునేందుకేదైనా వ్యాయామాన్ని సూచిస్తారా?

జ: వ్యాయామాన్ని మించినదిలేదు. అది మీరు గుర్తించినందుకు సంతోషంగా ఉంది. రోజూ చెయ్యడానికి నాలుగురకాల వ్యాయామాలు చెపుతాను.

(1) నిలబడి కాలిబొటన వేళ్లని తాకడం.

(2) నడుము పైనుంచి శరీరాన్ని పక్కలకి సాధ్యమైనంత మేరకి వంచడం.

(3) వెనుకకి పడుకుని కాళ్లని శరీరానికి సమకోణాకృతిలో ఉండేలా పైకి చాపడం.

(4) ఒకపక్కకి పడుకుని మోకాలు వంచకుండా కాలుపైకి ఎత్తి బొటన వేలు పైకి చూచేలా పాదాలనిపెట్టడం. రోజూ ఈ వ్యాయామాలు చేస్తూ ఉంటే మీకు శరీరాకృతి గురించిన బెడద ఎప్పుడూ ఉండదు.

ప్ర: చాలా రోజుల్నించీ సిగరెట్ తాగే అలవాటు ఉంది. కానీ ఆలస్యంగా యిప్పుడు నా వేళ్ల కొసలు నల్లబడటం గమనించాను. ఏం చెయ్యాలో చెప్పండి.

జ: మీరు పొగతాగటం ఎందుకు మానెయ్యకూడదు? అది కష్టమని నాకు తెలుసు కానీ అసాధ్యం మాత్రంకాదు. సరే నేనొక సలహా చెప్తాను. రోజూ మీ వేళ్లని శనగపిండితో బాగా రుద్ది కడుక్కోండి. వీలైతే సిగరెట్ హోల్డర్‌ని ఉపయోగించండి.

ప్ర: నాకు త్వరగా అలుపు వస్తున్నది. ఆవరణ చుట్టూ ఒకసారి పరిగెత్తితే చాలు ఒకటే ఎగశ్వాస. కారణం ఏమై ఉంటుంది?

జ: మీకు ఉండాల్సినంత బలంలేదు. అంటే మీరు తినాల్సినంతగా తినడంలేదన్న మాట. ఇప్పట్నుంచి మీరు తినే ఆహారంలో విటమినులు, మాంసకృత్తులు ఎక్కువగా ఉండేలా చూసుకోండి. అంతేకాకుండా మీలో ఏదైనా లోపంకూడా ఉండి ఉండవచ్చు. కాబట్టి మీరు డాక్టర్ దగ్గరికెళ్లి ఒకసారి చెకప్ చేయించుకోమని నా సలహా. ●

తరచుగా ఇంట్లో 'డాక్టరు'గా పని చెయ్యాల్సి వస్తుందా?

బలీయమైన మరియు విశ్వసనీయమైన అనాసిన్ మీ మందుల పెట్టెలో ఉంచుకోవటం చాలా మంచిది.


ఆ రోజు ప్రతిదీ సక్రమంగా జరుగని రోజులలో ఒకటి. మీరు ఆలస్యంగా లేచారు. ఇంట్లో వంట సామాన్లు అయిపోయాయి. మీ అబ్బాయికి జలుబు చేసింది. ఫ్లూ వస్తున్నట్లు అనిపిస్తుంది.

అతన్ని వేడిపానీయంతో అనాసిన్ ఇచ్చి పడుకో పెట్టండి. సత్వరంగా పని చేసే అనాసిన్ జలుబులు మరియు ఫ్లూల వలన కలుగు నొప్పులను, బాధలను నివారిస్తుంది. డాక్టరు ఇచ్చే విశ్వసనీయమైన మందు లాగా అది ఒక మందుల సమ్మేళనం.




మీ అమ్మాయి ఒంట్లో బాగుండక, బాగా నొప్పి మరియు నడుం నొప్పితో స్కూలు నుంచి త్వరగా తిరిగి వచ్చింది.

ఆమెకు వేడి నీళ్ల కాపు పెట్టి అనాసిన్ ఇచ్చి హాయి కల్పించండి. ఆమె త్వరలోనే సంతోషంగా, కులాసాగా ఉండగలదు. అనాసిన్ కొన్ని రోజులలో కలుగు వ్యథను తగ్గిస్తుంది. ఎందువలనంటే అది బాధను తగ్గించుటయే గాక బాధ వలన కలుగు మానసిక చికాకును సత్వరంగా తొలగిస్తుంది.




మీ భర్త తనపై అధికారితో పేచీ పడి, వ్యాకులత వలన విపరీతమైన తలనొప్పితో బాధ పడుతున్నారు.

ఆయనకు చల్లగా సేద తీర్చే పానీయం, అనాసిన్ ఇచ్చి కులాసా చేకూర్చండి. ఎందువల్లనంటే అనాసిన్‌లో ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారక పదార్థాలు బాగా ఉన్నాయి.



మీరు పార్టీకి ఎన్నో ఏర్పాట్లు చేయవలసియున్నాయి కాని వ్యవధి చాలా తక్కువ ఉంది. మీరు అలసిపోయారు. తలనొప్పితో బాధ పడుతున్నారు. ఏక్షణంలో నైనా అతిథులు రాగలరు.


మీ సాయంత్రపు కార్యక్రమం తలనొప్పి వలన పాడు కావచ్చును. సత్వర నివారణ పొందండి. అనాసిన్ తీసుకోండి. మీరు మళ్లీ సంతోషంతో ఉండగలరు. గుర్తుంచుకోండి, మీ కుటుంబపు డాకరును పిలువనవసరం లేని స్వల్ప సందర్భాలలో, బలీయమైన మరియు సత్వరమైన అనాసిన్ వాడండి. అదే మీ ఉత్తమ మిత్రము.



బలీయమైన మరియు విశ్వసనీయమైన

అనాసిన్

భారతదేశపు
ఎక్కువ జనప్రియమైన నొప్పినివారిణి



Regd. User of TM: Geoffrey Manners & Co. Ltd.

A-19

నాటిక



బి.వి. భాస్కర

ప్రేమలేఖ

ఇందులోని సజీవ పాత్రలు:

1) ధర్మారావు—రిటైర్డ్ క్లర్కు
2) శాంతమ్మ—ధర్మారావు భార్య.
3) సూర్యం—శాంతమ్మ, ధర్మారావుల ఏకైక పుత్రుడు, బి. ఏ స్టూడెంట్.
4) అవతారం—ఇంటి నౌకరు.

నిర్జీవ పాత్రలు:

1) చిన్నబల్ల, 2) పుస్తకాల షెల్ఫు, 3) కొన్ని పుస్తకాలు, 4) కుర్చీ, 5) చిన్న రౌండ్‌టేబుల్, 6) పూలకుండీ, 7) కొన్నిపూలు, 8) కాలెండర్ 9) ఒకటి రెండు సీనరీలు, 10) ఓ ఇంగ్లీషు బౌండ్ వాల్యూమ్, 11) ముక్కుపొడుండబ్బా, 12) ముక్కుపొడుం పొట్లం, 13) సన్నా గుత్తి, 14) ప్రేమలేఖ, 15) పాత ఇన్‌లాండ్ లెటర్, 16) తాళం.గుత్తి.

[తెర తెరవబడగానే రంగస్థలంపై సాధారణ కుటుంబం. ఒక మూలగా చిన్న బల్ల. దానిపై పుస్తకాల షెల్ఫు. దానిలో చిందర వందరగా పడవేసిన పుస్తకాలు. రంగస్థలం మధ్యగా కాస్త వెనుక ఒక కుర్చీ, దానికి ముందుగా పూలకుండీతో చిన్న రౌండ్ టేబిల్ వుంటుంది. కుర్చీలో ధర్మారావు కూర్చొని ఇంగ్లీషు పుస్తకం చదువుతూంటాడు. గోడకు ఒక కాలెండర్ ఒకటి రెండు సీనరీలు వేలాడుతూ వుంటాయ్. ఇంటినౌకర అవతారం వస్తువులు తుడుస్తూ వుంటాడు]

అవతారం: — నాయుడోరి తోటలోన నల్లతుమ్మ సెట్టుకాడ — (వస్తువులు సర్దుతూ పాటపాడుతూ వుంటాడు.)

ధర్మారావు:- తారం!

అవ: అయ్యా! నాయుడోరి తోటలోన—

ధర్మా: ఒరేయ్ తారం! (గట్టిగా పిలుస్తాడు)

అవ: (గట్టిగా) అయ్య.

ధర్మా: అమ్మగారేం చేస్తున్నారా?

అవ: (నిర్లక్ష్యంగా) ఏమో బాబయ్యా నాకు తెల్దు.

ధర్మా: కాస్త చూసొచ్చి చెప్పు.

అవ: ఎందుకు బాబూ?

ధర్మా: నారేయ్! చూసొచ్చి చెప్పరా అంటే ఎందుకు, గిందుకు అని ప్రశ్నిస్తావే?

అవ: నేను గిందుకు అని ప్రశ్నించినానా?

ధర్మా: అబ్బ! గిందుకు? అని మాత్రమే ప్రశ్నించావుగాని. పోయి అమ్మగారేం చేస్తున్నారో చూసిరా.

అవ: (విసుగ్గా) ఊ! సిత్తం (వెళ్ళి కాసేపు వుండి మళ్ళీ వస్తాడు. ఈలోగా ధర్మారావు ముక్కుపొడుం పీల్చడం కోసం జేబులోంచి ముక్కుపొడుం డబ్బా తీసి మూత తెరుస్తాడు. ముక్కుపొడుం వుండదు. పెదవి విరుస్తాడు)

ధర్మా: చూశావా? (అవతారం వైపు చూసి, అంటాడు)

అవ: సిత్తం వంటసేత్తన్నట్టున్నారు బాబూ, అమ్మగోరికి అగపడితే సెప్పిన పని చెయ్యకుండా ఇక్కడ తచ్చాడతన్నా నేమని అరుస్తారని కనపడకుండా వచ్చేసినా (పెదవులమీద నవ్వుతూ అంటాడు)

ధర్మా: ఒరేయ్ తారం! అమ్మగార్ని పావలా అడిగి ముక్కుపొడుం పట్టా.

అవ: అమ్మ బాబోయ్, అమ్మగోర్నీ నా ముక్కు పిండేత్తారు బాబూ.

ధర్మా: (ఒక్కనిట్టూర్పు విడిచి) పోనీ వెళ్ళి ఆ గురవయ్య కొట్లో అప్పన్నా పెట్టుకురా డబ్బులు తరువాత పంపిస్తానని చెప్పు.

అవ: అమ్మగోరు సెప్పిన పయానికి సరుదుడు పూర్తి సెయ్యకపోతే నామీద విరిరి పడతారు బాబూ.

ధర్మా: (విసుగ్గా) ఊ! ప్రొద్దస్తమానం అమ్మగార్యూ—అమ్మగారు. ఇక్కడ అయ్యగారు చెప్తున్నారు తెలుసా?

అవ: అది నిజమే నమాండీ! మరి అమ్మగోరి పెత్తనం సెలామణీలో వుంది కద బాబా అమ్మగోరు సెప్పిన పయానికీ పని కాకపోతే నా సొంకరి గుటుక్కుమంటా దాయె.

ధర్మా: (తనలోతాను చిన్నగా) నా ఆఖరికి నౌకరు కూడా లెంకవయ్యాన్ను (పెద్దగా,) అరేయ్ తారం! మా బాబు విని తను అనుకోకుండ కాస్త తెచ్చి పెడుతూ నీకు పుణ్యముంటుంది. అమ్మగారికి ఏదో

నాటినేవర్ని చెప్తుంటాగా (ఇది మామూలేనన్న ధోరణిలో అడుగుతాడు)

అవ: అప్పుడైనా అమ్మగారు చెప్పందే ఆ గురనాయ్ గాడు ఇయ్యడు గద బాబూ.

ధర్మా: ఊ. నీవరకు కొట్టువాడికి కూడా బోకునయ్యానన్నమాట ఖర్మ.

అవ: బాబూ!

ధర్మా: ఊ!

అవ: అమ్మగోర్ని డబ్బులు మీరే అడక్కూడదా బాబూ?

ధర్మా: నేనా? అమ్మగార్నా? ఇంకా నయం.

అవ: యేంటి బాబూ అమ్మగోరంటే మీ కంత బయం? అయినా మీరు కాబట్టి అలా వూరుకుంటున్నారు గాని, నా సామి రంగా నా పెళ్లామేగనీ యిలా నెత్తినెక్కి సలారుత్తే, నా పీక బోయే యెముక విరగ్గొడిచి పాయిలో కుక్కేనోణ్ణి. ఆ తరువాత యేమయ్యా అయితే మానె.

ధర్మా: నోరేయ్! నెమ్మదిగా మాట్లాడు ఆమెగాని విన్నదంటే, ఇద్దరినీ అంత పని చేసి తీర్తుంది. (కాసేపాగి, దిగులుగా) ఏరా? ఇప్పుడు పీల్చడానికి చిటికెడు పొడుమైనా లేదే.

అవ: ఉండండి బాబూ, నా దగ్గరున్న డబ్బుల్తో యెట్టాగో కొంటా. తరవాత వున్నప్పుడిచ్చుకుందురుగాని (పోదామని వెళ్తా వుంటాడు)

ధర్మా: నోరేయ్ కాస్త త్వరగా రా. (అవతారం వెళ్లాక,) ఈ మాత్రం జాలి ఎప్పుడు కట్టుకున్న దానికి లేకపోయె గదా.

(శాంతమ్మ ప్రవేశిస్తుంది.)

శాంతమ్మ: ఒరేయ్ తారం! తారం!. ఒరే అవతారం ఎక్కడ చచ్చావురా? ఎక్కడ అవతరించాడో ఈ అవతారం గాడు మరీ ఈ నౌకరకు తెలీకుండా పోతుంది. అంను మరి. నెల నెలా జీతం రాళ్ళు, మూడుపూటలా తిండి. రంపన్‌గా పారేస్తుంటే కళ్ళు నెత్తికొచ్చి వున్నాయి. అబ్బబ్బ, ఒరే తారం .. (పిలవడం ఆపి, కుర్చీలోనున్న భర్త వంక చూసి) ఏమండోయ్! అవతారంగా డెక్కడికి వెళ్ళాడు? (చిన్నగా అడుగుతుంది. ధర్మారావు వినిపించుకోడు) ఏమండోయ్! (పెద్దగా అరుస్తుంది.)

ధర్మా: పిలిచావా! (చిన్నగా అంటాడు)

శాం: లేదు, అరిచా, పిలిస్తే వినిపించుకునే రకమైతేగా: అవతారంగా డెక్కడ చచ్చాడూ?

ధర్మా: (ఇంగ్లీషు పుస్తకం చదువుతున్న ధోరణిలో, పుస్తకంలోకి చూస్తూ) హీ హేస్ గాన్ టు బ్రింగ్ స్నఫ్ పౌడర్.

శాం: అదిగో మళ్ళీ... ఇలా ఎప్పుడూ ఇంగ్లీషులో చెప్పొద్దని లక్షసార్లు చెప్పాను. చెప్పేదేదో తెలుగులో చెప్పరాదూ. ఏనాగ్గైతే చదివావయ్యా బి. ఏ.

ధర్మా: అబ్బబ్బ, తెలుగులోనే చెపుతా నుండవే. అయినా వాడిమీదెందుకు అలా విరుచుకుపడ్తావ్ పాపం! చాల మంచి వాడు. వాడిలాంటి నౌకరు దొరకడం కష్టం, పోగొట్టుకున్నావా—వాడు కాబట్టి నీదగ్గరలాగో వేగుతున్నాడు, పాపం.

శాం: ఏం? నా దగ్గర వేగడానికి. వాడికి నేనేమన్నా కూడు పెట్టడం లేదా, గుడ్డ లివ్వడం లేదా, కరెక్ట్‌గా జీతం ఇవ్వడం లేదా? అయినా వాడి మంచి చెడ్డలను గురించి చెప్పమని నిన్నెవరడిగారు? వాడెక్కడ చచ్చాడో చెప్పమని ఏడుస్తున్నా. అంతే.

ధర్మా: చెప్తానుండవే.

శాం: చెపుతాను అంటావే కానీ...త్వరగా చెప్పు. నా కవతల బోల్డెంత పనుంది. ఏకం, వండిపెట్టే కుటావ్. ఇటూ నేసే పనేం లేక పని—కాస్త అన్నం గంజి పడదన్నా వంచవ్ పైగా.

ధర్మా: (చెవులు మూసుకుంటూ,) చెపుతాను తల్లీ, చెపుతాను. అవతారంగాడు ...అవతారంగాడు ... ముక్కుపొడుం తేవడానికి వెళ్ళాడు.

శాం: ఊం...ఇదా సంగతి. ఇందుకా అవతారంగాడు మంచివాడూ, మంచివాడూ అంటున్నది. డబ్బంతా ముక్కుపొడుం, పొగాకు కాడలకే సరిపోయేట్టుంది. స్కూల్లో చేరడానికి వయసు చాల్లేదని రెండు సంవత్సరాలు ఎక్కువ వేయించాడట, రిజిష్టర్లో—రెండు సంవత్సరాలు ముందుగానే రిటైర్ అయి కూర్చున్నాడు. దమ్మిడీ సంపాదన లేదు, దర్జాలు మాత్రం జాస్తి. అయినా ఈ యింట్లో నీకు వాడు తప్ప మంచి వాళ్ళెవరూ కనపడ్రే దన్నమాట. వాణ్ణి రానీ చెపుతా (అంటూ శాంతమ్మ అక్కడి నుంచి చరచరా వెళ్ళిపోతుంది. అవతారం వస్తాడు)

అవ: బాబూ! ఇదిగో తెచ్చా బాబూ (పై జేబులోంచి ముక్కుపొడుం పొట్లాం పైకి తీస్తాడు)

ధర్మా: వచ్చావ్? కాస్త త్వరగా రమ్మని చెప్పలేమూ! ఇప్పుడెంత రాద్ధాంతం జరుగుతుందో ఏమో.

అవ: యేంది బాబూ!

ధర్మా: కాస్త చిన్నగా మాట్లాడరా బాబూ!

అవ: ఏం బాబు? (ముక్కుపొడుం పొట్లంను ధర్మారావు చేతి కందిస్తాడు.)

ధర్మా: ఏం లేదు కానీ, అమ్మగారిప్పుడే వస్తారు. జాగ్రత్తగా చెప్పు సమాధానం.

అవ: (భయంగా) నాకు తెల్దా యేంది బాబూ.

(శాంతమ్మ ప్రవేశిస్తుంది)

శాం: ఏరా తారం! వచ్చావా? నేను గదంతా సర్దరా అంటే నువ్వెక్కడి కెళ్ళావ్?

అవ: నే నెక్కడి కెళ్ళా నమ్మగోరూ?

శాం: అదేనమ్మా వాజమ్మా నేనూ అడుగుతున్నది.

అవ: అట్టా బయటి కెళ్ళొచ్చినా నమ్మా.

శాం: ఎందుకు?

అవ: అది కాదమ్మగోరూ! అయ్యగోరూ......

(ధర్మారావు కంగారుగా భయంగా తారం వంక చూస్తాడు. అవతారం ధర్మారావు వంక చూపు మరల్చుతాడు.)

శాం: ఊ! త్వరగా చెప్పు.

అవ: ఏం లేదమ్మగోరూ! నాక్కాస్త ముక్కు చూర్ణం కావలిసొచ్చి....

శాం: పాయిలో చూర్ణం కావలిపోరాదూ? అయినా ముక్కు పొడుం నీకా? అయ్యగారికా? (గట్టిగా గదుముతుంది.)

అవ: (అదిరిపడి, భయంతో) అ...అ... అయ్యగారే పంపారమ్మగోరూ! (చివరకు నిజం చెప్పేస్తాడు)

శాం: ముక్కు చూర్ణానికి పంపాడట ముక్కు చూర్ణానికి ఆయనేమో పంపాడూ నీవేమో వెళ్ళాడు, సరిపోయింది. నా ప్రాణానికిద్దరూ మా బాగా దొరికారు. ఈ సారెప్పుడైనా ముక్కు పొడుం కనీ, పొగాకు కనీ వెళ్ళావో, నీ జీతంలో కత్తిరిస్తా, ఒరేయ్ తారంగాడా!

కాదే అమ్మా

శాం: సీతా అవతారం అని పేరు పెట్టిందెవరురా?

అవ: మా అయ్య సిన్నప్పుడు పెట్టిండండి, బాగుందా అమ్మగోరూ! (మురిసి పోతూ అంటాడు).

శాం: నీ ముఖంలా వుంది. పిలవగానే ఒక్కంకు రంఛన్‌గా అవతరించాలని తెలీదూ? అరిచీ అరిచీ నా గొంతెంత పోయిందను కున్నావ్?

ధర్మా: ఇంపాజ్ బుల్!

శాం: ఏవిటి?

ధర్మా: నీకు గొంతు పోవడం!

శాం: ఏం? నదీగొంతే, ఊదుడు గొట్టం ఏం కాదు. (అవతారంతో) అయినా నీ కాయవ పనులు ముఖ్యమా నా పనులు ముఖ్యమా చెప్పవేం! నీ కాపేరు పెట్టి నందుకు మీ అయ్య ననాల్నే.

ధర్మా: మరి నీ కాపేరు పెట్టినందు కెవరినాలో.

శాం: చాల్నాళ్లే రేయ్ తారం! పోయి మధ్యగది వూడ్చి, శుభ్రంగా కడిగి వుంచు మా అన్నయ్య వాళ్లు వచ్చేటైమయింది.

ధర్మా: ఏవిటీ మీ అన్నయ్య వాళ్లా వస్తున్నారా?

శాం: ఆ! నిన్నేదో చిన్నప్పుడు చూశారు మూర్తాన్ని. వాణ్ణిచూసి, అల్లుడిని చేసుకోవడానికి వస్తున్నారు.

ధర్మా: అరెరె మరి నాకు చెప్పనేలేదే.

శాం: అయినా మీకు చెప్పాల్సిన అవసర మేముంది? (అవతారంతో) వెళ్లి త్వరగానే చెప్పినపని చెయ్యి.

అవ: సిత్తం (వెళ్లిపోతాడు. ధర్మారావింకా పుస్తకం చదువుతూండడం చూసి, చేతిలోని పుస్తకాన్ని లాగి, క్రింద దిరవాటేసి లోపలికి వెళ్లడానికి రెండడుగులు వేస్తుంది అది.)

శాం: మా అన్నయ్య వాళ్లొస్తున్నారని చెప్పానుగా కొంచెం స్నానం గీటా కానిచ్చు కాని, సిద్ధంగా వుండండి. (వెళ్లిపోతుంది. ధర్మారావు కుర్చీలోంచి లేచి, క్రింద పడిన పుస్తకాన్ని తీస్తూ,)

ధర్మా: పాపం! కాబోయే ఈ ఇంటి కోడలెంత దురదృష్టవంతురాలో. (ధర్మారావుకూడా నిష్క్రమిస్తాడు.)

(కాసేపటికి శాంతమ్మ పాడాడిగా తిరుగుతూ, మళ్లీ స్టేజిమీదకు వచ్చి, గదంతా ఒక్కసారి కలయ జూస్తుంది.)

శాం: (చిరాగ్గా) గదంతా శుభ్రం చెయ్యమని వాడికి చెప్పి గంటయింది. ఇంతవరకూ చెయ్యలేదు. ఇల్లంతా అలావే వుంది. అవతల మా అన్నయ్య వాళ్లొచ్చే టైం అయింది. ఏలా? (షెల్ఫ్‌లో చిత్తుత్తుగా పారవేసిన మూర్తం పుస్తకాలను చూసుంది. కోపంగా పుస్తకాలు సర్దుతూ,) అయ్యో ఖర్మ పుస్తకాలెలా సర్ది పెట్టుకోవాలో కూడా తెలీదు. పైగా ఏడుస్తున్నాడు కాలేజిలో బి. ఏ. అసలు పుస్తకాలెలా పెట్టుకోవాలో నేర్పని చదువులూ చదువులేనా? అందుకే అన్నా కూడా. మనకి కాలేజీ చదువులూ వద్దూ, చట్టు బండలూవద్దూ, వాటివల్ల ప్రయోజనం లేదూ, శుభ్రంగా పెళ్లి చేసుకొని, ఏదో చిన్న వ్యాపారం పెడుపు కోవడం శ్రేష్టం. అని చెపితే వింటేనా. (శాంతమ్మ పుస్తకాలను సర్దుతూ వుండగా, ఒక పుస్తకంలోంచి కొన్ని కాగితాలు ఇంక్‌తో వ్రాసి వున్నవి క్రింద పడతాయ్, అవి ఏమిటా అని చూస్తుంటె శాంతమ్మ. అదిరి పోతుంది. కంగారు పడుతుంది. పెద్దగా చదువుతుంది.)

ప్రియమైన కమలకు,

ప్రేయసీ! నీవు లేని జీవితం అర్థ రహితం. నన్ను నేను గాఢంగా ప్రేమిస్తున్నాను. నిన్ను చూసిన క్షణం నుంచి నామనసు మనసులో లేదు. నీ దోరనైన చోరచూపులు నన్ను నీ వశం చేసినయ్, నాకు ప్రేమభిక్ష ప్రసాదించి, నన్ను నీదరికి చేర్చుకో.

రేపు సాయంత్రం ఐదు గంటలకి పార్క్‌లో నీకోసం ఎదురు చూస్తుంటాను. తప్పక కలుస్తావ్ కదూ! ఏమంటావ్ రిప్లై చాల జాగ్రత్తగా ఇవ్వు.—మా అమ్మ కంట బడిందా, మన పని గోవిందా అసలే మా అమ్మ బ్రహ్మరాక్షసి. మరివే వుంటా టా టా!

నీ మూర్తం.

(ఉత్తరం చదివిన శాంతమ్మకు కోపం తుక తుక లాడుతుంది.)

శాం: ఊ నా. వద్దన్నకొద్దీ కాలేజిలో ంది ఇలాంటి పనులు చేయడాని కన్నమాట. ఇంటికిరా చెపుతా. ప్రేమలో పడ్డావ్!? (భర్త నుద్దేశిస్తూ) ఏవండోయ్! చూశారా నీ సుపుత్రుడు చేసిన ఘనకార్యం.

ధర్మా: (లోపలి నుంచి వస్తూ) అబ్బబ్బ. ఎందుకే అలా గొంతు చించు కుంటావ్? కాస్త చిన్నగ మాట్లాడలేవూ? అంతా నూర్పణకే. ఏవిటి?

శాం: 'ఏవిటి' అని చిన్నగా అంటారేం? అవతల కొంపలంటుకు పోతూంటే.

ధర్మా: అరెరె. కాస్త చిన్నగ మాట్లాడమంటూంటే.

శాం: ఏం? మీ గూబలేమన్నా పగు లుతున్నాయో? ఇంకెంత చిన్నగ చెప్పాలేం?

ధర్మా: ఆ! ఆ! నా గూబలకేం ఖర్మ. నీ రంకెలకా పైనున్న పెంకులు కూడా అప్పుడప్పుడు పగిలిపోతూంటే, కాస్త తగ్గించు స్వరం.

శాం: సరేలే. స్వరం తగ్గించాలట స్వరం. అందుకే వాడలా తయారయ్యాడు. అన్నీ అబ్బ పోలికలూ, అబ్బ గుణాలు.

ధర్మా: నా పోలికలూ, నా గుణాలూ కాబట్టే అంత వినమత. అంత వినయం, విధేయత అబ్బినయ్, వాడికి. నీ పోలికలూ నీ గుణాలూ రాకుండా వుంటే సరి, సంతోషించొచ్చు.

శాం: ఊ. ఇక సంతోషించుదురు గానిలే. అసలు వాణ్ణి ఆడవాళ్ళు, మగ వాళ్ళు కలిసి చదివే కాలేజిలో చదివించ వద్దని చెప్పానా? మొదటే వింతో మొత్తు కున్నానా? అయినా వింటేగా. అబ్బ 'ఊ' అన్నాడు, కొడుకు 'ఆ' అన్నాడు, సరి పోయింది. ఆ కాలేజిలోనే చేరాడు, కొంప ముంచాడు. రానీండి చెపుతా.

ధర్మా: అబ్బబ్బ. అసలేం జరిగిందో చెప్పకుండానే ఏవిటె ఆ పాలికేకలు?

శాం: ఇప్పుడు నే చెప్పి, మీరు వింటే ఏం బాగుంటుంది? వాడు వచ్చింతరువాత, వాడు చేసిందేమిటో తెలుసుకుని, జరగబోయేదేమో కళ్ళారా చూసి, అప్పుడు సంతోషిద్దురుగాని. వాణ్ణి రానీ. వస్తే వాడమె వీపుకి నా మేకపోతులతో జత కట్టిచ్చి పారేస్తా. పీడా విరగడౌతుంది.

(శాంతమ్మ కోపంగా లోపలికి వెళ్ళొస్తూ వుంటే,)

ధర్మా: అదికాదే. కాస్త విదానించు. (అంటూ శాంతమ్మవెంట వెళ్తాడు)

[సూర్యం చేతిలో పుస్తకాలతో సహా ప్రవేశిస్తాడు. టకప్ అప్ప్, టైకట్టి బూట్‌తో ట్రిమ్‌గా వుంటాడు]

సూర్యం: (వస్తూ) అమ్మా! కాఫీ. (తెరవెనుక శాంతమ్మ కేకలు విని) ఏవో కారాలూ, మిరియాలూ నూరుతున్నట్టుందే అసలీ యింట్లో రోజుకు అధమం అరవీశె మిరపకాయలు, మిరియాలు నూరడం అమ్మకలవాటేగా. హు అలాటప్పుడు ఈ రోజుమాత్రం వింతేముంటిలే. అసలు అమ్మ అంటే—అమ్మ బాబోయ్. అమ్మగారు. శాంతమ్మ కాదురా బాబూ కాంతమ్మ: సూర్యకాంతమ్మ (జేబులోంచి ఇన్‌లాండ్ లెటర్ తీసి, సంతోషంగా చదవడం మొదలుపెడ్తాడు.)

ప్రియమైన సూర్యంకు,

సూర్యం: ప్రియమైన సూర్యంకు. (సంతోషంగా అనుకొని, ఉప్పొంగిపోతాడు)

నువ్వు నన్నెంతగా ప్రేమిస్తున్నావో నాకు తెలుసు. కాని, నేను నువ్వంటేకన్నా నిన్నె రెట్లు ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నీవు లేనిదే ఒక్క క్షణం కూడా ఉండలేక పోతున్నాను. మన సంగతంతా మా యింట్లో చెప్పి, మన పెళ్ళికి వప్పిద్దామని ప్రయత్నించాను.

సూర్యం: (లెటర్ చదవడం ఆపి,) ఎంత మంచిదానివి కమలా. ఊఁ ప్రయత్నించి ?

(లెటర్ చదువుతాడు.)

కానీ, కథ అడ్డం తిరిగింది. (నిరుత్సాహపడ్తాడు) నన్ను గట్టిగా నాలుగు చివాట్లు పెట్టారు. మన పెళ్లి మా నాన్నకు ఇష్టమే. కాని, మా అమ్మకు నచ్చలేదు. మీరే నా దైవం అని చెప్పాను. ప్రాధేయపడ్డాను. ప్రతిమాలాను మా అమ్మ మనసు కరుగలేదు.

(లెటర్ చదవడం ఆపుతాడు)

సూర్యం: హు. అమ్మట అమ్మ బొమ్మ. మీ నాన్న కిష్టమైనపుడు మీ అమ్మ కెందుకు కష్టం ?

(మళ్ళీ లెటర్ చదువుతాడు)

మీ అమ్మగారు, అంటే అత్తగారు చాలా దురుసు మనిషట!

(లెటర్ చదవడం ఆపి,)

సూర్యం: అవును కమలా! మీ అమ్మ నిజాన్ని గ్రహించింది. మా అమ్మ నిజంగా రాక్షసి కర్కోటకి రాక్షసి!

(ఉత్తరంలోకి చూసి,)

నిన్ను పెళ్ళి చేసుకుంటే మీ అమ్మవల్ల నేను చాల కష్టాల పాలౌతావట.

(చదవడం ఆపి.)

సూర్యం: కానీ, నిన్నలా కష్టపెట్టలేను కమలా. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తా, నా మాట నమ్ము.

(ఉత్తరంలోకి చూసి,)

అయినా సరే వస్తాను, మా అమ్మ నన్ను చాల బాధించింది. మా నాన్న అన్నీ చెప్పారు. కాని, మా అమ్మ ముందు మా నాన్న మాటకు విలువ లేదు.

(చదవడం ఆపి)

సూర్యం: అమ్మ మీ అమ్మ మా అమ్మ ఇలా కాదంటారో చూస్తా. ఈ దెబ్బతో అమ్మ దురుసుతనం దెబ్బకు వదలాలి. 'అమ్మ' అంటే కరుణామయి; ప్రేమా స్వరూపిణి అంటారే ఇదేనా? అసలు అన్న వాడిని అనుకోవాలి. ఈ పెద్దవాళ్ళకున్న రోగమే యిది. చక్కగా, హాయిగా, ప్రేమించు కున్నవాళ్ళని పెళ్ళి చేసుకోనివ్వరు. పైగా తీవర్నో అపర జరిదేక సుందరీమణుల్ని తెచ్చి, ఇదేనయ్యా వసంత్సరంలో వుండగానే ప్రారంభిస్తారు 'పెళ్ళి చేస్కోరా నాయనా, నా కొండ కదూ, నా బంగారు కొండ కదూ' అంటూ ఛీ ఛీ. అందుక్కాదు మ్యాప్ మాగజైన్స్‌లో న్యూనీ పేరిడ్ కవుల్స్ అలా దేవతి ముఖాలు వేస్కొని వుండేది. చెప్తాను, లోకంలో వున్న అమ్మ లందరికీ ఒకేసారి బుద్ధి చెపుతాను. నా సంగతింకా తెలీదు వాళ్ళకి. భార్య చెప్పు చేతుల్లో వుండే భర్త అందరికీ నోళ్ళు తెప్పి స్తాను కమలా! నీతో నా పెళ్ళి కానివ్వ నన్నది కదూ మీ అమ్మ. ఎలా కానివ్వదో చూస్తా. మీ అమ్మ చేతుల్లోంచి నిన్ను లాక్కెళ్ళి ఎంచక్కా నీ మెడలో మరీ వేస్తా నా మూడు ముళ్ళు. అసలు మనిద్దరి మన సులు కలిసిం తర్వాత ఆ బ్రహ్మదేవుడు మాత్రం ఏం చేస్తాడు? ఈ కాలపు యువతీ యువకు లింతేలే. సరేలే, ఒకరి ప్రేమ నొకరు అనివితీర జార్చుకోవీ సారం, కసిపిల్లలు అవి పూర్తయింటాను. మధ్యలో ఆ బ్రహ్మదేవుడిచేత సృష్టించబడిన ఈ అమ్మా నాన్నల...ఆహా—అమ్మల కెందుకో ఓడి పెత్తనం. హు.

(ఉత్తరంలోకి చూసి.)

సూర్యం! మనిద్దరం రిజిస్టర్ మారేజ్ చేసుకుందాం.

(చదవడం ఆపి, ఆవేశంగా,)

ప్రేమ

సూర్యం: కమలా! రిజిస్టర్ మేరేజికి సిద్ధమేనా! నా మీద నీ కెంత ప్రేమ.

(ఉత్తరంలోకి చూసి)

అనుకున్నాను.

(చదవడం ఆపి.)

సూర్యం: (నీరసంగా) అనుకున్నాను.

(మళ్ళీ ఉత్తరంలోకి చూసి)

కాని...అది సాధ్యం కాదు సూర్యం. నన్ను ఇల్లు కదలనివ్వడంలేదు. మా అమ్మ మనసు మారడం చాల కష్టం. ఈ ఉత్తరమైనా దొంగగా మా తమ్ముడిచేత పోస్టు చేయిస్తున్నాను. ఆమె మనసు నా బ్రహ్మ దేవుడు కూడా మార్చలేడు. దయచేసి నన్ను మర్చిపో. నన్ను క్షమించు సూర్యం.

ఇట్లు,

కమల.

(ఉత్తరం నంక మరోసారి చూసి,)

సూర్యం: దయచేసి నన్ను మర్చిపో, హుఁ. ఎంత తేలిగ్గా అన్నావు కమలా, ఒకరి కర్పించిన మనసు మరొకరి కర్పించడం సాధ్యమా కమలా? డబ్బుకి బడితే వాళ్ళకు ఇచ్చి పుచ్చుకోవడానికి మనసు మట్టిబొమ్మ కాదని తెలీదూ!

'సూర్యం! నా పెళ్ళి నీతోనే జరగాలి, లేకపోతే నాకసలు పెళ్ళే లేదు.' అన్నావే, మీ అమ్మా నాన్నలి కెయిష్టం అయినా వచ్చే పెళ్ళాడతాను మన తొలి ప్రేమ రోజుల్లో అన్నావే. గాలిలో కలిసిపోవా కమలా ఆ మాటలు? 'నువ్వే నా ప్రాణం. నువ్వు లేనిదే నాకీ లోకం లేదు' లేదంటే ఒట్టు మాపులు విసురుతూ పిచ్చిగా అంటుండేదానివే. హా, ఎంత కరుణారహితులు కమలామీతరులు. అందుకే అన్నాడో మహానుభావుడు. 'క్షణక్షణముల్ జవ రాండ్ర చిత్తముల్' స్త్రీలు చపలచిత్తులు అని. కమలా! నేను లేని లోకం నీకు లోకంగా అనిపించినప్పటికే, నీవు లేని జీవితం నాకు జీవితంకాదు. ఇక నాకీ జీవితంమీద విరక్తి పుట్టుకొస్తుంది. నేను ఛస్తాను. కమలా నేను ఛస్తాను. (మళ్ళీ లెటర్ చూసి) ఊఁహు. నేను చావను కమలా, నేను చావను. నీకోసం బ్రతికే వుంటాను మీ అమ్మ మనసు మారడం కష్టమన్నావు కదూ. ఎలా మారదో

చూస్తా. దెబ్బకు దెయ్యం వదిలిస్తా. నిన్ను దక్కించుకుంటాను కమలా. నన్ను నాదాన్ని చేసుకుంటా. కలిసిన మనసుల నెవరూ విడదీయలేరు కమలా. ఇదిగో, ఇప్పుడే వస్తున్నాను. నీ దగ్గరకే వస్తున్నాను. అమ్మా! అమ్మా! (పెద్దగా ఆవే శంగా అరుస్తాడు)

[ఇదంతా కాంతమ్మ వాకిటనుంచి వినీ అలా వూపుతుంటూ పన్నుగుత్తి, లేవనానికి వెళ్ళిపోతుంది. ఆవతారం ప్రక్కా అబ్బు లోంచి వస్తాడు]

అవ: యేంది బాబా అట్టా కేకలు? యిల్లు పడిపోయేట్టు?

సూ: అనర్థం! అమ్మ యేం చేస్తోంది? (కంగారుగా అడుగుతాడు)

అవ: ఏమో. నాకు తెల్దు బాబా.

సూ: అమ్మనడిగి నాక్కొ కాఫీ పట్రా.

అవ: అమ్మగారోయ్. అమ్మగారిందరి మీద ఏదిదెద్దిపడతుండారు. బాబా ఈ టయాన నేనడిగినానంటే నన్ను సాంతో పెడతారు. మీరే పోయడగండి.

సూ: నాన్నగారేం చేస్తున్నారు?

అవ: తలకాయనొప్పిగా పడుకున్నారు లోన.

సూ: ఊఁ. అయితే ఇంతకి కాఫీ తేవంటావ్.

అవ: యే బాబోయ్. నా వల్లకాదు బాబా (వెళ్ళిపోతా)

సూ: నాకు. (విసుక్కొని, కుర్చీలో కూర్చుంటాడు.)

[కాంతమ్మ పద్దగ్గిత్తతోనహ ప్రవే శిస్తుంది.]

కాం: (సూర్యం మద్దేశించి) ఏం నాయనా ఆ యింత దా మెవ్వరిదొబ్బుతున్న కాలేజీ?

సూ: (విసుకుకోకుండా), అమ్మా! కాఫీ (గారాంగాలని, అంట్లో కెత్తి, పన్ను గుత్తి పట్టుకొనివున్న తల్లినిచూసి, ఆగి పోగా)....అ...అయిపోయిందమ్మా.

కాం: ఆ ఇప్పుడే ఇక వస్తున్నాదా అలా పిలవకు. అది సరే, ఇన్నాళ్ళనుంచి భారంగా ఈ వ్యవహారం సాగిస్తున్నదా? పద. నా వెనకే పోదాం. వెధవ వేషాలు. దాని కాళ్ళు, ఇవాంటివి నాయనా అంటే నీ ఇష్టాలు వినగొట్టదా. ఊఁ పద.

సూ: ఎక్కడికే?

శాంతి : ఇంకా మాట్లాడతావా రెధవా, ఏమీ తెలీని వెంగనాచిలా.

సూ : ఏముందే?

శాం : ఏముంటావా! అర్థంకాలా? అర్థమయేట్లు చెపుతాను వద. అయ్యా ముఖం చూడు. సూర్యం అట సూర్యం. వెలిగి పోతున్నాడు.

సూ : నాన్నవద్దన్నా వినకుండా, నాన్నతో పోట్లాడి, నానాగందరగోళం చేసల్లా నువ్వు పెట్టిన పేరేనటకదే. నాన్న చెప్పాడులే.

శాం : చెప్పాడూ!? చెప్తాడు. చెప్పడూ మరి. ఒకళ్ళమీద చాడీలు చెప్పడంలో మాత్రం దిట్ట మీ అయ్య. అవును. నీకా పేరు నేనే పెట్టాను. బుద్ధి గడ్డి తిని పెట్టాను. ఇంత ఛండాలప్పు వాడివౌతావని నేనేమన్నా కలగన్నానా! ఇప్పుడు చూస్తున్నాగా పేరుకు తగ్గట్టిలా వెలుగుతూ మా జీవితాల్నెలా వెలిగిస్తున్నావో—సిగ్గులేకపోతే సరి. దాని తల్లిదండ్రులు నీకూ దానికీ సంబంధం?

(శాంతమ్మ సూర్యం జుట్టు పట్టుకొని వూపుతూ, దాని కనుగుణంగా పళ్ళుగిట్టి వూపుతూ కోపంగా అడుగుతుంది)

సూ : అమ్మోయ్! (బాధగా అంటాడు)

శాం : ఏమ్మా ఏం అంత బాధగా వుందా? ఎప్పుడనిపించలా ఈ బాధ?

సూ : అబ్బబ్బ. బాధకాదే. నా క్రాప్ చెడిపోతుంది. (సూర్యం తల్లి చేతిలోంచి జుట్టు వదిలించుకుని, తన చెవి సందించి, జేబులోంచి దువ్వెన తీసి, తల దువ్వుకుంటూ నవ్వుతూ అంటాడు) నా క్రాప్ అంతా చెడిపోయింది కదే.

అవ : (వచ్చి) అమ్మగోరూ! గది కడిగి, అంట్లు కూడా తోమేసినా. అటనెక్కడ పెట్టమంటారు?

శాం : నా నెత్తిమీద.

అవ : పిత్తం (వెళ్ళబోతాడు)


శాం : ఒరేయ్! ఎక్కడికి?

అవ : తవరు అంట్లని...

శాం : ఊం. అంట్లని? ముఖం చూడు పిడక ముఖం, నువ్వా వెళ్ళి, తలుపుతెరిచి, వంటగదిలో వున్న షెల్ఫులో సర్దిపో. తెలివి తక్కువదద్దమ్మా (తాళాలు విసిరేస్తూ అంటుంది. సూర్యం మద్దెలించి) ఏం నాయనా! అది లేకపోతే నువ్వు బతకలేవ్? అంత ఇదిగా ప్రేమిస్తున్నావా. నీమీద సోదమాపుడు నిసరుతుంది, దానిబుద్ధి

వినతారా అదే సార్కులో బదుగలలకు నిన్నే ప్రేమించానని... కలుస్తుందిటా. సరి నాయనా. పార్కుకి దానికి లేకపోతే సరి. దాని తల్లిదండ్రులు పోదాం. కలుసుకుందురుగాని దాన్ని ప్రేమ, [illegible]

సమాజంలో హెచ్చుతగ్గులు వున్నంతకాలం సామాన్యుడికి సాంఘిక న్యాయం దుస్సాధ్యం



దేశంలో సామాన్యులు దుష్టశక్తుల ఇనుప ఎడికిళ్లలో నలిగిపోతున్నారు.
అందుకు ప్రబల సాక్ష్యం ధర్మ—హృదయ విదారక జీవిత గాధే!



దేశ దుస్థితికి మూలకారకులైన దుష్ట
శక్తులు చేతికి చిక్కగానే బుద్ధి చెప్పిన
అతి సామాన్యుడు తారకం



చదువుకున్న లక్ష్మి మధు మంచిని పెంచడానికి
కృషిచేస్తూ దంపతు లయ్యారు కాని వారి మధ్య
పొరపొచ్చాలొచ్చాయి పరిస్థితులు విషమించాయి
మరి మంచివారే యిలా మారితే ..?



నిందితుడు చేసిన నేరాన్నేగాదు— ఆ నేరం చేయడానికి
ప్రోత్సాహమిచ్చిన సామాజిక పరిస్థితుల్నికూడా పరిశీలించి
చెప్పినదే సరైన తీర్పు ..

సమ సమాజ నిర్మాణంతోనే దేశంలో సుఖశాంతులు విలసిల్లుతాయి!



ఎంతో ఘోరం జరిగితేగాని ఆడది తిరగబడదు. అందులోనూ అహింసా సిద్ధాంతాలను నమ్మిన గౌరి ఇప్పుడిలా హింసకు తలపడితే....!



ఈ అత్తా-కోడళ్ల జీవిత గాథే భారత మహిళల దుర్భర జీవితాలకు దర్పణం.



నలుగురికి న్యాయం జరగాలని ఎదుటి వారి మోసాలను ఎత్తి చూపాడు కార్మికుడు శివయ్య. కాని—ఫలితం జైలు ప్రాప్తి. ఇదీ నేటి సమాజ దుస్థితి!!





జానెడు పొట్టకోసం—దుర్మార్గుల ప్రతినిధులుగా పనిచేసే ముఠాలు, గురునాథం—సమాజంలో చిన్న సైజు చీడపురుగులు.

ప్రేమ

హృదయాలలో వుంచాలని అయ్యో నా తెలివి తెల్లారా. వెలావుంటుంది, దాని తల్లోంక యిడిపిరద్దై వుంటుంది, కూతరేమో తల్లినే మించి యిడిపి కూర్చుంది. ఊఁ, అయితే చివరకు వన్ను బ్రహ్మరాక్షసిని చేశావన్న మాట.

మా : పొద్దున్నుడూ చేశానే. నువ్వు చెప్పే దెవరి సంగతో నాకంతా అయోమయంగా వుంది.

శాం : వుంటుందిరా వుంటుంది. ఆడవాళ్ళకి చదువు అవసరం అనేది అందుకే మరి ఈ కాలేజి అబ్బాయిలు బరితెగించి కొట్టుకుంటున్నాయ్‌యిరా, బరితెగించి కొట్టుకుంటున్నాయ్.

మా : అమ్మా! అమ్మోయ్! కాస్త చిన్నగ మాట్లాడవే. ఎవరింట్లోనన్నా వుప్పు రాధ విని, ఈ సంగతి రేపు కాలేజిలో ఏకిందంటే—కాలేజి నారీమణులంతా కలిసి మనింటిమీద దాడిచేసి, మన ప్రాణం తీస్తారు. ఆ తరువాత నేనేం చెయ్యలేను.

శాం : ఎవతెరా నా యింటిమీదపడేది. రమ్మను. నారీమణులట నారీమణులు. వరాలు పీకి పారేస్తా. ఇంతకీ ఎవతెరా అది?

మా : ఇంతకీ ఎవరి సంగతే నువ్వు మాట్లాడేది?

శాం : అదేరా. క...మ...ల పి... దాని పేరు వుచ్చరించడానికికూడా నాకు చీదరేస్తోంది.

మా : అయితే గమ్మున వూర్కో (ఆశ్చర్యంగా చెప్పబోతాడు)

శాం : నోరేయ్ మూర్ఖుడా! గుర్తులేదూ! మూడురోజులు కూడులేకుండా మాగపెట్టా.

మా : అబ్బబ్బబ్బబ్బ నీతో పెద్ద గొడవైపోయింది. అసలు సంగతేమిటో నాకు తెలియంలేదు.

శాం : అదేరా. ఎవతెకు నువ్వు ప్రేమలేఖ వ్రాసింది?

మా : ప్రేమలేఖా? నేనా? నేనెవ్వరికీ వ్రాయలేదే. ఏమో నాకు తెలీదు.

శాం : నీకు తెలీదూ?

మా : ఊహూ. తెలీదు.

శాం : నీకు తెలుసు.

మా : అప్పుడ్నించి తెలియదంటుంటే జీడ్లులా పట్టుకు వదలవే.

ధర్మా : (లోపలినుంచి వస్తూ) తెలిస్తే చెప్పరా. శిక్ష తగ్గుతుంది. దీని గోల కూడా వదుల్తుంది.

మా : (దిగులుగా) నాన్నా! నువ్వు కూడా అమ్మ పార్టీయేనా. నాకు తెలీదూ అంటుంటే నన్నెందుకింత బలవంతపెడ్తారు?

ధర్మా : అది కాదురా

మా : ఏదీకాదు. నిజంగా నాకు ప్రేమలేఖ సంగతేం తెలీదు నాన్నా. నామాట నమ్మండి.

(అవతారం ప్రవేశిస్తాడు. తాళం చెవి శాంతమ్మ కిచ్చివేస్తాడు)

ధర్మా : అయితే మరెందుకే వాళ్ళలా వత్తిడి చేస్తావ్?

అవ : పోనీండమ్మగోరూ. ఏదోపిల్లోడు పెద్దోళ్ళం మనం సరుదుకుపోవాలి.

శాం : ముయ్యి నోరుమయ్యనోయ్. పెద్ద చెప్పొచ్చావ్.

అవ : చిత్తం.

శాం : రేయ్ మూర్ఖంగా! నీకు ప్రేమలేఖ సంగతి నిజంగా తెలీదూ?

మా : (పూర్తిగా విసిగి) అబ్బబ్బ తెలీదు తల్లోయ్! నా కేంతెలీదు బాబోయ్!

శాం : అయితే దీనికేమిటి సమాధానం (అంటూ తనంతకు ముందు మూర్ఖం పుస్తకంలో చూసిన కాగితాలమతెచ్చి మూర్ఖం ముందు విసిరేస్తుంది. మూర్ఖం అయోమయంగా వంగి, అందుకుంటాడు. చదవడం పూర్తిచేసి, నగబడి నవ్వుతూ వుంటాడు. శాంతమ్మ పరిస్థితి అర్థంకాక్క ఆశ్చర్యంగా చూస్తుంది. ధర్మారావు, అవతారంకూడా మూర్ఖంవైపు అయోమయంగా చూస్తూ వుంటారు)

శాం : ఎందుకురా అలా నవ్వుతావ్? పిచ్చి లేదూ!?

మా : ఎందుకే పిచ్చి. అమ్మోయ్! అంతా చదవకూడదటే. ఈ ప్రేమలేఖ సంగతంతా నీకు పూర్తిగా తెలిసేది.

శాం : (నోరు నొక్కుకుంటూ) హవ్వ హవ్వ సిగ్గులేక పైగా అంతా చదవమంటున్నావా. శివ శివా. నాకే చెపుత్నావు కి ఓరోయ్ భగవంతుడా.'

(ఆ మాటలకు మూర్ఖం తన నవ్వ్వి

ప్రాయురి పెంచుతాడు?

శాంత : ఏం. అలా నవ్వుతావ్, నీకి తిక్క పట్టిందా. (కోపంగా అంటుంది. ఇంకా నవ్వుతాడు, మార్యం)

శాం : ఊం. ఇంకా నవ్వేవోయ్. నవ్వుతుంది పేడ ముఖం.

ధర్మా : వాడి ముఖంకేమే. కొంచెం అద్దంలో చూస్కో. వరిది పేడ ముఖంలా వుందో తెలుస్తుంది.

మా : ఏం లేదమ్మా. ఇది నేను అమ్మాయికి వ్రాసిన ప్రేమలేఖ కాదు. మా కాలేజి మాగజైన్ బోర్డువాళ్ళు మాగజైన్‌కు కథలు వ్రాసిచ్చే వాళ్ళను వ్రాసిమ్మన్నారు, నేనూ ఒకటి వ్రాశాను. ఆ నాకథలో ప్రేయసికి ప్రియుడు వ్రాసే లేఖ వుంది. ఈ కాగితాలు నా పుస్తకంలో వుండి, పొరపాటున నీ కళ్ళబడినయ్. నా ఖర్మకాలి, కథ మొదలుపెట్టడం పెట్టడం ప్రేమలేఖతోనే మొదలు పెట్టాను. ఇంకేముంది. నువ్వేమో తరువాతి కాగితాలేం చూడకుండా నామీద దీపావళీ ఔట్‌లాగ విరుచుకుపడ్డావ్. కావాలంటే మిగతా కథ చదువ్. (కాగితాలు తల్లి కందిస్తాడు)

శాం : (మిగిలిన కాగితాల వంక పరిశీలనగా చూసి) హోరి పిడుగా (అంటుంది).

మా : నిజం తెలుసుకోకుండానే వింతా ర్భాటం చేశావమ్మా అందుకే అంత తొందరపాటెప్పుడూ తగదన్నా.

శాం : హు. ఆఘోరించావ్‌లే.

ధర్మా : (హుందాగా మీసాలు మెలి వేస్తూ) వాడు నా కొడుకే.

శాం : సరేలే సంబడం. అయితే వుత్తరం క్రింద నీపేరెందుకు వ్రాశావ్‌రా గాడిదా.

మా : అమ్మా ! కమలం దేనిచేత వికసింపబడుతుంది? మార్యుని చేత. అవునా? నేను వ్రాసిన కథలో నాయకీ నాయకులు ఒకరి నొకరు ప్రేమించుకుంటారు కాని, నాయకుని తల్లి—అచ్చం నీలాంటిదేననుకో, వాళ్ళ పెళ్ళికంగీకరించక, వాళ్ళిద్దరి మధ్య పింగ 'వాంప్' అయి కూర్చుంటుంది. వీలా అయితేనేం. చివరకు వాళ్ళిద్దరూ పెళ్ళి చేస్కుంటారు. నాయకుని వలన నాయిక ఆనందం వికసింపబడుతుంది. అందుకే నాయకునికి మార్యం, నాయికకు కమల అని పేర్లు పెట్టాను ఇప్పుడు తెలిసిందా? అదీకాక, ఏదో వ్రాయక వ్రాయక ఒక కథ వ్రాశాను కదా, నేను వ్రాసిన కథలో

ప్రేమ

హీరోకి రాసిన పెట్టుకుంటేటి బాగుంటుం దనుకున్నాను, పెట్టాను. అంతేగాని, ఇంట్లో ఇలాంటి పెదర్ ... అహా వాతావరణం ఏర్పడుతుందని నాకేం తెల్సు?

శాం : (తల వూపుతూ) వారేయ్ మూర్యంగా! ఎంత బాగా కల్పించావ్‌రా కథ, తియ్యగా జేబులోంచి, దాం దగ్గర నుంచి వచ్చిన వుత్తరం నన్నే మభ్య పెడదామనుకున్నావ్? ఊఁ. అయితే అది కూడా తెరిచి వుత్తరం వ్రాసిందన్నమాట

మూ (వినుక్కు) వుత్తరం ఏవిటే మళ్ళీ

శాం నోర్మూసుకొని, ఇమ్మిన వుత్తరం బయటకు తియ్యగా నాయనా

(జేబులోంచి వుత్తరం అయోమయంగా తీసి, తల్లికిస్తాడు, మూర్యం శాంతమ్మ చదువుతుంది)

(ప్రియమైన ధర్మారావు బావకు,

బావ మరిది రంగనాథం వ్రాయున లేఖనగా, ...

శాం (చదవడం ఆపి) ఈ వుత్తరం నీ జేబులో ఎందుకుందిరా? ఏవిటే ఈ వుత్తరం పట్టుకొని ఇందాకేదో ప్రేమ కలాపాలు వలుకుతున్నావ్

మూ ప్రేమ కలాపాలా

శాం : అవేరా ఇందాక తెగమాట్లా డాత్తుగా

మూ ఓహ్ అహా ఫంఫీన్ పో వాటిని విన్నావ్? మొత్తానికి నువ్వుండ వలసిన దానివేనే ఏమీలేదు మొన్న నేను నీకు చెప్పలా

శాం ఏమని

మూ అదే నేషనల్ డిఫెక్స్‌ఫండ్‌కి డ్రామా వేస్తున్నాము అందులో డైలాగ్‌లు అవి నా ఏక్టు చేస్తున్నాముగా, ఇందాక నేను చెప్పి వస్తి నా డైలాగ్‌లన్నమాట మరేం లేదు నీకు ఎక్కడ ఏలుంటే అక్కడ ఓన్‌గా ఏక్షన్ ప్రాక్టీస్ చేసుకోమని మా డ్రామా డైరెక్టర్ చిన్న సజషన్ ఇచ్చారూ అందుకని, రిహార్సల్స్‌లో కూడా వేమరాలిటీ వుంటుందని, ఎక్కడో మూలనున్న ఈ పాత వుత్తరం పట్టుకొని, ఇందాక డ్రామా డైలాగ్‌లు వల్లిస్తూ వున్నప్పుడు నువ్వు వచ్చి వుంటావ్ అది సంగతి

శాం సినేమరాలిటే తగలెయ్య. మరి దాన్లో కూడ కమల కమల అంటూ ఆ పాడుకూత కూశావ్ కదరా, మరి

మూ వచ్చాను రా భగవంతుడా ... జమే. దాన్లో కూడా కమలే కదూ వచ్చింది ఖర్మ, ఏం చేసేది దాంట్లో హీరోయిన్ కూడా కమలే ఐకూర్చుంది. ఇంకేం నీకు నామీద వున్న అనుమానం పూర్తిగా బలపడిందన్న మాట అందుకా నన్ను గుత్తి తీస్కొని మీద వడ్డావ్!

శాం ఏడవలేక పోయావ్

ధర్మా (మీసాలు మెలిపెడ్తూ విగతాలిగా నవ్వుతూ) నాయ్! శాంతమ్మగారూ!

మూ నా యేషాపు సంగతలా వుంచు అయితే ఇప్పుడు చెప్పవే నేను గాడిదనైతే, నువ్వు గాడిద తల్లి వన్న మాటేగా?

ధర్మా అన్నమాటేగా విగతాలిగా నవ్వుతాడు, భార్యవైపు చూసి)

శాం (భర్తవైపు కోపంగా చూస్తూ) ఆ మాట కొస్తే మీ అయ్యా కూడా (ధర్మారావు తక్కన ఆపేస్తాడు నవ్వడం మూర్యం అదే పనిగా నవ్వడం చూసి) ఊఁ ఇంకాపవోయ్ నవ్వు, మూశాం గావు (లోపలికి వెళ్ళబోతుంది)

మూ (నవ్వడం ఆపి) అమ్మా! కాఫీ (గారాంగా అంటాడు)

శాం (వెళ్ళేదల్లా అగి చురుకుగా) వుండు కాసేపు, తెచ్చేవరకు ఆగలేవ్?

మూ అమ్మా! అందుకే పెద్దలేమన్నారో తెలుసా!? త్వరపడి ఏదీ తినకు, ఏది అనకు, ఏదీ వినకు అన్నారు. కాబట్టి ఇక మీదట పొరపాటుగానైనా ఏది, చూడొద్దు ఒకవేళ చూశావా, ఎవరికీ చెప్పొద్దు ఇందాక నేను డ్రామా డైలాగ్‌లు చెప్పేటప్పుడు నువ్వు విని పొరపాటు పడ్డావ్ ఇక ఏదెప్పుడూ అలా పొంచి వినవద్దు

శాం : అఘోరించావ్‌లే స్నానం చేసి త్వరగా తయారవ్ అవతల మీ మామయ్యా వాళ్ళొచ్చే టైమయింది విన్ను చూడ డానికి (వెళ్తూ వుంటే)

మూ ఓ ఇదిగో రెండు నిముషాల్లో రెడీ అవుతా (హుషారుగా ఈల వేసుకుంటూ లోపలి గదిలోకి వెళ్తాడు మూర్యం ధర్మారావు, అవతారం వెళ్తున్న మూర్యం వైపు చూసి, తరువాత ఒకరినొకరు చూసుకొని నవ్వుతూ వుండగా, తెర నెమ్మదిగా జారుతుంది) ●



నెల్లూరుజిల్లా కొత్తపల్లికి చెందిన ... బండి వెంకటరెడ్డి భార్య శ్రీమతి అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఖండూభాయ్‌దేశాయ్‌వద్దనుంచి రాష్ట్రపతి పతకాన్ని అందుకుంటున్న దృశ్యం

(ఫొటో శ్రీధర్)

వారఫలం

7–9–1973 శుక్రవారం మొదలు 13–9–1973 గురువారం వరకు

మేషం:— వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృషభం:— అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు — వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

మిథునం:— మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో వృత్తివ్యాపారాలు బాగుంటాయి. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. సంతోషకరమైన వార్తలను వింటారు.

కర్కాటకం:— భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో చికాకులు యేర్పడతాయి. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

సింహం:— వ్యాపారంలో పోటీవారి పోటీ పెరుగుతుంది. ఇతరుల నిమిత్తం మీరు శ్రమకు గురి కాగలరు. దైవకార్యాలు నెరవేరతాయి. వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు.

కన్య:— వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. వారం ఆఖరులో మీకు అనవసరమైన సందేహాలు కలుగుతాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు — వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

తుల:— మీ కార్యక్రమాల్లో అడావుడి అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వారం ఆఖరులో వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యావైజ్ఞానికరంగాలలో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం:— వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి.

స్త్రీలకు — సంతోషకరమైన వార్తలను వింటారు. దైవకార్యాలు నెరవేరతాయి.

ధనుస్సు:— అన్ని వ్యవహారాల్లోను మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం:— వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించగలదు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కుంభం:— సహాయం చేస్తామన్నవారు సమయానికి తప్పుకోవచ్చును. ఉద్యోగంలో శ్రమకలుగుతుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు. వారం ఆఖరులో వృత్తివ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. ప్రయాణాలోచనలు చేస్తారు.

మీనం:— మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారం ఆఖరులో చికాకులు యేర్పడతాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్ ●

నిధులకోసం వేట—6

విక్ ఆల్‌డిస్

సముద్రంలో బంగారపు రాసులు

అది 1830 డిసెంబరు నాలుగోతేదీ నాటి మాట. బ్రెజిల్ తీరంనుంచి ఇంగ్లాండుకి ప్రయాణం చేస్తున్న ఓడలో కొన్ని కోట్లు ఖరీదుచేసే బంగారపు కడ్డీలు, వెండినాణాలు వున్నాయి.

సాయంత్రం ఏనిమిదిగంటలకి సముద్రపు వాతావరణం పూర్తిగా మారిపోయింది. గాలివాన ఆరంభమయింది. రక్షణ గురించిన ఏర్పాట్లు చేస్తూండగానే ఓడలో పెద్ద కోలాహలం లేచింది.

కింద ఓడని కోసిపారేసే రాళ్ళు పైన గాలి దుమారం. ఆలోచించడానికి కూడా అవకాశం లేదు. ఓడ దైవాధీనమై కొట్టుకుపోయి 'కేప్‌ఫ్రియో' దగ్గర పగిలిపోయింది.

డజనుమంది సుమారు చచ్చిపోయారు. చాలామంది గాయపడ్డారు. మరికొంతమంది ఓడ అడుగున చిక్కుకుపోయి అంతు తెలియకుండా పోయారు.

కొంతమంది ప్రాణాలని అరచేతిలో వుంచుకుని సాహసంతో వొడ్డుకు చేరగలిగారు.

ఈ వార్త 'రియో'కి చేరేటప్పటికి ఓడ పూర్తిగా నామరూపాలు లేకుండా ఛిన్నాభిన్నమైపోయింది.

ఓడ మునిగిపోయినా అందులో అమూల్యమైన బంగారాన్ని సంపాదించవచ్చును— అనుకున్నాడు కెప్టెన్ థామస్ డికిన్సన్. కమాండర్ ఇన్ ఛీఫ్ అడ్మిరల్ సర్ థామస్ బేకర్ మాత్రం— మళ్ళీ ఆ సంపదని చేజిక్కించుకోవడం దుర్లభం అన్నాడు. డికిన్సన్ ఆతనితో కొంతసేపు వాదించాడు. చివరికి డికిన్సన్ ప్రయత్నాన్ని కొనసాగించడానికి అనుమతి ఇవ్వక తప్పలేదు థామస్ బేకర్‌కి.

'కేప్‌ఫ్రియో' రియో కి తూర్పున వందమైళ్ళదూరంలో వుంది. 1831 జనవరి 24 డికిన్సన్ తన మొదటి ప్రయత్నంగా ఆ దిక్కుకు వెళ్ళాడు.

చాలరోజుల శ్రమ ఫలితంగా పగిలిన ఓడకి సంబంధించిన శిధిలాల దగ్గరకి చేరుకోగలిగాడు. సముద్రం అడుగున ఇంత లోతుగా వెళ్ళగలిగి ప్రయత్నించిన డికిన్సన్ సాహసాన్ని అంతా మెచ్చుకున్నారు.

కేప్‌ఫ్రియోదగ్గర కెరటాలు చాలా ఉధృతంగావుంటాయి. ప్రవాహం కూడా వేగంగా వుంటుంది. అందుచేత అదంటేనే చాలమంది నావికులకి భయం!

అక్కడ ఒక చిన్నసైజు ద్వీపం వుంది. పూర్తిగా అరణ్యంలా వుంటుంది. సముద్ర తీరంలో బీచ్ లేదు. తీరాన్ని కోసివేసినట్లుగా లోతుగా వుంటుంది. అంగరుగా కూడా అంచవంత లోతుగా వుంటుంది అక్కడి సముద్రం.

కెప్టెన్ డికిన్సన్ ఒక కొత్తరకం పరికరాన్ని సృష్టించాడు. సముద్రంలో ఎంత లోతుకయినా చొచ్చుకుపోగల పరికరం అది.

పరికరం సాయంతో సముద్ర గర్భంలోకి మనిషి ప్రయాణం చెయ్యవచ్చు.

ఇది చాలా కష్టసాధ్యమని బ్రిటిష్ నావికులు తప్పితే ప్రపంచంలో ఎవ్వరూ ఈ విధంగాచేసి వుండలేదనీ నిపుణుల అభిప్రాయం.

కెప్టెన్ డికిన్సన్ సహచరుల్లో చాలామంది ఈ సంపదని వేటాడ్డంలో మరణించారు.

ఒకసారి ఈ పరికరం సముద్రంలో అట్టడుగున రాళ్ళలో చిక్కుపడిపోయింది. దాని-



నవశక్తి ప్రొడక్షన్స్ అధినేత శ్రీ పి. గంగాధరరావుగారి కుమార్తె చి. సౌ. శశికళకు, గుంటూరు వాస్తవ్యులు, శ్రీ విజయాటాకీస్, శ్రీ విజయలక్ష్మి టాకీస్‌ల అధినేత శ్రీ పి. శ్రీరామమూర్తి కుమారుడు చి. దుర్గాప్రసాద్‌కి మదరాసులోని శ్రీ రాజేశ్వరీ కళ్యాణమండపంలో ఆగస్టు 2వ తేదీన వివాహం జరిగినప్పుడు తీసిన చిత్రం.

పునరుద్ధరించడానికి మరి కొంత కాలం పట్టింది. - -

డికిన్సన్ ప్రయత్నం వూరికేపోలేదు. కొన్ని బంగారు కడ్డీలను వెండినాణాలను పైకి తీసుకువచ్చాడు.

అలా కొంత సంపదని కూడగట్టగలిగాడు. దీని విలువ కొన్ని కోట్లు వుంటుంది. ఇదంతా ఇంగ్లాండుకి చేరవేయబడింది.

తక్కిన సంపద అంతా దొరుకుతుందనే ఆశాభావంతో వున్నారు. ఆ సమయంలో మళ్లీ పెద్ద గాలివాన వచ్చింది. కెప్టెన్ డికిన్సన్ పరికరం ఆ గాలివానలో కొట్టుకు పోయింది.

డికిన్సన్ నిరాశపడలేదు. మళ్లీ మరొక పరికరం తయారుచేశాడు. వెతకటం ఆరంభించాడు. ఇలా మరికొంత సంపదని సేకరించగలిగాడు.

గాలివానకాకుండా— ఆ ద్వీపంలో వున్న చీమల్లాంటి విష క్రిములు, దోమలు మా ఆరోగ్యాన్ని పాడుచేశాయి. మా గుడిసెలు పాములతో నిండివుండేవి. పాములు ఎంతగా వుండేవి అంటే అవి మా జేబుల్లోకి చొక్కాల్లోకి దూరి యమయాతన పెడుతుండేవి—అని డికిన్సన్ రాసుకున్నాడు.

కొన్నిరోజుల్లోనే ఈ వేటలో పాల్గొన్న వారందరికీ విరోచనాలు జ్వరం పట్టుకొని పీడించింది.

ఇక ఆ స్థలం ఖాళీచెయ్యక తప్పలేదు. మొత్తంమీద వారు మూడోవంతు బంగారాన్ని మాత్రమే సేకరించగలిగారు. దీని విలువే కొన్నికోట్లు!

డికిన్సన్ సేకరించిన బంగారాన్నంతా అడ్మిరియాల్టీ వారికి అప్పగించాడు.

డికిన్సన్ ఇంగ్లాండు వచ్చినప్పుడు అతనికి సముచితమైన స్వాగతం సత్కారం చెయ్యటానికి జనులు చాలా చిన్న చూపు చూశారు.

న్యాయంగా ఆ సంపద ఎవరెవరికి చెందాలో లెక్కకట్టి పంపకాలు జరిగాయి. కెప్టెన్ డికిన్సన్‌కి అతని అనుచరులకి బహుమతి లభించింది. కాని చాలా తక్కువ.

(అయిపోయింది) ●

ప్రశ్నోత్తరం

— కె. రామలక్ష్మి —

టి. ఆర్. ఆర్, ఆదిలాబాద్

మనిషికి మించిన సృష్టి లేదు. మనిషి సాధించలేనిది లేదు. అలాంటప్పుడు దైవాన్ని పొగడ్డం పూజించడం కూడా దండగ కాదా?

కౌంట్ యువర్ బ్లెస్సింగ్స్ మాన్, బిఫోర్ యూ కామెంట్. దైవం మానవమాత్రుల కోసం సమకూర్చినవి—ఒక్కసారి తిరిగి లెక్కించండి. మానవుని అత్యున్నతపు కలలను కూడా సిగ్గుతో తలవంచేలా చేస్తాయి అవి.. పాడే పిట్ట, వికసించే పువ్వు..వాటి చిరురెక్కలు, కనులకింపైన వర్ణాలు మీరా సృష్టించారు? కష్టాల కెరటాలమీద తుఫాను చెలరేగి మీరు కొట్టుకు పోతున్నప్పుడు సర్వం నాశనమయి పోయిందనుకున్నప్పుడు—భగవంతుడు మీకు ప్రసాదించిన వరాలని లెక్కించుకోండి. మన నుంచి ఏమీ కోరకుండానే ఆయనగారు సమకూర్చినవి—మిమ్మల్ని ఆశ్చర్య చకితులని చేస్తాయి.

ఎం. ఎమ్. ఆర్, కులాఘర్ (యు. పి.)

మనిషికి కాళ్ళూ చేయీ విరిగితే కుంటివాడు అంటారు; మనసు విరిగితే ఏమంటారు?

మనస్సు విరిగిన వాడనండి— నాకేఅభ్యంతరం లేదు.

మీరు మీ సమాధానాల్లో కరుణానిధి గారిని ఎక్కువ పొగుడుతూ వుంటారు...?

ఆయనగారికేం లోటు? మిగిలిన రాజకీయ వేత్తల్లాంటి వారే ఆయనాను. పైగా—సాహితీ వేత్త. మంచి వక్త.

జి. వి. ఆర్, విశాఖపట్నం

ప్రేమించగానే పెళ్లి చేసుకుందాం అంటారు ఆడపిల్లలు. అందుకే మా అబ్బాయిలు భయపడతారు.

అవును అది గ్రహించడానికి అమ్మాయిలకి కొంతకాలము పట్టి—తరవాత తెలుసుకుని బాధపడతారు. మీకు ప్రేమవేరు. పెళ్లివేరు. ప్రేమ ఆదర్శం. పెళ్లి బాధ్యత. ప్రేమజల్సా. పెళ్లి రొటీను—మీకు . కాని ఆడపిల్లలకి—ప్రేమా పెళ్లీ ఒకటే—వాటిని వేరువేరుగా చూడలేరు. అంతేకాదు సహజమైన స్త్రీ పురుషులకి దైనందిన జీవన క్రమంలో సంతోషం లభిస్తుంది. దాన్ని తోసిరాజన్నకంటే. అందుకే బాధ్యతలలో కూడుకున్నదే అయినా వివాహ బంధాన్ని కోరుకుంటారు

కె. ఆర్. ఎమ్, కడప

నేను చింద రెండేళ్లనో అర్థించాను.కాని ఎవరూ చేయూత నివ్వలేదు.

అర్థించే ప్రయత్నంలో స్వయంకృషి మరిచిపోతే ఎలా?! నీకు నువ్వు సహాయం చేసుకునే ప్రయత్నం చేస్తే కదా— పైవారైనా దైవమైనా చేయూత నిచ్చేది?

ఆర్, కె. ఆర్, సోంపేట

సంస్కారం అంటే ఏమిటి?

ఇంటా—బయటా మన ప్రవర్తన.

స్త్రీ పురుషుని జీవితంలో అనుక్షణం ఆనందాన్ని పంచి యిస్తుంది. అనుక్షణం వేధించే అంతులేని సమస్యగా తయారు అయింది.

చిత్తం. ఆనందం వద్దనుకోండి. హాయిగా వేధింపు తప్పి పోతుంది.

వి. ఎన్, కోరట్ల

హృదయం లేని మనుష్యుల మధ్య జీవించడం ఎట్లా?]

మన హృదయాన్ని భద్రపరుచుకుంటూ బ్రతికెయ్యడమే . లేకుంటే మనకీ హృదయం లేకుండా పోతుంది.

డి, ఎస్. కె, మద్రాసు

ఎందుకు కొందరు అవసరంలో మోసం చెయ్యాలని చూస్తారు?]

గెలిచే అవకాశం వున్నప్పుడు గేమ్ న్యాయంగా ఆడాలని తెలియక

ఆర్. కె. ఆర్, విజయవాడ

బీనాదేవి ఎవరు?

"బి." నరసింహరావుగారి భార్య అనంటాను!

ఎస్. ఎమ్. కానుమోలు

కథలు రాయాలంటే ముఖ్యంగా తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి ?

పత్రికలవారు ఎప్పటికప్పుడు—రాస్తూనే వుంటారు బదర్—కాగితానికి ఒకవైపు రాయమని, తగిన స్టాంపులు జతపరుచమని......

ఎస్. పి. ఆర్, విశాఖపట్నం

మనిషే దేవుడైతే ?

భక్తులకు ప్రసాదం మిగలదు!

దేవుడే మనిషైతే ?

పాటివాడిని చూసి ఓర్వలేక కళ్లు కుట్టుకుంటాడు!

జగదీశ్, కర్నూలు

బ్రతుకుతెరువుకు పనికిరాని మంచితనం ముఖ్యమా ?

కాదు. పరమానందయ్య శిష్యుల ప్రవర్తనలాగే వుంటుంది—అది.

బ్రతుకుతెరువు చూపే ఆత్మవంచన మంచిదా ?

మంచిదే—అది పరవంచనగా—మారనంతవరకూ!

కె. పి, జనగామ

మనిషికి డబ్బు అంటే ఆశ ఎందుకుంటుందండీ ?

డబ్బుతో — చాలా సాధించవచ్చు— యీ ప్రపంచంలో.

ఎమ్. ఎల్. ఎన్, కడప

ఈ సమాజంలోని మనుష్యులపై—మీ అభిప్రాయం ?

నేనీ సమాజానికి దూరం కాదు. ఎలా చెప్పగలను? ...సమాజంలో అందరూ మనుష్యులే — దేవతలు కాదు. అది మరిచిపోకండి.

జి. ఆర్. ఎమ్. ఆర్, ఖర్గపూరు

నేటి స్త్రీ పురుషులు శీలాన్ని పోగొట్టుకొన్న తరువాతనే వివాహం చేసుకొంటున్నారు.

ఇలాంటిమాట అనేముందు—అలా అనడానికి ఆధారం చూపించకల్గాలి రావుగారూ! ఎంత మందిని ప్రశ్నించి లెక్కలు తీశారు?! మీచుట్టూ వున్న పల్లుగురే—ప్రపంచం అనుకోకండి.

ఎ. వి. ఆర్, కోరుకొల్లు

ఉపాధ్యాయ వృత్తి, అన్ని ఉద్యోగములకంటే పవిత్రమైనదని నా ఉద్దేశ్యం.

నిజం చెప్పారు. కాని ఏం లాభం? బోగస్ పవిత్రతకి ఉన్న విలువ మనవాళ్ళు అసలు పవిత్రతకి యివ్వరు.....భావి భారత పౌరులకు రూపురేఖలు దిద్ద కల్గిన దిట్టలకు ఆర్థికమైన హంగులేం లేవు సరి కదా—ఏనెలకానెల జీతమేనా వస్తుందా అని! మన ప్రభుత్వం నిజంగా సిగ్గుపడవలసిన పరిస్థితి యిది. అనవసరపు రాజకీయపు బెత్తులకి పావులయే విద్యార్థులు నినాదాలు చేస్తారు, సమ్మెలు చేస్తారేగాని తను గురువు—తమకు ప్రత్యక్ష దైవంగా ఎంచి—వారిని బాగుపరచే చర్యలు ప్రభుత్వం తక్షణం చేకొనేలా—ఎందుకు పట్టు పట్టరు? ఈతిబాధలతో కృంగిపోయే ఉపాధ్యాయుడు తన శిష్యులకెలా ఉత్సాహం పోస్తాడు? ఉత్తేజం కల్గిస్తాడు? ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1; and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3.
Editor: S. Radhakrishna.

కల్తీ సిమెంట్ కనుగొనుట కష్టం...


కాని కె.సి.పి. దుర్గా సిమెంట్‌తో కాదు. వాటి లేతరంగు
కల్తీ సాధ్యపడనివ్వదు. ఒకవేళ చేసినా కనుగొనుట సులభం
కనుక మీ ఊహాసౌధాలకు ప్రథమ స్థానం కె.సి.పి. దుర్గా సిమెంట్‌దే.

అత్యధిక శక్తి

శాశ్వతమైన స్థిరత్వానికి, దృఢత్వానికి.

బీటల నిరోధి—

బీటలు కనీసం వెంట్రుకవాసి కూడా ఏర్పడవు. కట్టడములోను, ప్లాస్టరింగులోను కూడా.



కమనీయత—


చక్కని మెరుపుతో, నునుపుతో కన్నులపండువుగా నుండటం ఉన్నతమైన కె.సి.పి. దుర్గా సిమెంట్‌లకు సహజం. ఈ సారి మీ అవసరాలకు మా సిమెంట్ వాడి చూడండి.

కె.సి.పి. దుర్గా సిమెంట్‌తో కల్తీ అసాధ్యం

తయారుచేయువారు:

ది ఆంధ్రా సిమెంటు కంపెని లిమిటెడ్.
సేల్సు ఆఫీసు విజయవాడ-3

ది కె.సి.పి. లిమిటెడ్.
సిమెంట్ సేల్సు డివిజన్
38, మౌంట్ రోడ్, మద్రాసు-6.



SISTA'SKCP.229TE

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

కట్టుకున్న భార్యని ఆకట్టుకోడంకోసం విచిత్రవేషాల్లో జీవేత మనిపించిన భర్త అపూర్వగా

